


www.voodyam.com

Estd :1999

# వృదయం

మంగళవారం, అక్టోబర్ 14, 2025 | గుంటూరు | సంపుటి : 12 | సంచిక : 241 | వెల : రూ. 3.00 | పేజీలు : 12

VOODAYAM TELUGU DAILY

/VOODAYAM

Simultaneously published from Guntur, Hyderabad, Adilabad, Khammam, Karimnagar & Warangal






### అమరావతి రైతుల త్యాగాలు

# ఎప్పటికీ మరువను

**: సీఎం చంద్రబాబు**

అమరావతి: అమరావతి: రాజధాని అమరావతి ప్రాంత రైతుల త్యాగాలను ఎప్పటికీ మరువనని సీఎం చంద్రబాబ అన్నారు. రైతుల అవస్థలు చూశానని.. రోడ్డెక్కి ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. రాజధాని ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. అమరావతిలో సీఆర్డీఏ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం సీఎం మాట్లాడారు.

"ఇవాళ చాలా ఆనందంగా ఉంది. మొదటిగా సీఆర్డీఏ భవనం ప్రారంభమైంది. తొలిసారి ల్యాండ్ పూలింగ్ కింద భూములిచ్చిన చరిత్ర అమరావతి రైతులది. రాబోయే రోజుల్లో ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు వస్తాయి. రాష్ట్ర విభజన జరిగినప్పుడు రాజధాని కూడా లేని పరిస్థితి. రాజధాని ఎక్కడో చెప్పకుండా అప్పటి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన చేసింది. రాష్ట్ర భవిష్యత్తుకు ఉపయోగపడేలా.. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా నిర్మించాలని ఆనాడు నిర్ణయం తీసుకున్నాం. విజయవాడ-గుంటూరు మధ్యలో రాజధాని ఉంటే బాగుంటుందని నిర్ణయించాం. అప్పటికే ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ తయారు చేశాం. రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చేందుకు రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. ప్రపంచ చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో భూసమీకరణ జరిగింది ఒక్క అమరావతిలోనే. గతంలో హైటెక్ సిటీ నిర్మించినప్పుడు నా విజన్ చెబితే అవహేళన చేశారు. హైదరాబాద్‌లో 5 వేల ఎకరాల్లో ఎయిర్‌పోర్టు నిర్మించాం. ఎయిర్‌పోర్టుకు భూమి ఇవ్వాలని ఆనాడు కోరితే రైతులు వెంటనే ఇచ్చారు. అక్కడ భూములు కొన్నవారు బ్రహ్మాండంగా బాగుపడ్డారు"అని చంద్రబాబు అన్నారు.ఆ ముగ్గురికి రాజధాని రైతు సమస్యల పరిష్కార బాధ్యతరాజధాని రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ముగ్గురికి చంద్రబాబు బాధ్యతలు అప్పగించారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌కు అప్పగిస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఏ సమస్య ఉన్నా ఈ ముగ్గురు నేతలతో చెప్పి పరిష్కరించుకోవాలని సూచించారు. నేతలు సైతం తరచూ రైతులతో సమావేశాలు నిర్వహించాలని సీఎం ఆదేశించారు.

### అఖిల భారత పోలీస్ పవర్ లిఫ్టింగ్ క్లస్టర్ పోటీలను

## ప్రారంభించిన హోం మంత్రి

- క్రీడలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుంది.
- పోలీసుల్లో క్రీడా స్ఫూర్తిని నింపేందుకే పోటీలు.
- పవర్ లిఫ్టింగ్‌తో పాటు, యోగా పోటీలను నిర్వహించటం చాలా సంతోషంగా ఉంది.

.హోం మంత్రి అనిత.





అమరావతి ,అక్టోబర్ 13 (వృదయం ప్రతినిధి): అఖిల భారత పోలీస్ పవర్ లిఫ్టింగ్ క్లస్టర్ పోటీలను రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఈరోజు (సోమవారం)ఏపీఎస్పీ 6వ బెటాలియన్ లో ప్రారంభించారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ..ఐదు రోజుల పాటు రెండు ప్రాంతాల్లో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోలీసుల క్రీడా స్ఫూర్తిని నింపేందుకు గత ఏడాది ఈ పోటీలు ప్రారంభించామని చెప్పారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయిన తర్వాత మొదటి సారిగా పోటీలు జరగటం శుభ పరిణామమన్నారు. పవర్ లిఫ్టింగ్‌తో పాటు, యోగా పోటీలను నిర్వహించటం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. యోగాలో రాష్ట్రం గిన్నిస్ బుక్ సాధించిన సంగతి తెలిసిందే అని అన్నారు. రాజధానిలో స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. క్రీడలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందన్నారు. అన్ని రాష్ట్రాల నుంచి 1011 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనున్నారని మంత్రి అనిత పేర్కొన్నారు.

### అమరావతిలో సీఆర్డీఏ ప్రధాన కార్యాలయాన్ని

# ప్రారంభించిన సీఎం చంద్రబాబు



అమరావతి,అక్టోబర్ 13 (వృదయం ప్రతినిధి): రాజధాని అమరావతిలో సీఆర్డీఏ ప్రధాన కార్యాలయ భవనాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. పూర్ణకుంభం, వేదాశీర్వచనాలతో ఆయనకు వేదపండితులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భూములిచ్చిన రైతులను సీఎం ఆత్మీయంగా పలకరించారు. 4.32 ఎకరాల్లో 3,07,326 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏడు ఫ్లోర్లలో (జీ+7) సీఆర్డీఏ భవనాన్ని నిర్మించారు. సీఆర్డీఏ సహా.. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖకు అనుబంధంగా ఉన్న రాష్ట్ర కార్యాలయాలన్నీ ఇందులోకి రానున్నాయి. రాజధాని అమరావతిని ప్రతిబింబించేలా భవనం ముందు 'ఏ' అక్షరం ఎలివేషన్‌తో తీర్చిదిద్దారు.

సకల హంగులతో సీఆర్‌డీఏ భవనం

ప్రధాన కార్యాలయానికి పక్కనే మొత్తం 8 ఎకరాల్లో మరో 4 భవనాలు ఏర్పాటు చేశారు. ఒక్కో భవనం 41,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. పాలనా సౌలభ్యం కోసం హెచ్‌వోడీలన్నీ ఒకేచోట ఉండేలా భవనాల నిర్మాణం చేపట్టారు. సీఆర్డీఏ భవనం మొదటి అంతస్తులో సమావేశ మందిరాలు ఏర్పాటు చేశారు. 2, 3, 5 అంతస్తుల్లో సీఆర్డీఏ, నాలుగో అంతస్తులో సీడీఎంఏ పురపాలక డైరెక్టరేట్ ఉంది. ఆరో అంతస్తులో అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేశారు.

### సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులుగా

## కె.ఎస్. విశ్వనాథన్ బాధ్యతల స్వీకారం



విజయవాడ ,అక్టోబర్ 13 (వృదయం ప్రతినిధి): ఆంధ్ర ప్రదేశ్ సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులుగా కె.ఎస్. విశ్వనాథన్ సోమవారం ఉదయం ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ లో గల సమాచార పౌర సంబంధాల శాఖ రాష్ట్ర కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సమాచార శాఖ సంచాలకులుగా ఉన్న హిమాన్షు శుక్లా శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా నెల్లూరు కలెక్టర్ గా ప్రభుత్వం బదిలీ చేసిన అనంతరం ప్రఖర్ జైన్ కు సమాచార పౌర సంబంధాల శాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్మెంట్ అథారిటీ కమిషనర్ గా ఉన్న కె.ఎస్. విశ్వనాథన్ ను సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులుగా నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. గతం లో ఆయన అనంతపురం అసిస్టెంట్ కలెక్టర్ గా, నరసాపురం సబ్ కలెక్టర్ గా, ప్రకాశం, విశాఖపట్టణం జిల్లాల జాయింట్ కలెక్టర్ గా బాధ్యతలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో సోమవారం బాధ్యతలు స్వీకరించిన విశ్వనాథన్ కు సమాచార శాఖ ఉన్నతాధికారులు, అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం శాఖ కార్యకలాపాలు,

నిర్వర్తిస్తున్న విధులపై అధికారులతో నూతన సంచాలకులు సమీక్షించారు.

### గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల పదోన్నతులపై

# ప్రభుత్వం కసరత్తు



అమరావతి ,అక్టోబర్ 13 (వృదయం ప్రతినిధి): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల పదోన్నతులపై ఏపీ ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. పదోన్నతుల కల్పనపై అధ్యయనానికి మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసింది. మొత్తం 10 మంది మంత్రులతో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ (జీవోఎం)లో సభ్యుడిగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు అచ్చెన్నాయుడు, అనిత, నారాయణ, డీఎస్‌బీవీస్వామి, అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, సత్యకుమార్ యాదవ్, గొట్టిపాటి రవికుమార్, సంధ్యారాణి సభ్యులుగా ఉన్నారు.గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పదోన్నతులపై అధ్యయనం చేయాలని సబ్‌కమిటీని ప్రభుత్వం ఆదేశించింది. ఇంటర్‌మీడియేటరీ పోస్టుల సృష్టిపై చర్చించాలని, ఒక వేళ పోస్టులను సృష్టించాలనుకుంటే.. పే స్కేల్ నిర్ణయించాలని ఆదేశించింది. ఇతర విభాగాల్లో ప్రమోషన్ ఛానల్ అంశంపై అధ్యయనం చేయాలని ఆదేశించింది. పదోన్నతుల ఖరారుకు ఆయా విభాగాలకు సూచనలు జారీ చేయాలని కోరింది. పదోన్నతుల తర్వాత ఖాళీలు భర్తీ చేసే పద్ధతిపైనా చర్చించాలని సూచించింది. వీలైనంత త్వరగా అధ్యయనం చేసి.. సిఫార్సులతో నివేదించాలని పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

### భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ పర్యటనను

# విజయవంతం చేద్దాం

నంద్యాల ,అక్టోబర్ 13 వృదయం :నంద్యాల జిల్లాలో ఈ నెల 16 వ తేదీ గురువారం భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పర్యటనను విజయవంతం చేద్దామని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు. సోమవారం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ అష్టాదశ శక్తి పీఠం, ద్వాదశ జ్యోతిర్లింగం రెండూ ఒకేచోట ఉంటూ భూమికి నాభిలా భకైలాసంగా విరాజిల్లుతూ నిత్య పూజలు అందుకుంటూ రాష్ట్రంలోనే రెండవ ప్రముఖ పుణ్య క్షేత్రంగా నంద్యాల జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలానికి భారత ప్రధానమంత్రి రావడం ఎంతో శుభపరిణామమనీ, రాయలసీమ అభివృద్ధికి ప్రధానమంత్రి పర్యటన ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. శ్రీశైల



నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

శ్రీభ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్లకు భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రత్యేక పూజలు, దర్శనం అనంతరం నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గం ఓర్వకల్లు మండలం నన్నూరు వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు లబ్ది చేకూరే అంశం, రాయలసీమ అందులో నంద్యాల జిల్లా సమగ్రాభివృద్ధిపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రసంగించనున్నారని ఆమె తెలిపారు. ఈ బహిరంగ సభ సుమారు 3 లక్షలకు పైగా ప్రజలతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చెప్పారు. రాయలసీమ, ఉమ్మడి కర్నూలు జిల్లా, ముఖ్యంగా నంద్యాల జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, బైరెడ్డి అనుచరులు అధిక సంఖ్యలో తరలివచ్చి భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ పర్యటనను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.



### మొబైల్ కిట్స్‌తో

## పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట

విశాఖ ,అక్టోబర్ 13 (వృదయం ప్రతినిధి): పౌర సరఫరాల శాఖలో సంస్కరణలు తీసుకొస్తున్నామని.. మార్పు మొదలవుతోందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విశాఖలో పీడీఎస్ బియ్యాన్ని గుర్తించే ర్యాపిడ్ కిట్స్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గతేడాది కాకినాడ పోర్టులో బియ్యం అక్రమ రవాణాపై చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కాకినాడ నుంచి రవాణా అయ్యే ప్రతి సరకును పరిశీలించి జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 5,65,000 క్వింటాళ్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. విశాఖ నుంచి పీడీఎస్ బియ్యం ఎగుమతులు జరగకుండా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. నగరంలో 33 మంది సిబ్బందితో 3 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. "ఇతర రాష్ట్రాల నుంచి తరలివస్తున్న బియ్యాన్ని కూడా పూర్తిగా పరిశీలిస్తున్నాం. నిఘా విభాగం అధికారులు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఏపీలో 700 మొబైల్ కిట్స్ సిద్ధం చేశాం. అక్రమంగా ఎగుమతి చేసే పీడీఎస్ బియ్యాన్ని గుర్తించేందుకు ఇవి ఉపయోగపడతాయి.

చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేశాం. ఈ ఏడాది నుంచి ప్రజలకు నాణ్యమైన బియ్యం అందిస్తాం. ఇప్పటికే స్మార్ట్ రైస్ కార్డులు, క్యూఆర్ కోడ్ జారీ చేశాం. దుకాణాలకు ఎంత బియ్యం తరలించాం.. పంపిణీ ఎంత అవుతుందనే వివరాలు సేకరిస్తున్నాం" అని నాదెండ్ల మనోహర్ వివరించారు.

# సంపాదకీయం

## రిజర్వేషన్ల రాజకీయంపై శాశ్వత పరిష్కారం ఏంటి?

ప్రజాస్వామ్యంలో రిజర్వేషన్లు కేవలం రాజకీయ సాధనాలు కావు, అవి సామాజిక న్యాయానికి ఒక నిలువుటద్దం. తెలంగాణ హైకోర్టు, స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీలకు) 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో- 9పై స్టే విధించింది. జీవో ఎంఎస్ నెం. 41, 42 అసంబద్ధమైనవి, రాజ్యాంగ విరుద్ధమైనవిగా పరిగణించబడినాయి. రాజ్యాంగమే సర్వోన్నతమైనది కావున, ఏ కార్యనిర్వాహక ఉత్తర్వు అయినా రాజ్యాంగ సూత్రాలను అతిక్రమిస్తే, న్యాయవ్యవస్థ దానిని రద్దు చేసే అధికారం కలిగి ఉంటుంది. ఈ రిజర్వేషన్ల ప్రక్రియ దేశవ్యాప్తంగా ఒక సంక్లిష్టమైన అధ్యాయంగా మారింది. భారత రాజ్యాంగంలోని 73, 74వ సవరణలు స్థానిక స్వపరిపాలన సంస్థలకు రాజ్యాంగబద్ధతను కల్పించాయి. ఈ సవరణల ప్రకారం, ఆర్టి కల్ 243డి (గ్రామీణ సంస్థలు), ఆర్టికల్ 243టి (పట్టణ సంస్థలు) షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ), మహిళలకు రిజర్వేషన్లు తప్పనిసరి చేశాయి. అదే సమయంలో, వెనుకబడిన తరగతులకు (బీసీలకు) రిజర్వేషన్లు కల్పిం చే అధికారాన్ని రాష్ట్ర శాసనసభలకు అప్పగించాయి. అయితే, ఈ రిజర్వేషన్ల అమలు విషయం లో చాలా రాష్ట్రాలు న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఈ సమస్యకు ప్రధాన కారణం, రిజర్వేషన్ల పరిమితిపై సుప్రీంకోర్టు ఇచ్చిన వివిధ తీర్పులే. బీసీల రాజకీయ సాధికారతకు రిజర్వేషన్లు ఎంతో అవసరం. 1980లో మండల్ కమిషన్‌తో కేంద్ర ప్రభు త్వ ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సిఫార్సు చేసిన ఈ నివేదిక, బీసీ రాజకీయాలకు ఒక కొత్త శకాన్ని ప్రారంభించింది. ముఖ్యం గా, 'ఎం.ఆర్. బాలాజీ వర్సెస్ స్టేట్ ఆఫ్ మైసూ ర్' కేసులో రిజర్వేషన్లు ఏ కారణం చేత కూడా 50 శాతానికి మించరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు ఆధారంగానే 'ఇందిరా సా హ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో రిజర్వేషన్ల పరిమితిపై సుప్రీం స్పష్టతనిచ్చింది. మొత్తం రిజర్వేషన్లు ఎట్టి పరిస్థితుల్లోనూ 50 శాతానికి మించరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు ప్రధానంగా విద్యా, ఉద్యోగ రంగాలకు సంబంధించింది. దీనికి అదనంగా, 'కృష్ణమూర్తి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసుతో స్థానిక సంస్థల రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీంకోర్టు 'త్రిశూల పరీక్ష' విధానాన్ని తీసుకొచ్చింది. ఈ త్రిశూల పరీక్ష ప్రకారం, బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలంటే మూడు షరతులను తప్పనిసరిగా పాటించాలి. అవి రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల స్థితిగతులపై ఒక ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసి, వారి రాజకీయ వెనుకబాటుతనంపై శాస్త్రీయ, వాస్తవిక డేటాను సేకరించాడం రెండు ఈ డేటా ఆధారంగా రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించడం, మూడు ఈ రిజర్వేషన్లు ఎస్సీ, ఎస్టీలతో కలిపి మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా చూసుకోవడం. ఈ మూడు షరతులు పాటించకుండా బీసీ రిజర్వేషన్లు కల్పించడం న్యాయస్థానాల్లో నిలబడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ నిబంధనలే నేడు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు అతిపెద్ద సవాలుగా నిలిచాయి.రాజకీయంగా ఈ సమస్యను పరిష్కరించడానికి, సుప్రీంకోర్టు నిర్దేశించిన 'త్రిశూల పరీక్ష'ను దృష్టిలో ఉంచుకొని, తెలంగాణ ప్రభుత్వం శ్రీ బూసాని వెంకటేశ్వరరావు, ఐ.ఎ.ఎస్. (రిటైర్డ్) చైర్మన్ గా ఏక వ్యక్తి కమిషన్ మార్చి 2025లో తన నివేదికను సమర్పించింది. తమ విశ్లేషణలో, కమిషన్, విద్య, ఉద్యోగాల్లో, ముఖ్యంగా స్థానిక సంస్థలలో రాజకీయ ప్రాతినిధ్యం కోసం బీసీలకు కనీసం 42 శాతం రిజర్వేషన్లు ఉండాలని సిఫార్సు చేసింది. ఈ రిజర్వేషన్లను అమలు చేయడానికి విద్య, ఉద్యోగాలకు రెండు వేర్వేరు చట్టాలను రూపొందించాలని కూడా కమిషన్ సిఫార్సు చేసింది.న్యాయపరమైన అడ్డంకులు, సుప్రీంకోర్టు తీర్పుల నేపథ్యంలో, తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల పెంపు ఒక నిరంతర రాజకీయ, చట్టపరమైన పోరాటంగా మారింది. ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న నిర్ణయంలో భాగంగా, తెలంగాణ శాసనసభలో తెలంగాణ మున్సిపాలిటీలు (మూడవ సవరణ) బిల్లు, 2025, తెలంగాణ పంచాయతీ రాజ్ (మూడవ సవరణ) చట్టం, 2025లను ఆమోదించింది. విచిత్రమేమిటంటే, గతంలో ఇదే అంశంపై రెండు బిల్లులు, ఒక ఆర్డినెన్స్ రాష్ట్రపతి ఆమోదం కోసం వేచి చూస్తున్న సమయంలో ఈ బిల్లులను శాసనసభలో ఆమోదించారు. ఇది గవర్నర్ వద్ద ఉండగానే జీవో -9 ద్వారా రాబోయే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం కోటాను అమలు చేసే ప్రయత్నం విఫలం అయింది. ప్రభుత్వం వెనుకబడిన తరగతులకు కల్పించిన 42 శాతం రిజర్వేషన్‌పై రాష్ట్ర హైకోర్టు స్టే విధించింది. ఈ 42 శాతం రిజర్వేషన్లలోని 17 శాతం వాటాను సాధారణ కేటగిరీ (జనరల్ కేటగిరీ) కింద పరిగణించి ఎన్నికలను నిర్వహించుకోవచ్చునని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ సమస్యకు ఒక శాశ్వత పరిష్కారం రాజ్యాంగ సవరణ మాత్రమే. ప్రస్తుతం స్థానిక సంస్థల రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని ఎత్తివేయాలంటే పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేయాలి. విద్య, ఉద్యోగ రంగాల్లో తమిళనాడు రాష్ట్రం ఇదే మార్గాన్ని అనుసరించి, 69 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తోంది. ఈ మొత్తం వ్యవహారానికి సంబంధించి ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం, న్యాయవ్యవస్థ, ప్రజాకాంక్షల మధ్య నెలకొన్న సంక్లిష్ట పోరాటంలో చివరి విజయం ఎవరిదనేది కాలమే నిర్ణయించాలి.

# దేశ రక్షణ పరిశోధనలో ఆద్యుడు సూరి భగవంతం

సూరి భగవంతం (అక్టోబరు 14, 1909 – ఫిబ్రవరి 6, 1989) (వయసు 79) ప్రముఖ శాస్త్రవేత్త. దేశ రక్షణకు సంబంధించిన పరిశోధనల్లో ఆద్యుడు.ఆయన కృష్ణా జిల్లా ఆగిరిపల్లి గ్రామంలో అక్టోబరు 14, 1909 న జన్మించారు. ప్రాథమిక విద్యా భ్యాసం అనంతరం హైదరాబాదు నిజాం కళాశాలలో డిగ్రీ (బి.ఎస్సీ) చదువు పూర్తిచేసి, మద్రాసు యూనివర్సిటీ నుండి బి.ఎస్.సి (భౌతిక శాస్త్రము) డిగ్రీని ప్రథమ శ్రేణిలో ప్రథముడుగా అందు కున్నారు. ఈ సందర్భంగా అనేక పతకాలను అందుకున్న విద్యార్థిగా కలకత్తాలో సర్ సి.వి.రామన్ దగ్గర రీసెర్చ్ స్కాలర్ గా చేరారు. ఆయన తన మేథో సంపత్తితో, శాస్త్రీయ దృక్పథంతో, ఆలోచనా సరళితో, ప్రయోగ శీలతతో సి.వి.రామన్ అభిమానాన్ని చూరగొని ప్రియ శిష్యుడయ్యారు. అక్కడే మద్రాసు విశ్వ విద్యాలయం నుండి ఎం.ఎస్సీ. పట్టాను సంపాదించారు.ఆయన 1932లో ఆంధ్ర విశ్వ విద్యాలయంలో భౌతిక శాస్త్ర విభాగంలో అధ్యాపకుడుగా చేరారు. 1938లో ప్రొఫెసర్ గా పదోన్నతి పొందారు. బోధనా విధానంలో వీరిది చాలా సులభ శైలి. స్పష్టమైన వ్యక్తీకరణ, విశేషమైన ఆలోచన, కచ్చితమైన అనువర్తన, సమగ్రమైన దృష్టి, అద్భుతమైన ప్రతిభలన్నీ కలగలిపి అయన బోధనా విధానాన్ని ఇతర శాఖల అధ్యాపకులు కూడా నేర్చుకునే వారని చెబుతారు. తమ 28 వ యేటనే యింతటి ఉన్నత పదవిని అదిష్టించటం విశేషం. దీనికి కొద్ది కాలం ముందే యూనివర్సిటీ ఆయనకు డి.ఎన్‌సి డిగ్రీ ప్రదానం చేసింది. ఆయన 1948 వరకు ఈ పదవిలోనే ఉన్నారు. భగవంతం 1941లో కళాశాల ప్రిన్సిపాల్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో తన పరిపాలనా కౌశలం చూపి కళాశాలను విజయ వంతంగా నడిపారు. 1948–49 మధ్య లండన్ లోని భారత రాయబారి వి.కె. కృష్ణ మీనన్ కార్యాలయంలో వైజ్ఞానిక సలహాదారుగా పని చేశారు. చాలా ఐరోపా దేశాల్లో పర్యటించి వివిధ విజ్ఞాన విషయాల మీద ప్రసంగాలు చేశారు.1949లో స్వదేశం తిరిగి వచ్చి ఉస్మానియా విశ్వ విద్యాలయంలో భౌతిక శాఖాధిపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. పరిశోధన వైపు దృష్టి కేంద్రికరించి 12 మంది డాక్టరేట్ లను తయారు చేశారు. తరువాత 1952లో విశ్వ విద్యాలయ ఉప కులపతిగా పదవిని చేపట్టారు. 1957లో డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఓ) సారథిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు ప్రొఫెసర్ సూరి భగవంతం బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్‌గా ఉన్నారు. అక్కడ పని చేస్తుండగా కృష్ణ మీనన్ ఒత్తిడి మీద 1961లో రక్షణ శాఖ పరిశోధనా సంస్థకు అధిపతిగాను, తనకు వైజ్ఞానిక సలహాదారుగా చేరారు. ఆ సమయంలో ప్రొఫెసర్ భగవంతం రక్షణ అవసరాలను తీర్చడానికి అనువర్తిత పరిశోధన, అభివృద్ధి దిశలో డీఆర్డీఓ ను నైపుణ్యంగా నడిపించారు. సుమారు ఎనిమిది సంవత్సరాలు డిఆర్‌డిఓ హెడ్‌గా పనిచేశారు. అక్టోబర్ 1969 లో తన పదవి నుండి పదవీ విరమణ చేసే సమయానికి, సంస్థ అనేక రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించింది. 1962 చైనా–భారత్ యుద్ధం తర్వాత వై. బి. చవాన్ రక్షణ మంత్రిగా ఉన్నప్పుడు ఆయన డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ ఆర్గనైజేషన్ (డి.ఆర్.డి.ఒ.) అధిపతిగా చేరి ఎంతో ప్రగతి సాధించారు. భారత దేశమంతా ఇరవైకి పైగా ప్రయోగ శాలలను ప్రారంభించి యుద్ధ రంగానికి అవసరమైన క్షిపణులు, విమానాలు, ట్యాంకులు, రాడార్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు మొదలైన అనేక విషయాలలో విజయం సాధించారు. 1969లో పదవీ విరమణ చేశారు.ఆయన 300 పైగా పరిశోధన వ్యాసాలు ప్రచురించారు. ఇవి కాక గ్రూపు థియరీ, రామన్ ఎఫెక్ట్, క్రిస్టల్ సిమెట్రీ అండ్ ఫిజికల్ ప్రాపర్టీస్ అనే మూడు గ్రంథాలు రచించారు.1961 జూలైలో కేంద్ర ప్రభుత్వ సర్వీస్ లో ప్రవేశించిన ప్రొఫెసర్ భగవంతం రక్షణ మంత్రికి సైంటిఫిక్ అడ్వయిజర్ గా నియమితు లైనప్పటికీ, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డి.ఆర్.డి.ఓ) కు డైరక్టర్ జనరల్ గా కూడా వ్యవహరించారు. భూతలం మీద, సముద్ర జలాల మీద, గాలిలో దేశ పోరాట శక్తులను అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో బలోపేతం చేయటానికి డి.ఆర్.డి.ఓని ఒక సమర్థవంత మైన పనిముట్టుగా రూపొందిం చారు. శక్తివంతమైన అయుధంగా మలిచారు. ఆర్.డి.ఓను పటిష్ఠ పరచడంలో ఈయన చేసిన కృషి అసమానం. ఆర్గనైజేషన్ బ్రహ్మాండ మైన ఎదుగుదలను సాధించింది. అనేకానేక ల్యాబరేటరిలను, సుశిక్షితులను రూపొందించారు. రక్షణ శాఖ పరిశోధనలలో అనేక మంది శాస్త్రవేత్తలకు ప్రవేశం కల్పించి, వారి మేధస్సుకు పదును పెట్టారు.డి.ఆర్.డి.ఓకు నేతృత్వం వహించిన 9 సంవత్సరాల వ్యవధిలో మిస్సైల్స్, ఎయిర్ క్రాఫ్ట్స్, ఏరో ఇంజన్స్, కొంబాట్ వెహికల్స్ (ట్యాంకులు మొదలైనవి) ఎలక్ట్రానిక్ వార్ ఫేర్ సిస్టమ్స్, హై ఎక్స్‌ప్లోజివ్స్, అండర్ వాటర్ వెపన్స్ మొదలగు వాటిని అభివృద్ధి చేయటానికి ల్యాబరేటరీలను స్థాపించారు. ఆధునిక యుద్ధ తంత్ర సాంకేతిక నైపుణ్య రంగంలో ఉన్న ఉద్యోగులకు శిక్షణ ఇప్పించారు. వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించారు.దేశ రక్షణ శాఖకు అద్వితీయమైన సేవలు అందిస్తూనే మరోపక్క అవాంఛనీయ పోకడలను గమనిస్తూనే ఉన్నారు. ఒకసారి నోబెల్ బహుమతి గ్రహీత, భారత మిత్రుడు ప్రొఫెసర్ పి.ఎం.ఎస్. బ్లాకెట్ ప్రధాని నెహ్రూకు ఒక సలహా యిచ్చారు. దేశ రక్షణ శాఖ అభివృద్ధి చెందడానికి దేశీయ ఉత్పత్తుల రూపకల్పనను మినహాయించి ప్రత్యామ్నాయంగా దిగుమతులు చేసుకోవలసినదని, రాడార్స్, మిస్సైల్స్, యుద్ధ ట్యాంకుల కోసం దిగుమతుల మీద ఆధారపడటం ఉత్తమమని సలహా యిచ్చారు. ఈ సలహాను పూర్తిగా నిర్లక్ష్య పరిచేలా చేసిన ప్రొఫెసర్ భగవంతం మన దేశం సర్వదా కృతజ్ఞతగా ఉండాలి. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖకు శాస్త్ర సలహాదారునిగా విశేష కృషి చేసి, జాతీయ భావాలకు పరిపుష్టి కల్పించి అఖండ పేరు ప్రఖ్యాతులు సంపాదించారు.భౌతిక శాస్త్ర రంగంలో మూడు ప్రామాణిక గ్రంథాలను, అనేక పరిశోధనా పత్రాలను వెలువ రించారు. రామన్ ఎఫెక్ట్ అంశం మీద వివిధ కోణాలలో అధ్యయనం చేశారు. పునః పరిశోధనలు జరిపారు. "మాలిక్యులర్ లాటిస్ వైబ్రేషన్" అంశం మీద గ్రూప్ థియరిటికల్ అప్లికేషన్స్, వాయువుల గూర్చి రామన్ ఎఫెక్ట్ కు సంబంధించిన పరిశోధనలు మీద సునిశిత కృషి జరిపారు. ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ, ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ లలో ఫెలోషిప్ మీద పరిశోధనలు నిర్వహించారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోషియేషన్ వారి భౌతిక శాస్త్ర విభాగానికి అధ్యక్షులుగా (1946) వ్యవహరించారు."1961 లో క్రిస్టల్ సిమెట్రీ అండ్ ఫిజికల్ ప్రాపర్టీస్" అనే బృహత్తర గ్రంథ రచన చేసి అంతర్జాతీయ ఖ్యాతిని పొందారు. కమిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ ద డెవలపింగ్ కంట్రీస్ అధ్యక్షులుగా సి.వి.రామన్ పరిశోధించిన రామన్ ఎఫెక్టు అంశం మీద ప్రామాణిక పరిశోధనలు చేసిన అద్వితీయ శాస్త్రవేత్తగా కీర్తి గడించారు. రామన్ ఎఫెక్ట్, క్రిష్టల్ స్ట్రక్చర్ మొదలగు అంశాల మీద అవిశ్రాంత పరిశోధనలు జరిపి గ్రంథ రచనలు చేశారు. ఆయన 300 పైగా పరిశోధనా పత్రాలను వెలువ రించారు. గ్రూప్ థీరీ, రామన్ ఎఫెక్టు అనే రెండు ఉత్తమ గ్రంథాలను కూడా చేశారు. ఇవి ప్రామాణిక గ్రంథాలుగా అంతర్జాతీయ ఖ్యాతిని పొంది, అనేక భాషలలోకి అనువదించటం జరిగింది. జాతీయ అంతర్జాతీయ ప్రతిష్ఠాత్మక సైంటిఫిక్, ప్రొఫెషనల్ సంస్థలు అనేకంలో ఆయన ఎలెక్టెడ్ ఫెలోగా ఉన్నారు. పలు యూనివర్సిటీలు గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి.సి.వి.రామన్ అనుంగు శిష్యునిగా, దేశ రక్షణ శాఖను బలోపేతం చేసిన దేశభక్తునిగా పేరొందిన ప్రొఫెసర్ భగవంతం తన 80 వ యేట 1989, ఫిబ్రవరి 6 వ తేదీన మరణించారు.





# అకాడమిక్ లైబ్రరీల అభివృద్ధిలో యు.జి.సి. పాత్ర.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్.
9849328496.

యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్ (యు.జి.సి.) భారతదేశంలో ఉన్నత విద్యను సమన్వయం చేసే సంస్థ. ఇది 1956లో పార్లమెంటు చట్టం ద్వారా స్థాపించబడింది. యు.జి.సి. యూనివర్సిటీలు, కాలేజీలకు గ్రాంట్లు ఇస్తుంది. అకాడమిక్ లైబ్రరీలు విద్యా సంస్థల్లో ముఖ్యమైన భాగం. యు.జి.సి. వీటి అభివృద్ధికి సహాయం చేస్తుంది. లైబ్రరీలు విద్య, పరిశోధనలకు సహాయపడతాయి. యు.జి.సి. దీనిని గుర్తించి ప్రోత్సాహిస్తుంది. చరిత్రాత్మక నేపథ్యం:స్వాతంత్ర్యం తర్వాత ఉన్నత విద్య బాగా విస్తరించింది. అందుకు లైబ్రరీలు కూడా అనివార్యంగా అభివృద్ధి చెందాల్సి ఉంది. ఈ అవసరాలను దృష్టిలో పెట్టుకొని యు.జి.సి.నీ 1956లో స్థాపించారు. మొదట్లో ఇది కేవలం ఆర్థిక సహాయాన్ని మాత్రమే అందించేది. ఆ తర్వాత 1960లో యూనివర్సిటీ లైబ్రరీ గ్రాంట్ స్కీమ్ ను ప్రారంభించింది. ఇది లైబ్రరీలకు నిధులు ఇచ్చింది. 1974లో కొత్తగా యూనివర్సిటీ లైబ్రరీ సర్వీసెస్ స్కీమ్ వచ్చింది. ఇది ఆధునికీకరణకు సహాయపడింది. 1984లో లైబ్రరీ నెట్‌వర్క్ ప్రాజెక్ట్ కూడా ప్రారంభమైంది.

యూ.జి.సి ఆర్థిక సహాయం – గ్రాంట్లు:యు.జి.సి. లైబ్రరీలకు గ్రాంట్లు ఇస్తుంది. ఇవి పుస్తకాలు, జర్నల్స్ కొనుగోలుకు ఉపయోగపడతాయి. భవనాలు, ఫర్నిచర్, సామగ్రి కోసం నిధులు అందిస్తుంది. సెంట్రల్ యూనివర్సిటీలకు రూ.2 కోట్లు ఇచ్చింది. స్టేట్ యూనివర్సిటీలకు రూ.50 లక్షలు అందజేసింది. బుక్ బ్యాంక్ స్కీమ్ ప్రారంభించింది. ఇది పేద విద్యార్థులకు పుస్తకాలు అందిస్తుంది. ఇప్పుడు ఈ స్కీమ్ ను రద్దు చేశారు. డెవలప్‌మెంట్ ఆఫ్ లైబ్రరీస్ అండ్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ స్కీమ్ ఉంది. ఇది ఆన్‌లైన్ డేటాబేస్‌లు, స్టాఫ్ ట్రైనింగ్‌కు సహాయం చేస్తుంది.కమిటీలు మరియు రివ్యూలు: యు.జి.సి. కమిటీలు ఏర్పాటు చేస్తుంది. నేషనల్ రివ్యూ కమిటీ ఆన్ యూనివర్సిటీ అండ్ కాలేజ్ లైబ్రరీస్ ఉంది. ఇది గ్రాంట్లు వినియోగాన్ని పరిశీలిస్తుంది. స్టేటస్ రిపోర్ట్ తయారు చేస్తుంది. భవిష్యత్ ప్రణాళికలను సూచిస్తుంది. కరికులమ్ డెవలప్‌మెంట్ కమిటీ (సి.డి.సి.) 1990లో ఏర్పడింది. ఇది లైబ్రరీ సైన్స్ కోర్సులు పునర్నిర్మిస్తుంది. అడ్మిషన్ పాలసీలు, ఫ్యాకల్టీ స్ట్రెంగ్త్ సూచిస్తుంది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వినియోగాన్ని ప్రోత్సహిస్తుంది.డిజిటల్ ఇనిషియేటివ్స్:యు.జి.సి. డిజిటల్ లైబ్రరీలను ప్రోత్సాస్తుంది. ఇన్ఫ్లిబ్‌నెట్ (ఇన్ఫర్మేషన్ అండ్ లైబ్రరీ నెట్‌వర్క్) 1991లో ప్రారంభమైంది. ఇది లైబ్రరీలను నెట్‌వర్క్ చేస్తుంది. రిసోర్స్ షేరింగ్ చేస్తుంది. క్యాటలాగ్ సర్వీసెస్, డాక్యుమెంట్ డెలివరీలను అందిస్తుంది. "ఈ–షోధ్‌సింధు" కన్సార్టియం ఈ–జర్నల్స్, ఈ–బుక్స్ అందిస్తుంది. "షోధ్‌గంగా" థీసిస్‌ల రిపోజిటరీ. నేషనల్ డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా (ఎన్.డి.ఎల్.ఐ.) విస్తృత కంటెంట్ ను అందిస్తుంది. 2003లో డిజిటల్ లైబ్రరీ కన్సార్టియం వచ్చింది. 2013లో నేషనల్ అకాడమిక్ డిపాజిటరీ (ఎన్.ఎ.డి.) ప్రారంభమైంది.లైబ్రరీ సైన్స్ ఎడ్యుకేషన్ & ట్రైనింగ్: యు.జి.సి. లైబ్రరీ సైన్స్ కోర్సులను అభివృద్ధి చేస్తుంది. కరికులమ్ ను అప్‌డేట్ చేస్తుంది. ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తుంది. లైబ్రేరియన్ల స్కిల్స్ ను మెరుగుపరుస్తుంది. రిసెర్చ్ ప్రాజెక్ట్‌లు ప్రోత్సహిస్తుంది. పబ్లికేషన్లకు గైడ్‌లైన్స్ ఇస్తుంది. నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్స్ ఏర్పాటు చేసింది.ఇవి బిబ్లియోగ్రాఫిక్ సపోర్ట్ ఇస్తాయి.విశ్లేషణ– విజయాలు, సవాళ్లు:యు.జి.సి. లైబ్రరీలను ఆధునికం చేసింది. డిజిటల్ యాక్సెస్ ను పెంచింది. రిసోర్స్ షేరింగ్ మెరుగుపరిచింది. విద్యా నాణ్యత బాగా పెరిగింది. రిమోట్ ఏరియాలకు సహాయం చేసింది. కానీ దానితోపాటు సమస్యలు,సవాళ్లు కూడా పెరిగాయి.చాలా సందర్భాల్లో నిధులు సరిపోవు కొన్నిసార్లు. స్టాఫ్ ట్రైనింగ్ అవసరం మరిన్ని. డిజిటల్ డివైడ్ ఉంది. గ్రామీణ యూనివర్సిటీలు వెనుకబడ్డాయి. యు.జి.సి. మరిన్ని ఇనిషియేటివ్స్ తీసుకోవాలి. భవిష్యత్‌లో ఏ.ఐ., వర్చువల్ లైబ్రరీలు దృష్టి పెట్టాలి. ఇవి లైబ్రరీలను మరింత ఎఫెక్టివ్ గా పనిచేసేలా చూస్తాయి.

చివరిగా... యు.జి.సి. అకాడమిక్ లైబ్రరీల అభివృద్ధి విషయంలో కీలకపాత్ర పోషిస్తుంది. ఆర్థిక విషయాలలో, డిజిటల్, ఎడ్యుకేషన్ రంగాల్లో తన వంతు సహాయ, సహకారాలు అంజేస్తుంది. దీని ద్వారా ఉన్నత విద్య అనేక విధాలుగా మెరుగుపడుతుంది. భవిష్యత్ సవాళ్లకు అనుగుణంగా లైబ్రరీ వ్యవస్థ లోనూ అంతర్గత, బాహ్య నిర్మాణాల్లో మార్పులు రావాలి. కాలంతో పాటు పోటీ పడి లైబ్రరీలు కూడా అనివార్యంగా రూపాంతరం చెందాలి. అందుకు యు.జి.సి. కృషి, తోడ్పాటు మరింత గా కొనసాగాలి. ఇది భారత విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తుంది.

# ప్రమాణాల పాటింపుపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి




వస్తువులన్నింటికీ నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలని నిబంధనలు ఉన్నా, సర్వం నాసిరకం అవుతున్న నేటి పరిస్తితులలో ప్రభుత్వాలు ప్రతి వస్తువు నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. ప్రపంచ లేదా అంతర్జాతీయ ప్రమాణాల దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబరు 14న నిర్వహించ బడుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అంతర్జాతీయ ప్రమాణ సంస్థలు తమతమ దేశాలలో ప్రమాణాలను నిర్ణయించిన సందర్భంగా ఈ దినోత్సవాన్ని జరుపు కుంటారు. అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజనీర్స్ (ఏఎస్ఎంఈ), ఇంటర్నేషనల్ ఎలక్ట్రోటెక్నికల్ కమిషన్ (ఐఈసీ), ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ (ఐఎస్ఓ), ఇంటర్నేషనల్ టెలి కమ్యూనికేషన్ యూనియన్ (ఐటీయు), ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్స్ (ఐఈఈఈ), ఇంటర్నెట్ ఇంజనీరింగ్ టాస్క్ ఫోర్స్ (ఐఈటీఎఫ్) వంటి ప్రమాణాల అభివృద్ధి సంస్థలలో వినియోగ దారులు, నియంత్రకాలు మరియు పరిశ్రమలలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రామాణీకరణ యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడం ఈ రోజు యొక్క ఉద్దేశ్యం. వేలాది మంది నిపుణుల కృషిని గుర్తు చేస్తూ జరుపు కుంటారు. 1946, అక్టోబరు 14న లండన్‌లో జరిగిన సమావేశంలో 25 దేశాల ప్రతినిధులు పాల్గొని వినియోగ దారులకు ప్రామాణిక మైన, నాణ్యమైన వస్తు ఉత్పత్తులను అందించేందుకు అంతర్జాతీయ ప్రమాణిక సంస్థను ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు.

దానికి గుర్తుగా అక్టోబరు 14న ప్రపంచ ప్రమాణాల దినోత్సవం జరుప బడుతుంది. ఒక సంవత్సరం తరువాత అంతర్జా తీయ ప్రమాణిక సంస్థ ఏర్పడినప్పటికీ, 1970 వరకు మొదటి ప్రపంచ ప్రమాణాల దినోత్సవం జరుపు కోలేదు.ప్రస్తుతం ఈ సంస్థలో 125 సభ్య దేశాలు ఉన్నాయి. ప్రామాణీకరణ యొక్క ప్రాముఖ్యత గురించి పరిశ్రమలు, వినియోగ దారులలో అవగాహన పెంచుతారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలలోని జాతీయ సంస్థలు వేరువేరు రోజుల్లో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాయి. 2014లో యునైటెడ్ స్టేట్స్ 2014, అక్టోబరు 23న ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని నిర్వహించింది.

కెనడా దేశపు జాతీయ అక్రెడిటేషన్ బాడీ అయిన స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ కెనడా (ఎస్.సి.సి) అంతర్జాతీయ సంస్థలతో కలిసి ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని జరుపుకుంటుంది. 2012లో స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ కెనడా అక్టోబరు 12 శుక్రవారం రోజున ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని జరుపుకుంది. 1947లో భారతదేశంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ చట్టాన్ని ఆమోదించి బ్యూరోను ఒక శాసన బద్ధమైనా సంస్థగా మార్చారు. అప్పటి నుంచే ఐ.ఎస్ .ఐ ముద్ర ప్రకటితమైంది. ఈ ముద్ర గల వస్తువులు నాణ్యత కలిగినది. 1947లో భారతీయ ప్రమాణాల సంస్థ మొదటి రెండు విభాగాలను ఏర్పాటు చేసింది. ఒకటి బట్టలకు, రెండవది ఇంజనీరింగ్‌కు సబంధించినది. ఈ సంస్థ నిర్ణయించిన తొలి ప్రమాణం ఏమిటో తెలుసా, మన జాతీయ పతాకం ఎంత పొడవు, వెడల్పు ఉండాలన్నది ఈ సంస్థ నిర్ణయించింది. 1951లో ఆనాటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ సంస్థ కార్యాలయంలో స్వీకరిం చారు. అంతే కాదు మెట్రిక్ విధానాన్ని దేశంలో 1955లో ప్రవేశ పెట్టారు. తర్వాత తూనికలు, కొలతల పరిమాణాన్ని చట్టాన్ని ఆమోదించింది. కాలక్రమంలో టెలి కమ్యూనికేషన్స్ టీకాలు, నూనె గింజలు, త్రాగునీరు, పాడి పరిశ్రమ వంటివి కూడా ఈ సంస్థ పరిధిలోకి చేర్చారు. ఐఎస్ఐ మార్కు సంస్థ అనుమతి లేనిదే ఎవరూ వాడ కూడదు. అన్ని సాంకేతిక పరీక్షలు, తనిఖీలు నిర్వహించిన దరిమిలా ఒక సంవత్సరానికి ఐఎస్ఐ లైసెన్స్ ఇస్తుంది. ప్రతీ సంవత్సరం రెన్యువల్ చేసుకోవాలి. ప్రమాణాలు నిర్ణయించడానికి ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ ప్రమాణ సంస్థలు ఈ రోజునే ప్రారంభించాయి. కనుక ఈ రోజున వరల్డ్ స్టాండర్స్‌డే గా జరుపు కుంటారు.

## ప్రజావాణి"కి 271దరఖాస్తులు



కరీంనగర్, అక్టోబర్13(వుదయం ప్రతినిధి): ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. 271 అర్జీలు రాగా సత్వర పరిష్కారం కోసం వాటిని వివిధ శాఖల అధికారులకు బదిలీ చేశారు. పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మునిసిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు పాల్గొన్నారు.

## యూనిసెఫ్ కార్యక్రమాలపై సమీక్ష



కరీంనగర్, అక్టోబర్13(వుదయం ప్రతినిధి) :యూనిసెఫ్ సహకారంతో రానున్న రోజుల్లో స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా జిల్లాలో చేపట్టే వివిధ కార్యక్రమాలపై ఆ సంస్థ అధికారులతో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సమావేశమయ్యారు. ఈనెల 15న గల గ్లోబల్ హ్యాండ్ వాష్ డే, స్వచ్ఛ హరిత విద్యాలయాల నమోదు, అంగన్వాడీలు, ఆరోగ్య కేంద్రాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం మెరుగుపరచడం వంటి విషయాలపై ప్రతినిధులతో చర్చించారు. జిల్లాలో పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. స్వచ్ఛ హరిత విద్యాలయాల నమోదులో భాగంగా జిల్లాలోని పాఠశాలల్లో విజయవంతంగా సాగుతున్న విటమిన్ గార్డెన్ గురించి తెలియజేయాలని అన్నారు.సమావేశంలో యూనిసెఫ్ వాష్ స్పెషలిస్ట్ ఆర్లికట్టి వెంకటేష్, కన్సల్టెంట్ ఫణీంద్ర, స్వచ్ఛ భారత్ మిషన్ జిల్లా సమన్వయ కర్తలు వేణు, రమేష్ పాల్గొన్నారు.

## కొండెగట్లలో పోషణ మాసం కార్యక్రమాలు



సత్తుపల్లి ,అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి ) వేంసూర్ మండల పరిధిలోని బీరపల్లి సెక్టార్ కొండెగట్ల గ్రామం అంగన్వాడి సెంటర్ 1 లో పోషణ మాసం కార్యక్రమంలో సిడిపిఓ మెహెరున్నిసా బేగం ఐసిడిఎస్ సూపర్వైజర్ భవాని ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్జెడి ఝాన్సీ లక్ష్మీబాయి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్జెడి మాట్లాడుతూ ప్రత్యేకంగా ఎనిమియా మినరల్స్ విటమిన్స్ గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు , ఆరోగ్య పరీక్షలు, స్కూల్ ఎడ్యుకేషన్ , అంగన్వాడి కేంద్రాలు బలోపేతం గురించి తల్లులకు వివరించారు. అదేవిధంగా ప్రతిజ్ఞ ర్యాలీ వంట ప్రదర్శన , సామూహిక శ్రీమంతాలు,అక్షరాభ్యాసాలు, పోషక ఆహార పిరమిడ్, ఐసిడిఎస్ సింబల్ అంగన్వాడి టీచర్లు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తేజ పంచాయతీ కార్యదర్శి మాధురి అంగన్వాడీ టీచర్లు కరుణ పద్మ శాలిని చంద్రకళ వాణి జయ రత్నా లక్ష్మి తల్లులు పిల్లలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు టీకాలు.. అక్టోబర్ 15 నుండి డ్రైవ్ ప్రారంభం

చొప్పదండి, అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి):: చొప్పదండి మండలంలో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు అక్టోబర్ 15 నుండి నవంబర్ 14 వరకు ఇవ్వనున్నట్లు మండల పశువైద్యాధికారి శశికాంత్ రెడ్డి సోమవారం తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ టీకా కార్యక్రమం గుమ్లాపూర్, వెదురుగట్ట, కాట్న పెల్లి, కోనేరుపల్లి, ఆర్నకొండ, కొలిమికుంట, భూపాలపట్నం, మంగలపల్లి, చాకుంట, చొప్పదండి, మరియు చిట్యాలపల్లి గ్రామాలలో నిర్దిష్ట తేదీలలో నిర్వహించబడుతుంది. ఈ డ్రైవ్ పశువుల ఆరోగ్య పరిరక్షణకు దోహదపడుతుందిఅన్నారు.

### ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులను పరిష్కరించాలి

నిర్మల్, అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి): నిర్మల్ జిల్లా సమీకృత కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ లో కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించి, ప్రజల సమస్యలను తీర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు. వినతులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరగా పరిష్కరించాలని సూచించారు.

# ప్రజావాణి ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

- ప్రజావాణి కార్యక్రమంలో 48 ఫిర్యాదులు,
- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్,



నాగర్ కర్నూల్ అక్టోబర్ 13(వుదయం ప్రతినిధి) :ప్రజలు తమ సమస్యల పరిష్కారానికై ప్రజావాణిలోనే కాకుండా ఎప్పుడైన అర్జీలు ఇవ్వడానికి వచ్చే దరఖాస్తుదారలతో గౌరవంగా వ్యవహారించి దరఖాస్తులు స్వీకరించాలని జిల్లా అధికారులకు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, సూచించారు.నాగర్ కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు, అమరేందర్, దేవ సహాయం, తో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, అర్జీలు స్వీకరించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో (48) ఫిర్యాదులు అందాయన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వివిధ శాఖలలో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా అధికారులు జాప్యం లేకుండా దరఖాస్తులను పరిష్కరించి దరఖాస్తుదారునికి సమాచారం తెలియపరచాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, కలెక్టరేట్ వివిధ విభాగాల సూపరిండెంట్లు, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు.

## వృద్ధ దంపతులపై హత్య, హత్యాయత్నం కేసు నిందితుడు అరెస్టు ,బంగారం, నగదు, మత్తు మాత్రలు, మొబైల్ పోన్ స్వాధీనం

కరీంనగర్, అక్టోబర్13(వుదయం ప్రతినిధి) :కరీంనగర్ జిల్లా, గంగాధర పోలీసు స్టేషన్ పరిధిలోని గర్షకుర్తి గ్రామంలో ఇటీవల జరిగిన వృద్ధ దంపతులపై హత్యాయత్నం, హత్య కేసులో గంగాధర పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు కత్తి శివ (37) ను అరెస్టు చేసి, అతని వద్ద నుండి దొంగిలించిన బంగారు ఆభరణాలు మరియు నేరానికి ఉపయోగించిన మత్తు మాత్రలను, సెల్ పోన్ ను స్వాధీనం చేసుకున్నారు.గర్షకుర్తి గ్రామానికి చెందిన గజ్జల శంకరయ్య (76), అతని భార్య గజ్జల లక్ష్మి (70) అనువారు ఒంటరిగా ఉ ంటున్నారు.వారి ఇంటికి సమీపంలో ఉండే నిందితుడు కత్తి శివ అనునతను అప్పుడప్పుడు వారికి బయట నుండి మందులు, అవసరము ఉండే ఇంటి సామానులు తెచ్చి ఇచ్చి సహాయపడేవాడు. శివ ఈ మధ్య ఆన్ లైన్ లో బెట్టింగ్ లు, పేకాట లాంటి వాటికి అలవాటు పడి, అప్పులు ఎక్కువ అయి, ఖర్చులు, జల్సాల నిమిత్తం డబ్బులు అవసరము అయి, గజ్జల శంకరయ్య మరియు లక్ష్మి లను చంపి, లక్ష్మీ మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును దొంగిలించాలని పథకం వేశాడు. కానీ వారిని డైరెక్ట్ గా హత్య చేస్తే దొరికిపోయి తనకు శిక్ష పడుతుందని, వారికి తెలియకుండా, వృద్దులు వాళ్ళకే ఏదో అనారోగ్యం వచ్చి చనిపోయారు అని క్రియేట్, చేసి, వాళ్ళు చనిపోయిన తరువాత బంగారం దొంగతనం చేయాలన్న ఉద్దేశ్యముతో, ప్లాన్ ప్రకారం తాను గతంలో ముంబైలో కల్లు దుకాణంలో పని చేస్తున్నప్పుడు, కల్లు దుకాణము యజమాని మత్తు కోసం కల్లులో కలిపే టాబ్లెట్లు ఎవరికి తెలియకుండా దాచుకుని, ప్లాన్ ప్రకారం తేదీ అక్టోబర్ 7, 2025 ఉదయం సమయంలో, శంకరయ్య, లక్ష్మిలకు జ్వరం, జలుబు , దగ్గు మరియు ఒళ్లు నొప్పులు ఉన్నాయని తెలుసుకొని, వారి ఇంటికి తన దగ్గరున్న మత్తు మాత్రలు ఆ వృద్దుల వద్దకు తీసుకపోయి, ఇవి వేసుకుంటే మీ జ్వరం, జలుబు , దగ్గు మరియు ఒళ్లు నొప్పులు వెంటనే తగ్గుతాయని నమ్మించి, అ ఇద్దరు వృద్దులు ఒక్కొక్కరు ఆరు మాత్రలు చొప్పున మింగేలా చేశాడు. అవి మింగిన సుమారు రెండు గంటల తరువాత ఆ ఇద్దరు వృద్దులు మత్తులోకి అపస్మారక స్తితిలోకి వెళ్లిన తర్వాత, నిందితుడు వారి ఇంటికి వెళ్ళి, లక్ష్మి మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును దొంగిలించి పరారయ్యాడు. అనంతరం అదే రోజు గ్రామంలోని కట్ల శ్రీనివాసాచారి అనే గోల్డ్ స్మిత్ వద్ద ఆ బంగారాన్ని అమ్మి రూ.1,85,000, నగదు తీసుకున్నట్లు విచారణలో నిందితుడు అంగీకరించాడు. ఆ బంగారం కొన్నటువంటి శ్రీనివాసాచారి వద్ద గతములో కత్తి శివ తన బార్య బంగారు నగలు అమ్మయినందున, అతను నమ్మి, ఆ బంగారం కొని, శివకు డబ్బులు ఇవ్వడం జరిగినది. బంగారం వ్యాపారి ఇచ్చిన డబ్బులు శివ తన అప్పులు తీర్చుకోవడం, పేకాట, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల కోసం ఆ డబ్బును ఖర్చు చేసినట్లు తెలిపాడు. అపస్మారక స్థితిలో ఉన్న వృద్దులు శంకరయ్య మరియు లక్ష్మిని సాయంత్రం ఆసుపత్రికి తరలించగా, అక్టోబర్ 08, 2025 మధ్యాహ్నం శంకరయ్య చికిత్స పొందుతూ మరణించాడు. వృద్దురాలు లక్ష్మి ఆరోగ్య పరిస్థితి ఇంకా విషమంగా ఉన్నది.నిందితుడు కత్తి శివ తండ్రి దేవయ్య, వయస్సు 37 సంవత్సరాలు, గ్రామంల ఘర్షకుర్తి అను అతను సోమవారం నాడు ఉదయం మిగిలిన మత్తు మాత్రలను పారేయడానికి వెళ్తున్న సమయంలో పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించి, పారిపోతుండగా పట్టుకున్నారు.

"నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న నగదు: రూ. 25,000- (నిందితుడి జేబులో లభించింది)మత్తు మాత్రలు, 11 బ్లూ కలర్ కవర్ లో గల మత్తు మాత్రలు దొంగిలించబడిన బంగారం,20 గ్రాములు 250 మిల్లీగ్రాముల బరువుగల బంగారు పుస్తెల తాడు (కట్ల శ్రీనివాస జ్యూవెలరీ షాప్ యజమాని కట్ల శ్రీనివాసు నుండి)టెక్నో ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్ మరియు సిమ్ కార్డు. వ్యసనాలు, అప్పుల కారణంగానే నిందితుడు ఈ దారుణానికి పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. నిందితుడిపై హత్య, దోపిడీ తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించడం జరుగుతుంది. మొదట అనుమానాస్పద మృతిగా ఈ కేసును నమోదు చేసుకుని, డెటెక్ట్ చేయుటకు ఛాలెంజ్ గా తీసుకున్న పోలీస్ వారు విజయ కుమార్, ఏ.సి.పి రూరల్ ఆద్వర్యంలో, ప్రదీప్ కుమార్, ఇన్స్ పెక్టర్ ఆఫ్ పోలీస్, చొప్పదండి, వంశీకృష్ణ, ఎస్.ఐ ఆఫ్ పోలీస్ గంగాధర, చారి హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ లు జంపన్న మరియు అరవింద్ లను కమిషనర్ ఆఫ్ పోలీస్ కరీంనగర్ అభినందించినారు.

# మత ఉన్మాధ విష సంస్కృతి వల్లే భౌతిక దాడులు

**జస్టిస్ బిఆర్ గవాయి పై దాడి న్యాయ వ్యవస్థపై దాడే.?**

**నేతకాని మహార్ జాతీయ యువజన అధ్యక్షులు, రాష్ట్ర కాంగ్రెస్ యువజన నాయకులు గోమాసే సచిన్**



జయశంకర్ భూపాలపల్లి అక్టోబర్ 13(వుదయం ప్రతినిధి):మత ఉన్మధ విష సంస్కృతి వల్లే భౌతిక దాడులు జరుగుతున్నాయని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయి పై దాడి న్యాయ వ్యవస్థ పై దాడి జరిగినట్లేనని నేతకాని మహర్ జాతీయ యువజన అధ్యక్షుడు రాష్ట్ర కాంగ్రెస్ యువజన నాయకులు గోమాసే సచిన్ తీవ్రంగా ఖండించారు సోమవారం ఆయన వుదయం ప్రతినిధి తో మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం అయినటువంటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయినా జస్టిస్ బి ఆర్ గవాయి పై జరిగిన దాడిని ఖండిస్తూ యావత్ దేశం తలదించుకునే నీచమైన చర్యగా ఆయన మండిపడ్డారు దేశంలో అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవిలో ఉన్నటువంటి వ్యక్తికే నేడు రక్షణ లేకుండా పోయిందని దీని అంతటికి కారణం దేశ ప్రధాన పాలకులేనని నిత్యం దేశంలో అసత్యాలను ప్రచారం చేస్తూ, సనాతన ధర్మాన్ని అనుసరించాలని లేనియెడల ఎంతటి హెూదాలో ఉన్న వ్యక్తుల పైన కూడా దాడి చేయడానికి వెనకాడబోమనే విధంగా దాడులు చేస్తున్నారని ఆరోపించారు దాడికి ప్రధాన కారణం జస్టిస్ బి ఆర్ గవాయి అంబేద్కర్ వాది కావడమే, రాజ్యాంగ రక్షణ కోసం నిరంతరం కృషి చేయడమే కాకా సనాతన ధర్మం ఒక దళితుడు అత్యున్నత పదవిలో ఉండడం ఒప్పుకోదు అని అంతర్జాతీయ తీవ్రవాదులు దేశంపై దాడి చేస్తే సనాతనవాదులు సుప్రీంకోర్టు పై దాడి చేస్తున్నారని ఆరోపించారు ఇలాంటి ఘటనలు భారత రాజ్యాంగానికి లౌకిక వాదానికి భారతదేశానికి చాలా ప్రమాదమని ఆవేదన వ్యక్తం చేశారు జస్టిస్ బిఆర్ గవాయి తీర్పులు రాజ్యాంగ స్ఫూర్తికి నిదర్శనమని సామాజిక న్యాయానికి ప్రతిరూపం అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇలాంటి సంఘటనలు మరోసారి జరగకుండా దాడికి పాల్పడిన వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని రాజ్యాంగ విలువలను చట్టాలను, ప్రజాస్వామ్యంను కాపాడే ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు జస్టిస్ గవాయిపై దాడికి పాల్పడిన మతోన్మాది పై కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని గోమాసే సచిన్ డిమాండ్ చేశారు.

## జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

జడ్చర్ల, అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి): జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ కాంగ్రెస్‌లో చేరికపై సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీని మోసం చేసి, మూటలు తీసుకొని పోయిన వారికి మళ్లీ పార్టీలో ప్రవేశం లేదని ఆయన అన్నారు. సొంత తమ్ముడిని సర్పంచ్ పదవి కోసం చంపిన వారు, ఎమ్మెల్యే పదవి కోసం తనను కూడా చంపొచ్చని, అందుకే జడ్ కేటగిరీ భద్రత అడగాలని, ఫ్యాక్షన్ రాజకీయాలు చేయాలని తనకు లేదని అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు.

### బిటి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

దేవరకద్ర, అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి): దేవరకద్ర నియోజకవర్గం కొత్తకోట మండలం ముమ్మాలపల్లి గ్రామంలో జాతీయ రహదారి-44 వద్ద పుల్లారెడ్డి కుంట వరకు 97 లక్షల రూపాయల నిధులతో బిటి రోడ్డు నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో గ్రామీణ అంతర్గత రోడ్లు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా మధుసూదనాచారి జన్మదిన వేడుకలు



కేక్ కోస్తున్న సంఘాల నాయకులు

హనుమకొండ, అక్టోబర్ 13(వుదయం జిల్లా ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం, హనుమకొండ జిల్లా స్వర్ణకార సంఘం సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ తొలి శాసన సభాపతి,శాసన మండలి విపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి జన్మదిన వేడుకలను సోమవారం హనుమకొండ టైలర్ స్ట్రీట్ లో టిఆర్ఎస్ జిల్లా నాయకులు, హనుమకొండ జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షులు పానుగంటి శ్రీధర్ ఆధ్వర్యంలో కేక్ కోసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి, రాష్ట్ర బులియన్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జక్కోజు కొటేశ్వరా చారి, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ సహాయ కార్యదర్శి డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్ లు మాట్లాడుతూ సిరికొండ మధుసూదనా చారి భవిష్యత్తులో మరిన్ని పదవులు చేపట్టి విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ జాతి అభ్యుదయానికి కృషి చేయాలని,నిరంతరం ప్రజా సేవలో నిలవాలని, ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు వీణవంక సదానందం, కొత్త గట్టు బ్రహ్మం, శ్రీరామోజు సతీష్,ఆకోజు సురేందర్ రావు,సిద్దోజు వీరన్న,జక్కోజు సతీష్,ఆసం రవి చారి,మనోజ్,ఉదయ్,బొజ్జ రాము,సిద్దోజు రమేష్,మునిగంటి కిరణ్,బ్రహ్మం,సాంబరాజు అంకయ్య, వేల్పుల ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సక్సెస్ నారాయణ విద్యాసంస్థలు

**డిప్యూటీ జనరల్ మేనేజర్ రిజ్వానాఇమ్రాన్ అతిదులుగా మండల విద్యాధికారులు మనోజ్ కుమార్, నెహ్రూ నాయక్**



హనుమకొండ, అక్టోబర్13(వుదయం జిల్లా ప్రతినిధి) : వరంగల్ జిల్లాలో జోనల్ స్థాయిలో ఐశ్వర్య కన్వెన్షన్ హాల్ హన్మకొండ లో నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మాస్టర్ ఒరేంటర్ కాంటెస్ట్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వరంగల్ జోనల్ స్థాయిలో ఉన్న నారాయణ స్కూల్స్ కాజిపేట్ బ్రాంచ్, జనగాం బ్రాంచ్, హన్మకొండ బ్రాంచ్, హంటర్ రోడ్ బ్రాంచ్, నుండి విద్యార్థులు, తల్లి దండ్రులు పెద్ద మొత్తంలో దాదాపు 1500 మంది పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిదులుగా కాజిపేట్, హన్మకొండ మండల విద్యాధికారులు బి మనోజ్ కుమార్, జి నెహ్రూ నాయక్ హాజరయారు, విరితో పాటు టీ రఘు అసిస్టెంట్ ప్రొపెసర్, స్కూల్ అసిస్టెంట్ లో ఉ న్నారు, గౌరవ అతిధిగా నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రిజ్వానఇమ్రాన్ హాజరై విద్యార్థిలను ప్రోత్సాహంచారు, జ్యోతి ప్రజ్వాలనాతో కార్యక్రమం మొదలయింది, ఈ కార్యక్రమం చాంప్స్, హైస్కూల్ విద్యార్థులు తమ యొక్క ప్రతిభను కనబరిచారు, కమ్యూనికేషన్ నై పుణ్యాల పై విద్యార్థులు ఫోటపోటీగా,

అదేవిదంగా ఆట పాటలతో, నృత్యలోతో ఆనందోత్సవలా మధ్య కార్యక్రమం కొనసాగిందన్నారు గెలుపొందిన విద్యర్థులకు ప్రథమ ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు, ఈ సమావేశంలో నాలుగు బ్రాంచుల ప్రిన్సిపాల్స్ వి అలేఖ్య, ఫరహన, అనిత, మమత, జోనల్ కోఆర్డినేటర్స్ సాయి కృష్ణ, శ్యమల, శిరీష, వై స్ ప్రిన్సిపాల్స్ అకాడమిక్ డిన్స్, ఏ ఓస్ తదితరులు ఉన్నారు.

## భారీ వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యపు రాశులు..

భువనగిరి, అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి): యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలో అర్ధరాత్రి నుంచి కురిసిన భారీ వర్షం వల్ల ఐకెపి కేంద్రాలు, ధాన్యం కల్లాలలో ఆరబోసిన వరి ధాన్యం తడిసిపోయింది. అప్పులు చేసి పండించిన ధాన్యం వర్షానికి కొట్టుకుపోవడంతో రైతులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. పలు గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు చెరువులను తలపిస్తున్నాయి.

## నార్కట్ పల్లిలో అకాల వర్షంతో ఇళ్లలోకి చేరిన నీరు

నార్కట్‌పల్లి, అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి): నల్లగొండ జిల్లా నార్కట్ పల్లి మండల కేంద్రంలో అకాల వర్షం కారణంగా 5వ వార్డులోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. స్థానిక సమస్యలపై అధికారులు, అధికార పార్టీ నాయకులకు పలుమార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిద్ర మత్తు వీడి వెంటనే సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ సంఘటనతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## అన్నదాతల ఆందోళన

బోధన్, అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి): నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం యంచ వద్ద రైతులు గోదావరి పరిసర ప్రాంతాల వరద ముప్పు కారణంగా ఆందోళన చేపట్టారు. వారు ధర్నా, రాస్తారోకో నిర్వహించి, నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి 50,000 రూపాయల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటన వరద బాధితుల సమస్యలను ఎత్తిచూపింది.

# 16 నుండి పటాన్చెరు వేదికగా ఎస్ జి ఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాలు

### ఉమ్మడి మెదక్ జిల్లా ఎంపిక పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్



సంగారెడ్డి జిల్లా,పటాన్చెరు , అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి): రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడలకు వేదికగా పటాన్చెరు నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతున్నామని స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానం వేదికగా ఈనెల 16 నుండి 18 తేదీ వరకు జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్, కబడ్డీ రాష్ట్ర స్థాయి పోటీల ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లా టీం అండర్ 14, అండర్ 17 కబడ్డీ బాలుర బాలికల ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పటాన్చెరు నియోజకవర్గ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలకు ఆతిథ్యం అందిస్తున్నామని తెలిపారు. 33 జిల్లాల నుండి 400 మంది క్రీడాకారులు, 60 మంది కోచులు, 160 మంది వ్యాయామ ఉపాధ్యాయులు ఈ క్రీడోత్సవాలలో పాల్గొనబోతున్నారని తెలిపారు. మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా వాలీబాల్ కబడ్డీ అంశాలలో ఈ పోటీలు జరగనున్నాయని తెలిపారు. 40 లక్షల రూపాయలు సొంత నిధులతో క్రీడోత్సవాల నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. క్రీడాకారులతోపాటు క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై పోటీలను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.
ఈ కార్యక్రమంలో పటాన్చెరు డిఎస్పి ప్రభాకర్, సిఐ వినాయక రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు నాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఎస్ జి ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, గౌసుద్దిన్, ఎల్లయ్య, ప్రమోద్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను పరామర్శించిన మాజీ మంత్రి

ఆదిలాబాద్, అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి): నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే నూతల భూపతిరెడ్డి మాతృమూర్తి లక్ష్మీ నర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ నేపథ్యంలో, సోమవారం నిర్మల్ కు చెందిన మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ఎమ్మెల్యే భూపతిరెడ్డిని పరామర్శించారు. ఆయన లక్ష్మీ నర్సమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## నేరెళ్ల పాక్స్ పరిధిలో వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

సిరిసిల్ల, అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి):తంగళ్ళపల్లి మండలంలోని నేరెళ్ల పాక్స్ పరిధిలో సోమవారం రోజున జిల్లెళ్ల, నేరళ్ల, చిన్నలింగపూర్ గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలను పాక్స్ ఛైర్మన్ కోడూరి భాస్కర్ గౌడ్ ప్రారంభించారు.
రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్, స్థానిక నాయకులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## పోలీసుల సత్వర చర్యతో మొబైల్ ట్రేస్

ముథల్, అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి): వాంకిడి మండలం మార్కెట్ ప్రాంతంలో ప్రేమ్ సాగర్ అనే వ్యక్తి తన రెడ్మీ మొబైల్ ను పోగొట్టుకున్నారు. ఆయన వాంకిడి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, పోలీసులు సీఐఈఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ను ట్రేస్ చేసి సోమవారం బాధితుడికి అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహేందర్ మాట్లాడుతూ, మొబైల్ పోయినవారు వెంటనే సీఐఈఆర్ పోర్టల్ లో ఫిర్యాదు చేస్తే ట్రేస్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. మొబైల్ ను ట్రేస్ చేసిన పోలీస్ కానిస్టేబుల్ నయీమ్ ను ఎస్ఐ మహేందర్ అభినందించారు.

# ప్రధాని,ఎంపీ చిత్రపటాలకు క్షీరాభిషేకం

### ప్రధాని మోడీ రైతు పక్షపాతి -లక్ష్మీ శ్యాంసుందర్ గౌడ్



నారాయణపేట ,అక్టోబర్ 13( వుదయం ప్రతినిధి) :వెనుక బడిన జిల్లాల రైతుల శ్రేయస్సు కోసం ప్రధాని నరేంద్రమోడీ పిఎం దన్ ధాన్య కృషి యోజన పథకాన్ని ప్రారంభించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో బిజెపి నాయకులు కార్యకర్తలు ప్రధాని నరేంద్రమోడీ,ఎంపి.డికె. అరుణ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు కెంచే శ్రీనివాసులు,జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ శ్యామ్ సుందర్ గౌడ్ మాట్లాడుతూ ఈ పతకంకింద నారాయణపేట జిల్లా ఎంపిక కావడం జిల్లా రైతుల అదృష్టమని అన్నారు. పి ఎం దన్ ధాన్య కృషి యోజన ద్వారా వ్యవసాయం దాని అనుబంధ రంగాల్లో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ఈ పథకం 6 ఏళ్ల పాటు కొనసాగుతుందని ఏడాదికి జిల్లాకు 240 కోట్ల నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. దీంతో వెనుక బడిన జిల్లాల్లో వ్యవసాయ రంగం కొత్త పుంతలు తొక్కుతోందని అన్నారు. నారాయణపేట జిల్లా ను ఈ పథకం మంజూరు చేసిన ప్రధాని నరేంద్రమోడీ కి అందుకు కృషి చేసిన పాలమూరు
ఎంపి డి కే అరుణ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు రఘువీర్ యాదవ్,రఘు రామయ్య గౌడ్ ,మిర్చి వెంకటయ్య,సత్య రఘు పాల్,గోపాల్ యాదవ్,శ్రీపాద,శ్యామ్ సుందర్ రావు,వద్దే దత్తు,మాజీ సర్పంచ్ శివప్ప,పల్ల రఘు ,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి (48 ) ఫిర్యాదులు



రంగారెడ్డి జిల్లా ,అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి): సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించినప్రజావాణి కార్యక్రమానికి (48) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్సి,నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసంనిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధితశాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలనుపెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూపరిష్కరించాలనిఅధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ15, ఇతర శాఖలు 33, మొత్తం 48 దరఖస్తులు అందాయి. అనంతరం జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి జిల్లా అధికారులతో సమన్వయసమావేశం ఏర్పాటు చేసి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎరువుల కొరత లేకుండారైతులందరికి ఎరువులు అందేలా చూడాలని, పత్తి కొనుగోలు, వరి ధాన్యంకొనుగోలు కేంద్రాలల్లో సరిపడా గన్ని బ్యాగులు అందుబాటులో ఉండేలా చర్యలుతీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్లకు స్టేజ్వారీగా పేమెంట్ అయ్యేలా చూడాలని, స్థానిక ఎన్నికల కోడ్ కు ముందు వచ్చినలిస్ట్ ప్రకారం ఇండ్ల గ్రౌండింగ్ చేయాలని పిడి హౌసింగ్ అధికారికిసూచించారు. గ్రామ, మున్సిపల్ స్థాయిలో పరిశుద్యం పై శ్రద్ధ పెట్టాలని
తెలిపారు. ప్రతి ప్రభుత్వ పథకాల అమలులో జిల్లాను ముందు ఉంచేలా ప్రతిఒక్కరూ పని చేయాలని అన్నారు. ప్రతి వారం సంబంధిత అధికారులతో ప్రభుత్వపథకాల అమలు పై, చేపట్టిన చర్యల పై కింది స్థాయి అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ లేదా టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించాలని తెలిపారు. నెలకుఒకసారి ఫిజికల్ వెరిఫికేషన్ చేయాలని ఆదేశించారు. జిల్లాలో పల్స్ పోలియోచుక్కలను ఏ ఒక్కరినీ వదలకుండా ఇంటింటికి వెళ్ళి వేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, జిల్లా రెవెన్యూఅధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


# ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి అక్టోబర్ 13(వుదయం ప్రతినిధి):ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలనిజిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులు, దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి మొత్తం 41 దరఖాస్తులు స్వీకరించామని, వాటిని సంబంధిత శాఖాధికారులకు తక్షణ పరిష్కారానికి ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావాలనే ఉద్దేశంతో ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. అధికారులు ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును ప్రాధాన్యతగా తీసుకోవాలని, సమయానికి చర్యలు తీసుకుని నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా, పారదర్శకంగా సేవలు అందించాలని అన్ని శాఖల అధికారులను ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ రవి, ట్రైని ఉప కలెక్టర్ నవీన్ రెడ్డి అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టించుకోని కొడుకులు.. కలెక్టరేట్లో కన్నీరు పెట్టిన తల్లి



(గద్వాల ,అక్టోబర్ 13 వుదయం ప్రతినిధి) :సమాజంలో విద్యావంతులుగా ఉండి, పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తూ విద్యా బుద్ధులు నేర్పాల్సిన వాళ్లు తమ సొంత కన్న తల్లిని పట్టించుకోకుండా ఆమెకు ఉన్నా యావదాస్తిని రాయించుకొని కన్న తల్లి యోగక్షేమాలు పట్టించుకోకుండా కర్కశంగా తయారైనా కొడుకులు. బుక్కెడు బువ్వ కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఫిర్యాదుల దినోత్సవం సందర్భంగా తల్లి శంకరమ్మ కొడుకులు, కూతురు పై కలెక్టర్ కు ఫిర్యాదు చేయడం జరిగింది. కలెక్టర్ కార్యాలయంలో ఆమె రోదనలు ప్రతి ఒక్కరిని కలిచివేసింది.
వివరాలకు వెళితే.. గద్వాల పట్టణానికి చెందిన ఈద శంకరమ్మ, వయస్సు(68) వీవర్స్ కాలనీలో నివాసం ఉండగా ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఇద్దరు కుమారులు ప్రభుత్వ ఉద్యోగస్తులుగా మంచి స్థానంలో ఉండగా వంశంపార్యాంగా వచ్చిన ఆస్తులను ఇద్దరు కుమారులకు, కూతురి పేరిట సమాన భాగాలుగా ఆస్తి పంపకాలు జరిగాయని పెద్దల ఒప్పందం లో కుమారులు నెలకు 10,000 రూపాయలు, కూతురు నెలకు 2,000/- రూపాయలు తల్లికి ఇచ్చే విధంగా పెద్దలు నిర్ణయించారాని ఆమె తెలిపారు. ఆస్తిని పంచుకున్న తర్వాత కన్న పిల్లలు ఆమె కు ఇవ్వాల్సిన నెలసరి ఖర్చులకోసం డబ్బులను ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని కన్నీటి పర్యంతం అయ్యారు. అనారోగ్య కారణాల వల్ల ప్రతి నెల మందుల కోసం ఇబ్బంది అవుతుందని కొడుకులను డబ్బులు అడిగితే డబ్బుల కోసం వస్తే తన్ని తరిమేస్తామని తనను బెదిరించారని ఆమె ఏడుస్తూ మీడియా ముందు వివరించారు

# వ్యవసాయ విస్తరణ డిప్లమా కోర్సులో సత్యనారాయణ రెడ్డి కి బంగారు పథకం






అన్నపురెడ్డిపల్లి అక్టోబర్ 13:( వుదయం ప్రతినిధి) :రైతును రాజు చేయాలని వ్యవసాయ సూచనలు అందరకి అందివ్వాలని జిల్లాలో వున్న ఫెర్టిలైజర్స్,వెస్టిసైడ్స్,సీడ్స్ డీలర్లకు వ్యవసాయ విస్తరణ సేవల డిప్లమా కోర్స్ ను ఒక సంవత్సరం కాలంలో 48 రోజులు పాటు ఫెసిలిటేటర్ డేవిడ్ జైపాల్ రావు ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారులు,శాస్త్రవేత్తలతో డీలర్లకు శిక్షణ ఇప్పించి వారికి ఒక పరీక్ష నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి చుంచుపల్లి రైతు వేదిక నందు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు ఆత్మ డిపిడి సరిత హాజరు అయినారు. జిల్లా స్థాయిలో అన్నపురెడ్డిపల్లి మండలం రాజపురం గ్రామంలో గల శ్రీ వేంకటేశ్వర ఎంటర్ప్రైజెస్ డీలర్ భీమిరెడ్డి సత్యనారాయణరెడ్డి కి గోల్డ్ మెడల్ జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు ఆత్మ డిపిడి సరిత చేతులు మీదగా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఇప్పటి వరకు 8 బ్యాచ్ లు శిక్షణ పూర్తి చేసుకొని సర్టిఫికెట్లు తీసుకోవడం చాలా సంతోషంగా వుందని అన్నారు. ఒక సంవత్సర కాలంలో 48 రోజులు శిక్షణ నిర్వహించడం వారిలో అన్నపురెడ్డిపల్లి మండలం రాజపురం గ్రామంలో గల శ్రీ వేంకటేశ్వర ఎంటర్ప్రైజెస్ డీలర్ భీమిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఉత్తమ ఫలితాలు సాధించి గోల్డ్ మెడల్ సాధించడంతో ఆయన్ని ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలో రైతులు ఎక్కువ సేంద్రియ వ్యవసాయం చేసే విధంగా డీలర్లు చూడాలని ములగ,ఆయిల్ పామ్ వంటి పంటలు ఎక్కువ సాగు చేసే విధంగా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఆత్మ డిపిడి సరిత జిల్లా ఫెర్టిలైజర్స్ అధ్యక్షులు సోము సుందరం,రంజిత్ డీలర్లు వేముల నరేష్,శ్రీనివాస్,నవీన్ తదితరులు పాల్గొన్నారు...

# పెద్ద అంబర్‌పేటలో చోరీ

ఎల్బినగర్, అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి): హయత్‌నగర్ పీఎస్ పరిధిలోని పెద్ద అంబర్‌పేటలో దొంగలు రెండిళ్లలో చొరబడి బీభత్సం సృష్టించారు. సదాశివ గేటెడ్ కమ్యూనిటీలో సెంట్రల్ లాక్ ఉన్న డోర్లను బద్దలు కొట్టి, 5 కేజీల వెండి, 35 గ్రాముల బంగారం, రూ. 60వేల నగదు, విలువైన చీరలను అపహరించారు. చోరీకి సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఈ ఘటనపై హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# విజేతలకు నగదు అందజేత

షాద్‌నగర్, అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి):: షాద్‌నగర్ నియోజకవర్గంలో క్రీడాకారులకు పార్టీలు, కులమతాలకు అతీతంగా స్వేచ్ఛగా ఆడుకోవాలని, వారికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. విజయదశమి వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. ప్రతిభ కనబరిచిన వారికి ప్రత్యేకంగా నగదు, మెడల్స్ ఇచ్చారు. సోమవారం షాద్‌నగర్ ప్రభుత్వ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన క్రీడాకారులను ప్రోత్సహించారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి అదనపు కలెక్టర్ డి.వేణు



పెద్దపల్లి జిల్లా ,అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి): ప్రజావాణి ద్వారా ప్రజలు సమర్పించిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ డి.వేణు ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.వేణు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ బనావత్ వనజ సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. వేములవాడ మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన బండి వెంకటమ్మ, ధర్మారం మండలం పత్తిపాక గ్రామంలోని సర్వే నంబర్లు 785, 786 మరియు మల్లాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 132లో తమ భూమి ఆక్రమణకు గురైందని, రికార్డులు పరిశీలించి భూమి తమ పేరుతో మళ్లీ నమోదు చేయాలంటూ అర్జీ చేసుకున్నారు.
దీనిపై తహసిల్దార్ ధర్మారం కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.

# పైప్‌లైన్ రోడ్డుపై స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణం ఎప్పుడు..?

### : పులి బలరాం, ఆకుల సతీష్




కుత్బుల్లాపూర్, అక్టోబర్ 13,(వుదయం ప్రతినిధి),కుత్బుల్లాపూర్ మున్సిపల్ పరిధిలో సుచిత్ర నుండి షాపూర్ నగర్ వరకు వెళ్లే ప్రధాన రోడ్డులో ఫాక్ సాగర్ నాలాపై కేవలం 10 అడుగుల రోడ్ మాత్రమే ఉండటం వల్ల ప్రతిరోజూ వందలాది వాహనదారులు తీవ్ర ట్రాఫిక్ సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై పలుమార్లు ప్రజలు ఆందోళన వ్యక్తం చేసినా ఇప్పటివరకు ఎలాంటి శాశ్వత పరిష్కారం లభించలేదు. 2022లో ఎస్ఆర్డీపీ ప్రాజెక్టు కింద రూ. 56 కోట్ల నిధులు ఈ ప్రాంతానికి మంజూరయ్యాయని సంబంధిత జీవోలో స్పష్టంగా పేర్కొనబడింది. అయితే ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో పులి బలరాం, బిజెపి మాజీ అధ్యక్షులు ఆకుల సతీష్ నాయకత్వంలో స్థానిక ప్రజలు కుత్బుల్లాపూర్ డిప్యూటీ కమిషనర్ నరసింహకి ఫిర్యాదు చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ ప్రజలు దశాబ్దాలుగా ట్రాఫిక్ కష్టాలతో సతమతమవుతున్నారని, మూడు సార్లు గెలిచిన టీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద 2022లో ఎస్ఆర్డీపీ కింద రూ. 56 కోట్ల నిధులు మంజూరయినట్లు చెప్పుకొని ప్రచారం చేసినా ఈరోజు వరకు ఒక్క పని ప్రారంభం కాలేదని ప్రజలను మోసం చేసిన ఈ ఎమ్మెల్యేకి రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని అన్నారు. తన సొంత గ్రామంలోని రోడ్డు విస్తరణ పనుల వల్ల భూములు కోల్పోయిన ప్రజలకు ఇప్పటివరకు నష్టపరిహారం ఇవ్వలేని చేతగాని ఎమ్మెల్యే ఇప్పుడు స్టీల్ బ్రిడ్జ్ పనులు చేయకుండానే సన్మానాలు చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. వెంటనే ఎస్ఆర్డీపీ, జీహెచ్ఎంసీ అధికారులు స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణ పనులు ప్రారంభించకపోతే మున్సిపల్ ఆఫీస్ ముందు భారీ ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నల్ల జై శంకర్ గౌడ్, అరుణ్ రావు, జగదీష్ గుప్తా, దయాకర్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ శిక్షణ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన సిపి

నిజామాబాద్ అర్బన్, ,అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి): ఎడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జానకంపేటలో గల పోలీస్ శిక్షణ సెంటర్‌ను పర్యవేక్షించిన పి. సాయి చైతన్య, శిక్షణార్థులకు అవసరమైన సౌకర్యాలు, వసతులు మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. శారీరక, మానసిక అభివృద్ధికి అనుకూల వాతావరణం, శిక్షణా పరికరాలు, సదుపాయాలు అందుబాటులో ఉండాలని సూచించారు.

# రైతు బలోపేతం కోసమే ప్రధాని కృషి ఎంపీ డీకే అరుణ



(గద్వాల అక్టోబర్ 13 వుదయం ప్రతినిధి :జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రధాని ధన, ధాన్య కృషి యోజన పథకం ద్వారా సంవత్సరానికి 960 కోట్ల నిధులతో ఆరు సంవత్సరాలకుగాను 42 వేలకోట్ల బడ్జెట్ తో దేశంలో వున్న 100 జిల్లాలో ఈ పథకం అములులో ఉంటుందని, తెలంగాణ రాష్ట్రంలో నాలుగు జిల్లాలో ఈ పథకం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చోహన్ కొత్త పథకానికి రూపకల్పన చేశారని, ఈ పథకం ద్వారా వ్యవసాయ రంగానికి, వ్యవసాయ అనుభంద రంగాలకు ఎంతో మేలు జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ పథకం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని నారాయణ పేట, జోగులాంబ గద్వాల, నాగర్ కర్నూల్ జిల్లా లో వెనుకబడిన ప్రాంతాలలో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడమే కాకా వ్యవసాయ ఉత్పత్తులను పెంచి రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా ఈ పథకం రూపుదిద్దుకొన్నాదని తెలిపారు. విదేశాల నుండి దిగుమతులు తగ్గించి స్వదేశంలో ధాన్య ఉత్పత్తులు పెంచాలనే లక్ష్యంతో ప్రధాని మోడీ ఈ పథకాన్ని రూపకల్పన చేసాడని ఆమె కొనియాడారు. వ్యవసాయ అనుభంద రంగాలకు ఎంఎస్ఎంఈ ద్వారా పారిశ్రామిక రంగాలకు సబ్సిడీ ద్వారా రుణాలు ఇవ్వడానికి ఈ స్కీమ్ దోహదపడుతుందని ఆమె అన్నారు. గ్రామ అభివృద్దే దేశం అభివృద్ధికి దోహదం చేస్తుందని, ప్రపంచంలో భారత దేశం 11 వ స్థానం నుండి నాలుగవ స్థానంకు రావడానికి ప్రధాని నరేంద్ర మోడీ కృషి మరువలేనిదని ఆమె కొనియాడారు. కాంగ్రెస్ పార్టీకీ విజన్ లేదని, 2047 సంవత్సరం వందేళ్ల స్వతంత్ర్య దినోత్సవాల వరకు భారత దేశాన్ని ప్రపంచ పటంలో ఒకటవ స్థానానికి తీసుకరావడానికి మోడీ విజన్ వున్న నాయకుడు అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రెసిడెంట్ రామాంజనేయులు, రాష్ట్ర కౌన్సిల్ మెంబెర్ బండల వెంకట్రాములు, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ, స్నిగ్ద రెడ్డి, యువజన నాయకుడు వెంకటేశ్వర్ రెడ్డి, బలిగేరా శివారెడ్డి, రామచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**
**– పటాన్చెరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవం..**



సంగారెడ్డి జిల్లా ,పటాన్చెరు ,అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో చేపడుతున్న సంస్కరణల మూలంగా ప్రభుత్వ విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు రావడంతో పాటు, విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం అందించే నిధులతో పాటు వివిధ పరిశ్రమల సహాయ సహకారాలతో నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల లో మన ఊరు మన బడి పథకం ద్వారా 67 లక్షల రూపాయలతో నిర్మించిన 4 అదనపు తరగతి గదులు, ఆర్డిసి కాంక్రీట్ ఇండస్ట్రీస్ సి ఎస్ ఆర్ నిధులతో 10 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన మరో రెండు అదనపు తరగతి గదులను సోమవారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తూ, నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయడంతో పాటు ఆధునిక వసతులతో విద్యాబోధనను అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యను అభ్యసించిన విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ కంపెనీలలో ఉద్యోగాలు సాధిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. పది లక్షల రూపాయల సి ఎస్ ఆర్ నిధులతో పాఠశాలకు రంగులు వేయించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు నాయక్, పంచాయతీరాజ్ డిఇ సురేష్, ప్రమోద్ గౌడ్, ఆర్డిసి పరిశ్రమ ప్రతినిధి నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డి కన్నుమూత

చేవెళ్ల ,అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి): రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డి (84) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఉదయం 5:30 గంటలకు హైదర్ గూడలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కుటుంబ సభ్యులు విడుదల చేసిన ప్రకటన ప్రకారం, మధ్యాహ్నం 3 గంటలకు జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# కూరెళ్ళ గ్రామంలో అకాల వర్షం కారణంగా నీటమునిగిన ఇళ్లు

మేడ్చల్, అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి): యాదాద్రి జిల్లా ఆత్మకూరు మండలం కూరెళ్ళ గ్రామంలో రాత్రి కురిసిన అకాల వర్షం బీభత్సం సృష్టించింది. వాగులు, రోడ్లు ఉప్పొంగి ప్రవహించడంతో గ్రామంలోని గిద్ద బండ వద్ద పలు ఇళ్లు నీట మునిగాయి. బెజ్జంకి అండమ్మ, ఎండి మైవెల్లి, బోయిని చిన్న సత్తయ్య ఇళ్లలోకి వరద నీరు చేరింది. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తంగా ఉండాలని మాజీ గ్రామ సర్పంచ్ భాష బోయిన ఉప్పలయ్య సూచించారు.

# దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణలో హెూమియోపతి వైద్యం ఉత్తమం

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



మంచిర్యాల జిల్లా ,అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి): దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణలో హెూమియోపతి వైద్యం మెరుగైనదని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ ఆయుష్ పథకం క్రింద ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా హెూమియోపతి వైద్య శిబిరంను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికా డా. అనిత, వైద్య శిబిరం ఇంచార్జ్ డా. స్పందనలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారతీయ వైద్య విధానం ఎన్నో దేశాలకు ఆదర్శంగా నిలిచిందని, దీర్ఘకాలిక వ్యాధులను నియంత్రణలో హెూమియోపతి మెరుగైన వైద్య విధానం అని తెలిపారు. ఆయుర్వేదం, యునాని, అల్లోపతి లాంటి అనేక ప్రత్యామ్నాయ వైద్య విధానాల ద్వారా వ్యాధులను నియంత్రించవచ్చని, మధుమేహం, రక్తపోటు, ఇతర దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణలో హెూమియోపతి మెరుగైన ఫలితాలను ఇస్తుందని తెలిపారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా జాతీయ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. హెూమియోపతి వైద్యం తక్కువ ఖర్చుతో కూడుకుందని, మందుల వినియోగం వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని తెలిపారు. మీడియా ద్వారా ప్రజలందరికీ అవగాహన కల్పించి శిబిరాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాబోయే టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేసేలా ఏటిసి ఏర్పాటు.



ఖమ్మం అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ను ప్రారంభించిన మంత్రి తుమ్మల

ఖమ్మం అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి): రాబోయే టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేసేలా ఏ.టి.సి. ని ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. మంత్రివర్యులు, సోమవారం ఖమ్మం నగరంలోని ప్రభుత్వ ఐటిఐ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అవకాశాలు దక్కాలంటే రొటీన్ గా ఉన్న ఐటిఐ కోర్సులు కాకుండా ప్రస్తుత పరిశ్రమల అవసరాల ప్రకారం నైపుణ్య కోర్సులను డిజైన్ చేయించి ఆధునిక సాంకేతిక కేంద్రాల ద్వారా అందించడం జరుగుతుందని అన్నారు. రాబోయే 5 నుంచి 10 సంవత్సరాల వరకు ప్రపంచీకరణలో జరిగే మార్పులకు అనుగుణంగా ఏటీసీ కోర్సులు డిజైన్ చేయడం జరిగిందని అన్నారు. ప్రపంచంలో మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా మన యువతను సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపార. ఆధునిక సాంకేతిక కేంద్రంలో అందించే కోర్సులను పూర్తి చేసే ముందే విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లభించేలా టాటా సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని అన్నారు. నిర్వీర్యమైన ఐటిఐలను యువత కు ఉపయోగపడే విధంగా ప్రస్తుత టెక్నాలజీకి అనుగుణంగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం తీర్చిదిద్దిందని అన్నారు. యువతకు ప్రపంచంలో ఎక్కడైనా బ్రతికే శక్తి సామర్థ్యాలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్కిల్ డెవలప్మెంట్ కు ప్రాధాన్యత కల్పించారని అన్నారు. ప్రస్తుతం ఏసీ లకు చాలా డిమాండ్ ఉందని అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల వైపు ప్రపంచం చూస్తుందని, దానికి సంబంధించిన మెకానిక్స్ లో మనం నిష్ణాతులం కావాలని మంత్రి అన్నారు.

రాబోయే సాంకేతికతకు మన యువతను సిద్ధం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. యువత ఉపాధి కోసం చూడకుండా నైపుణ్యం సంపాదిస్తే పరిశ్రమలు మన వెంట వచ్చి మంచి వేతనాలు అందించి ఉపాధి కల్పిస్తారని మంత్రి తెలిపారు.

ప్రస్తుత ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు డిమాండ్ తగ్గిపోయిందని, అక్కడ ప్రాక్టికల్స్ పరిజ్ఞానం తక్కువగా ఉండటం, కోర్సులు అప్ డేట్ కాకపోవడం వల్ల బీటెక్ చదివినా కూడా ప్రస్తుత పరిశ్రమల అవసరాలకు సరిపోవడం లేదని మంత్రి తెలిపారు. నిరుద్యోగ యువతకు మంచి నైపుణ్యాలు అందించాలని లక్ష్యంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో ఖమ్మం, మణుగూరు, భద్రాచలం, కొత్తగూడెం ప్రాంతాలలో 4 ఏ.టి.సి. లను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలో ఉన్న పరిశ్రమలకు అవసరమైన ఉపాధి ట్రైనింగ్ శిక్షణ విద్యార్థులకు అందించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

ఏటీసీ కేంద్రంలో ఉన్న కోర్సుల ద్వారా ప్రపంచంలో ఎటువంటి అవకాశాలు అందుబాటులో ఉంటాయో విద్యార్థులకు వివరించేలా డిస్ ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. ఇంజనీరింగ్ కోర్సుల కన్నా మెరుగైన నైపుణ్య కోర్సులు ఏటిసిలో అందుబాటులో ఉన్నాయని, వీటిని విద్యార్థులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు.

# విలీన గ్రామాలలో శరవేగంగా అభివృద్ధి పనులు

**– పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



**– ముత్తంగిలో 12 కోట్ల 30 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్**

సంగారెడ్డి జిల్లా ,పటాన్చెరు ,అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో ఇటీవల విలీనమైన గ్రామాలలో శరవేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పటాన్చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ ముత్తంగి గ్రామ పరిధిలోని వివిధ కాలనీలలో 12 కోట్ల 30 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం ఉదయం స్థానిక నాయకులు, వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో నూతనంగా విలీనమైన గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ముత్తంగి పరిధిలోని నూతన కాలనీలలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, పార్కుల అభివృద్ధికి నిధులు కేటాయించామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ముత్తంగి పరిధిలో నూతనంగా నిర్మించబోతున్న సీసీ రోడ్ల ద్వారా మెరుగైన రహదారి సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, మండల తహసిల్దార్ రంగారావు, మున్సిపల్ కమిషనర్ అజయ్ రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ ఉపేందర్, మాజీ వైస్ ఎంపీపీలు స్వప్న శ్రీనివాస్, ప్రభాకర్ గుప్తా, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మేరాజ్ ఖాన్, సందీప్, రామకృష్ణ, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామీణ కళాకారులను ప్రోత్సహిద్దాం

**రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి**



వెల్దండ అక్టోబర్ 13 (వు దయం ప్రతినిధి) గ్రామీణ కళాకారులను ప్రోత్సహిద్దామని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు మండల పరిధిలోని రాఘయిపల్లి గ్రామంలో భజన బృందానికి కార్తీక మాసం సందర్భంగా జరిగే భజన కార్యక్రమానికి కావలసిన భజన సామాగ్రిని సమకూర్చారు ఈ సందర్భంగా కళాకారులు గోలి శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు బిఆర్ఎస్ యువ నాయకులు బర్కం గణేష్ ద్వారా అందించడం జరిగింది. కార్యక్రమంలో నాగుల శ్రీనివాస్,రాంచంద్రారెడ్డి,గిరి,బాలయ్య,మెండే ఇదన్న,యాదయ్య.

# భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల జిల్లా అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి): ప్రభుత్వం చేపట్టిన భూభారతి చట్టంలో భాగంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో భూ సంబంధిత సమస్యలపై అందిన దరఖాస్తులను పరిష్కారం పరిష్కరించడం పై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలోని జన్నారం మండలం మహమ్మదాబాద్ గ్రామానికి సంబంధించిన భూ సమస్యను అతి తక్కువ సమయంలో పరిష్కరించినందుకు గాను సంబంధిత గ్రామస్తులు సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ ను శాలువాతో సత్కరించి మొక్కను అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులు, మొఖా, సర్వే నెంబర్లు ఇతర పూర్తి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని, ఇందు కొరకు రాజస్వ మండల అధికారి, తహసిల్దార్, ఆర్.ఐ. లతో బృందాన్ని ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మిస్సింగ్ సర్వే నెంబర్, ప్రాంతాల మార్పు, ప్రభుత్వ భూములు, సాదాబైనమా, అటవీ భూములు, హద్దుల నిర్ధారణ, ఇతర భూములకు సంబంధించి భూ భారతి కార్యక్రమంలో పొందిన దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు.

భూ వివాదాలపై న్యాయస్థానం కంటే ముందు తమను సంప్రదిస్తే సమగ్ర విచారణ జరిపి అసలైన పట్టదారులకు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని, న్యాయస్థానాలలో కొనసాగుతున్న భూ వివాదాలకు సంబంధించిన కేసులపై ఎలాంటి చర్యలు తీసుకోబడవని తెలిపారు.

# సిపిఆర్ పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



ఖమ్మం, ,అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి): సిపిఆర్ పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికారులకు సోమవారం నిర్వహించిన సిపిఆర్ అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి సమాజంలో ఇటీవల కాలంలో హర్ట్ ఎటాక్ వల్ల చాలా మంది మరణిస్తున్నారని, హర్ట్ ఎటాక్ వచ్చిన వెంటనే సిపిఆర్ చేయడం వల్ల మనిషి ప్రాణాలు కాపాడేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. సిపిఆర్ చేసేందుకు వైద్య రంగంలో ఎటువంటి అనుభవం అవసరం లేదని, సాధారణ మనుషులు కూడా సిపిఆర్ చేసి ప్రాణాలు కాపాడవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరూ సిపిఆర్ ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. గోల్డెన్ అవర్ లో సిపిఆర్ చేయడం వల్ల ప్రాణాలు కాపాడ గలుగుతామని అన్నారు.

మనిషి ఎప్పుడైనా స్పృహ కోల్పోతే వెంటనే సిపిఆర్ చేయాలని కలెక్టర్ సూచించారు. సిపిఆర్ ఒక లైఫ్ స్కిల్ అని, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా తెలుసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డి.ఆర్.ఓ. ఏ. పద్మశ్రీ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ బి. కళావతి బాయి, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, డిప్యూటీ డిఎం. అండ్ హెచ్ఓ చందూ నాయక్, ప్రోగ్రాం అధికారి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బిజెపిలోకి ఖమ్మం డాక్టర్ న్యూరో సర్జన్ కె. మారుతి గౌడ్.

**బిజెపి ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి ఆధ్వర్యంలో చేరిక.**
**పార్టీలోకి ఆహ్వానించిన రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్ర రావు.**



ఖమ్మం ,అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి): భారతీయ జనతా పార్టీ (బిజెపి) తెలంగాణ రాష్ట్రంలో తన బలాన్ని మరింత పెంచుకునే దిశగా అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా బిజెపి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాకు చెందిన ప్రముఖ డాక్టర్, న్యూరో సర్జన్ అయిన డాక్టర్ కె. మారుతి గౌడ్ సోమవారం అధికారికంగా బిజెపి పార్టీలో చేరారు. హైదరాబాద్ నాంపల్లిలోని రాష్ట్ర బిజెపి కార్యాలయం నందు జరిగిన ఈ ముఖ్య కార్యక్రమంలో, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావు మారుతి గౌడ్కు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. వీరితోపాటు మరో 50 మందిని కూడా పార్టీలోకి ఆహ్వానించి బిజెపి కండువా కప్పారు. ఖమ్మం నుంచి వచ్చిన డాక్టర్ మారుతి గౌడ్ చేరిక పార్టీకి, ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో, మరింత బలాన్ని చేకూరుస్తుందని రాష్ట్ర అధ్యక్షులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. వైద్యరంగంలో ఆయనకున్న అనుభవం, ప్రజాసంబంధాలు పార్టీ బలోపేతానికి దోహదపడతాయన్నారు. అనంతరం మారుతి గౌడ్ మాట్లాడుతూ, బిజెపి సిద్ధాంతాలు, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం నచ్చడం వల్లే తాను పార్టీలో చేరినట్లు తెలిపారు. తన వృత్తిపరమైన అనుభవంతోపాటు, ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాలను వేదికగా చేసుకుంటానని, పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారుఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కోశాధికారి వాసుదేవరావు, సన్నీ ఉదయ్ ప్రతాప్, నంబూరి రామలింగేశ్వరరావు, మండదపు సుబ్బారావు,ఆకుల నాగేశ్వరావు, బోయినపల్లి సురేష్,కొండా గోపి, రుద్రగాని మాధవ్,గోపి తదితరులు పాల్గొన్నారు.

# శివసేన రాష్ట్ర అధ్యక్షులు వెంకటేష్ జన్మదిన వేడుకలు



**అన్నపురెడ్డిపల్లి అక్టోబర్ 13:( వుదయం ప్రతినిధి)** శివ సేనా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బాతరాజు వెంకటేష్, జన్మ దిన వేడుకలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు చిలుకూరి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేడుకకు హాజరైన అందరికీ భవాని అమ్మ శివాజీ మహారాజ్ యొక్క గొప్ప చరితని గుర్తు చేసి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కలకాలం ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో ఎల్ల వేళలా ఆ రాముల వారి ఆశీసులతో సంతోషంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని కోరుకున్నారు. అందరూ భారతదేశం సుఖ సౌఖ్యలతో ఉండాలని , ఒక మహోన్నత దేశంగా అవతరించాలని , అఖండ భారత స్థాపన కోసం కృషి చేయాలని, ప్రతి భారతీయుడు గర్వించే విధంగా జీవించాలి అని చిలుకూరి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో లంక రాము, వెంకటేశ్వరరావు, కొనకాల పుల్లారావు, పాపారావు, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

# టి.ఆర్.పి పార్టీలోకి భారీగా చేరిన వివిధ పార్టీల నాయకులు



**అక్టోబర్ 13 భూపాలపల్లి వుదయం ప్రతినిధి** జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుండి హైదరాబాద్ తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సమక్షంలో భూపాలపల్లి జిల్లా నాయకులు రవి పటేల్ ఆధ్వర్యంలో చేరికలు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అనంతరం తీన్మార్ మల్లన్న వారితో మాట్లాడి క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని భూపాలపల్లి జిల్లా గురించి పలు వివరాలు రవి పటేల్ ను అడిగి తెలుసుకోవడం జరిగింది పార్టీ నేతలు కార్యకర్తలు బలంగా బీసి ఎస్సీ ఎస్టీ మైనారిటీల అభ్యున్నతి కోసం అధికార ప్రభుత్వంపై పోరాటాలు చేసి ప్రజల పక్షాన నిలబడాలని పార్టీలు అవలంబిస్తున్న తీరును ఎప్పటికప్పుడు ఎండగట్టాలని అన్నారు. రవి పటేల్ భూపాలపల్లిలో జరుగుతున్నటువంటి ప్రస్తుత పరిస్థితుల గురించి రాజకీయ అంశాల గురించి పార్టీ కార్యక్రమాల గురించి మనం అవలంబించవలసిన విధివిధానాల గురించి తీన్మార్ మల్లన్న తో సుదీర్ఘంగా చర్చించి రాబోవు స్థానిక సంస్థలు మరియు ప్రజా సమస్యలు అన్ని వివరంగా చెప్పడం జరిగింది మల్లన్న ఈటీవీలో జరిగినటువంటి కార్యక్రమాల గురించి ప్రస్తావిస్తూ రవి పటేల్ను అభినందించడం జరిగింది. ఇలాగే ప్రజల్లో బలంగా ముందు సాగాలని అన్నారు.

# కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డులను పంపిణీ చేసిన బి ఆర్ ఎస్ నాయకులు



**అక్టోబర్ 13 భూపాలపల్లి వుదయం ప్రతినిధి** జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి మండలంలోని నేరేడువెల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్డులను బీ ఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. గత శాసన సభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలు 13 హామీలను అమలు చేయాలని కాంగ్రెస్ నాయకులను నీలదీయడం కొరకు బాకీ కార్డులను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయడం జరిగినది. ఈ సందర్భంగా మాజీ మండల పార్టీ అధ్యక్షులు మందల రవీందర్ రెడ్డి, మాజీ పి ఏ సి ఎస్ చైర్మన్ మందల విద్యాసాగర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల లోపు ఇస్తామన్న హామీలు నెరవేరిస్తే ఒక్కో ఇంటికి 50,000 ల నుండి 2,00,000 లక్షల రూపాయలు బాకీ పడ్డారని ఆ డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పినగాని నర్సయ్య, గ్రామ కమిటీ అధ్యక్షులు మూగ రాజు,మాజీ సర్పంచులు దానవేన రమేష్, తాళ్లపల్లి స్వామి,సింగనవేన సుధాకర్,పొన్నాల రవి, మాజీ ఎం పి టి సి లు వేముల రాజేందర్, అప్పం కుమార్, మండల నాయకులు దామోదర్, తోట ప్రసాద్, సింగనవేన వీరన్న, సదయ్య, రామ్, మొగిలి, ఆది విష్ణు, రాకేష్, దేవేందర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# జస్టిస్ బి.ఆర్ గవాయి మీద దాడి చేసిన నిందితుడిని తక్షణమే అరెస్టు చేయాలి..

మడిపల్లి శ్యాంబాబు మాదిగ



**అక్టోబర్ 13 భూపాలపల్లి వుదయం ప్రతినిధి** అక్టోబర్ 7, 2025 న భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయి గారు బెంచ్ మీద లాయర్ల వాదనలు వింటున్న సమయంలో రాకేష్ కిషోర్ అనే వ్యక్తి షూస్ విసిరి దాడికి పాలు పడడాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు నోముల శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించగా ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఇన్చార్జి మడిపల్లి శ్యాం బాబు మాదిగ హాజరై మాట్లాడుతూ చీఫ్ జస్టిస్ మీద జరిగిన దాడి అనాగరికమైంది. ఈ దాడి ప్రజాస్వామిక స్ఫూర్తి, రాజ్యాంగం మీద జరిగిన దాడిగానే ఉన్నది. ఈ దాడి సమస్త భారతీయులను దిగ్భ్రాంతికి గురి చేసింది. దళిత, పీడిత వర్గాల ప్రజలను తీవ్ర మనోవేదనకు గురి చేసిందిఅన్ని. అందువల్ల దేశ ప్రజలందరూ ఈ దాడిని ఖండించారు. దళితుడైన బిఆర్ గవాయి సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ కావడం కొన్ని ఆధిపత్య శక్తులు జీర్ణించుకోలేకపోతున్నాయి. అందుకే అహంపూరితంగా ఈ దాడికి తెగపడ్డారు. కావున ఈ దాడికి పాల్పడ్డ వ్యక్తి మీద తక్షణమే కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలి. అలాగే దాడికి వెనుక ఉన్న శక్తులను గుర్తించి వారికి శిక్షలు పడేలా ఈ ఘటన మీద సమగ్రమైన దర్యాప్తు జరిపించాలి. అన్ని అన్నారు. అందుకోసం సుప్రీం కోర్టులో అనుభవం కలిగిన ప్రజస్వామిక దృక్పథం కలిగిన రిటైర్డు జడ్జీలను దర్యాప్తు కోసం నియమించాలిఅన్ని అన్నారు. అలాగే ఇలాంటి ఘటనలు ఉన్నత న్యాయవ్యవస్థల్లో పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలి అని అన్నారు. ఈ డిమాండ్లను తక్షణమే పరిగణలోని తీసుకొని తగిన చర్యలు తీసుకోవాలని తమరి ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నాం అని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్ ముందు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం అనంతరం డిప్యూటీ కలెక్టర్ అశోక్ కుమార్ కి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు దోర్నాల రాజేందర్ మాదిగ భూపాలపల్లి టౌన్ అధ్యక్షులు దోర్నాల భరత్ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మెరపట్టి అశోక్ మాదిగ మంద కిరణ్ మాదిగ మాదిగ యువసేన జిల్లా అధ్యక్షులు మంద తిరుపతి మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మామిడి రవి మాదిగ భూపాలపల్లి ఎంఎస్పీ మండల అధ్యక్షులు ఎర్ర భద్రయ్య మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రామ్ చందర్ మాదిగ ఎమ్మార్పీఎస్ టౌన్ ప్రధాన కార్యదర్శి మంచినీళ్లు వైకుంఠం మాదిగ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మొలుగూరి రవీందర్ మాదిగ ఒంటరి రాజేష్ మాదిగ బోడికల శ్రీకాంత్ మాదిగ భూపాల పల్లి మహాదేవపూర్ మండల అధ్యక్షులు బెల్లంపల్లి సురేష్ మాదిగ టేకుమట్ల మండల అధ్యక్షులు రేణిగుంట్ల శంకర్ మాదిగ రేగొండ మండల నాయకులు చావటి సంతోష్ మాదిగ మహ ముత్తారం మండల అధ్యక్షులు ఎంఎస్పి పుల్యాల రాజయ్య మాదిగ పంగ చందు మాదిగ భూపాలపల్లి టౌన్ నాయకులు దోర్నాల నరేష్ దోర్నాల స్వామి నోముల రాజ పోషాలు నోముల రాజు సమ్మయ్య చిరపాక సుమన్ మంగలి రవి ఎర్ర వంశి మాదిగ సాంబయ్య అంకుష్ ప్రభాకర్ బోడికల సమ్మయ్య కన్నూరి రాజేందర్ నిరపటి సిద్ధు మాదిగ నిరపటి దీక్షిత్ మాదిగ సదరపు రాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పెద్దన్న గుండా మల్లేష్ వర్ధంతి వేడుకలు..



**రామకృష్ణాపూర్/అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి)** రామకృష్ణాపూర్ సిపిఐ పార్టీ కార్యాలయంలో గుండా మల్లేష్ 5 వ వర్ధంతి నీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ అమరజీవి కామ్రేడ్ గుండా మల్లేష్ తన జీవిత కాలం పూర్తిగా ప్రజల కోసం,ప్రజా సమస్యల పరిష్కారం కోసం,సింగరేణి కార్మికుల హక్కులకోసం జరిగిన ఉద్యమాలకు పెద్దన్న పాత్ర వహించారని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో శ్రీకృష్ణ కమిటీకి తెలంగాణ రాష్ట్రం ను ఎలాంటి షరతులు లేకుండా తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ లో పేదప్రజల సమస్యలపై నిలదీసేవారు. నిజాయితీకి మారు పేరు గుండా మల్లేష్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో, సిపిఐ జిల్లా జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌలు, కాదండి సాంబయ్య,ఎగుడ మొండి, సిపిఐ నాయకులు మద్దెల శంకర్,బోయపోతుల కొమురయ్య ,తోకల రాజన్న కుర్మ రమేష్,గొడిసెల గురువయ్య పొలవేన చందర్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి శ్రీధర్ బాబు పరామర్శ



**మంథని అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి)** తెలంగాణ ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ పలు బాధిత కుటుంబాలను సోమవారం పరామర్శించారు. మంథని పట్టణం కాల్వ బోందాలు అనారోగ్యంతో ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను, మందాటలో వరహాల రమేష్ అనారోగ్యంతో మరణించగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంథని మండలంలోని గద్దల పల్లి గ్రామంలో అక్కపాక గణేష్, అడ్డూరి వెంకటలక్ష్మి, చిత్తారి లక్ష్మి, కొయ్యల శ్రీకాంత్, తోటపల్లి భూమయ్యలు ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను శ్రీధర్ బాబు పరామర్శించారు. గ్రామ శాఖ అధ్యక్షుడు రవి సోదరుడు సాదయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. ఇటీవల ప్రమాదవశాత్తు బిల్డింగ్ పై నుండి కింద పడిన అజయ్ ని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. బిట్టుపల్లి గ్రామంలో గుండేటి రాజమ్మ ఇటీవలే అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను మంత్రి శ్రీధర్ బాబు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. అయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదల వెంకన్న, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి కమిటీ సభ్యులు, న్యాయవాది శశిభూషణ్ కాచే, జిల్లా ఆర్టీఏ మెంబర్ సురేష్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్, సోషల్ మీడియా ఇన్చార్జి ఆరేళ్ళి కిరణ్ గౌడ్, తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ ముఖ్య నాయకులు



**(అలంపూర్ అక్టోబర్ 13 వుదయం ప్రతినిధి)** హైదరాబాద్లోని ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఏ.సంపత్ కుమార్ నివాసంలో అలంపూర్ నియోజక వర్గంలోని అయిజ మండలానికి చెందిన పలువురు బి ఆర్ ఎస్ నాయకులు, సీనియర్ నాయకులు భూంపురం నరసింహ రెడ్డి ,ఉప్పల తిప్పన్న, కురువ రమేష్, మాజీ టెంపుల్ డైరెక్టర్,రంగన్న గౌడ్, ముగినుపల్లి మాజీ సర్పంచ్ కురువ నాగేద్ర , బోయ ఆంజనేయులు ,నాగేంద్ర, అంజి,దాసప్ప తిమ్మప్ప, కురవ భీమన్న, కురవ భీమేశ్ తదితరులు బిఆర్ఎస్ పార్టీని వదిలి సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. వారికి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలోఅలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మెన్ దొడ్డప్ప, రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి, కాంగ్రెస్ నాయకులు ప్రకాష్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీలోని నిధులపై పూర్తిస్థాయి విచారణ జరపాలి

**మంథని అక్టోబర్ 13(వుదయం ప్రతినిధి)** మంథని మండలం మైదిపల్లి గ్రామపంచాయతీకి సంబంధించిన నిధులపైన పూర్తి స్థాయిలో విచారణ జరిపి అవినీతికి పాల్పడ్డ బాధ్యుల పైన పంచాయతీ రాజ్ చట్టం 2018 ప్రకారం తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు తీర్థాల కొమురెల్లి సోమవారం వినతి పత్రం సమర్పించారు. జనవరి 2019 నుండి ఆగస్టు 2025 వరకు గ్రామపంచాయతీ నిధుల పైన విచారణ జరిపి అక్రమాలకు పాల్పడ్డ వారిపై తగు చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

# ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (72) ఫిర్యాదులు

జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్



**(గద్వాల అక్టోబర్ 13 వుదయం ప్రతినిధి)** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో సోమవారం రోజు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్, అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావులతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (72) ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులు పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

# అయిజను అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలి

ఎంపి.డికే.అరుణమ్మకు వినతిపత్రం అందజేసిన అఖిలపక్ష కమిటీ నాయకులు



**(అలంపూర్ అక్టోబర్ 13 వుదయం ప్రతినిధి)** డి లిమిటేషన్ ద్వారా అసెంబ్లీ సీట్లు పెరిగే అవకాశం ఉన్నందున అందులో దినదిన అభివృద్ధి చెందుతున్న గద్వాలకు దీటుగా జనాభాలో అభివృద్ధిలో ఉన్న అయిజ కేంద్రంగా మరో అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని, మండలాలు ఏవి కలిపిన తమకు అభ్యంతరం లేదని జిల్లాలో మరో అసెంబ్లీ ఏర్పాటు అవసరముందని ముందు నుంచే ఈ దిశగా ప్రభుత్వం దగ్గర పై రెండు ప్రతిపాదనలు ఉంచి అవి నెరవేరేటట్లు చేయాలని అఖిలపక్ష కమిటీ నాయకులు జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో సోమవారం డికే.బంగ్ల లో మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణమ్మ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ.డీకే అరుణమ్మ మాట్లాడుతూ, అయిజ అసెంబ్లీ అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి తప్పకుండా అయిజను అసెంబ్లీగా రూపొందించడానికి కృషి చేస్తానని, ఈ విషయంలో సఫలమయ్యే అవకాశాలు కచ్చితంగా ఉన్నాయని ఆమె భరోసా ఇచ్చారు. గతంలోనే ఈ ప్రతిపాదనను ప్రభుత్వం ముందు ఉంచామని తప్పక మీ కోరిక నెరవేరుతుందని తెలిపారు. పార్లమెంటు, నియోజకవర్గం ఏర్పాటులో ఏ ప్రాతిపదికన తీసుకున్న నాగర్కర్నూల్ పార్లమెంటు చాలా విశాలంగా ఉందని పార్లమెంట్ సభ్యులు అచ్చంపేట నుండి అయిజ వరకు తిరగడము కష్టమవుతుందని పార్లమెంట్ సభ్యులు ప్రజలను కలుసుకునే అవకాశాలు తక్కువగా ఉన్నాయని, ఇంత విస్తీర్ణంలో ప్రజల బాగోగులు చూడడం వారి కోసం పనిచేయడం కష్టమవుతుందని వైశాల్యపరంగా చూస్తే గద్వాలను పార్లమెంటు నియోజకవర్గంగా ఏర్పాటు చేయడానికి అవకాశం ఉందని హైదరాబాదులోని కొన్ని నియోజకవర్గాల్లో జనాభా ఎక్కువ ఉన్న జన సాంద్రత కూడా ఎక్కువగా ఉంటుందని తక్కువ విస్తీర్ణంలోనే ఎక్కువ జనాభా ఉంటుంది. కాబట్టి సువిశాలమైన నాగర్ కర్నూలు పార్లమెంటు మహబూబ్నగర్ పార్లమెంటు నుండి కొన్ని నియోజకవర్గాలను కలిపి గద్వాలను ఏర్పాటు చేసే అవకాశం ఉందని దీనికోసం ప్రభుత్వం దగ్గర ప్రతిపాదనలోంచి తప్పక కృషి చేస్తానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కమిటీ జిల్లా జిల్లాయువ నాయకురాలు డికె. స్నిగ్ధా రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు,అధ్యక్షులు, టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగర్ దొడ్డి వెంకట రాములు, ఐజ అఖిలపక్ష కమిటీ అధ్యక్షులు సాకలి ఆంజనేయులు గౌరవాధ్యక్షులు జగపతి రెడ్డి, బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డి, అఖిలపక్ష కమిటీ నాయకులు రెడ్ క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షులు ఎండి తహెర్, బిఅర్ ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కురువపల్లయ్య, రంగు అశోక్, మహేష్ బాబు, కిరణ్, తెలుగు శ్రీనివాసులు, రాఘవేంద్ర రెడ్డి, శరణప్ప, పులికల్లు రామాంజనేయులు, నేష బసవరాజు, తోక నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతి నిలయంగా మంథని అభివృద్ధి

రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**మంథని అక్టోబర్ 13( వుదయం ప్రతినిధి)** సరస్వతినిలయంగా మంథని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు తెలిపారు. సోమవారం రాష్ట్ర మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మంథని క్యాంపు కార్యాలయంలో రామగిరి, కమాన్ పూర్, మంథని, ముత్తారం మండలాలకు సంబంధించి 87 మంది లబ్ధిదారులకు సీ.ఎం.ఆర్.ఎఫ్ చెక్కులు, 38 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ...ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తొలి వారంలోనే ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం జరిగిందని అన్నారు. వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వ ఉద్యోగులను అప్పటి ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేసిందని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సకాలంలో వేతనాలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందించే చెక్కులు, కళ్యాణ లక్ష్మి వంటి సంక్షేమ పథకాలు అమలు ఎక్కడా ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టామని అన్నారు. ఆరోగ్యశ్రీ వర్తించని పేద ప్రజలను ఆదుకునేందుకు సీఎం సహాయ నిధి నుంచి రికార్డు స్థాయిలో నిధులు మంజూరు చేస్తున్నారని అన్నారు. పరిశ్రమల్లో అవసరమైన నైపుణ్యాలను యువతకు అందించే దిశగా ఐటిఐ కేంద్రాలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా అప్ గ్రేడ్ చేయడం జరిగిందని అన్నారు. ఏ.టి.సి కోర్సులను పూర్తి చేసిన విద్యార్థులకు మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఇటీవలే కాటారంలో 35 కోట్ల రూపాయలతో ఏటిసి ప్రారంభించామని మంత్రి తెలిపారు. 45 కోట్ల రూపాయల ఖర్చు చేసి మంథని పట్టణంలో నూతనంగా ఏటీసీ కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. సరస్వతి నిలయంగా మంథని నియోజకవర్గం తీర్చిదిద్దుతున్నామని అన్నారు. రాబోయే విద్యా సంవత్సరం నుంచి ఇక్కడ ఏ.టి.సి కేంద్రం ఏర్పాటు కాబోతుందని, దీనికి సహకరించిన ముఖ్యమంత్రి కు మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో తమ హయాంలో ఇంజనీరింగ్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, ఐటిఐ సెంటర్, రైతు పరిశోధన కేంద్రం ఏర్పాటు చేశామని అన్నారు. యువతకు మార్గదర్శకం చేసేందుకు ఏ.టి.సి సెంటర్ ఏర్పాటు కాబోతుందని అన్నారు. మంథని ప్రజలకు ఉపయోగపడే విధంగా పట్టణంలో వివిధ కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి 10 కోట్ల రూపాయలు మంజూరు చేశామని అన్నారు. పట్టణంలో నిర్మించే కమ్యూనిటీ హాల్స్ మంథని ప్రజలు ఎవరైనా ఉపయోగించుకోవచ్చని అన్నారు. మంథని పట్టణ హెడ్ క్వార్టర్ లో 30 కోట్ల రూపాయలతో అంతర్గత సిసి రోడ్లు వేసామని, అంబేద్కర్ విజ్ఞాన్ భవన్ నిర్మాణానికి కోటి రూపాయలు,మున్నూరు కాపు భవనానికి 60 లక్షల రూపాయలు మంజూరు చేసామని అన్నారు. మధున పోచమ్మ ఆలయ అభివృద్ధికి 25లక్షల, వినాయక మండపం 10 లక్షలు, మహా లక్ష్మి దేవాలయానికి 10 లక్షలు, చిన్నప్ప-పెద్దప్ప ఆలయానికి 10 లక్షలు, మహిళా భవనానికి 50 లక్షల కేటాయించామని అన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు రిక్రియేషన్ అయ్యేందుకు 50 లక్షల మంజూరు చేశామని అన్నారు. పేద ప్రజల ఇంట్లో వివాహాల సమయంలో ఇబ్బందులు కాకుండా ఉండేందుకు కమ్యూనిటీ హాల్స్ నిర్మిస్తున్నామని అన్నారు. ప్రతి కమ్యూనిటీ వాళ్లు చిన్న కమిటీ ఏర్పాటు చేసుకుని త్వరగా తమ కమిటీ హాల్స్ నిర్మాణం పూర్తి చేసుకోవడంలో కృషి చేయాలని అన్నారు. కమిటీ హాల్స్ నిర్మాణానికి అవసరమైన భూమి ఎంపిక చేసి త్వరగా టెండర్లు పిలవాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

# దళితుడైన సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలి



**జయశంకర్ భూపాలపల్లి అక్టోబర్ 13(వుదయం ప్రతినిధి):** దళితులైన సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి ఆర్ గవాయి మీద దాడి చేసిన నిందితుడిని తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలి అని ఎమ్మార్పీఎస్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఇన్చార్జి మడిపల్లి శ్యాం బాబు మాదిగ డిమాండ్ చేశారు సోమవారం జస్టిస్ బి ఆర్ గవాయి పై దాడికి నిరసనగా ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు నోముల శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జ్ మడిపల్లి శ్యాంబాబు మాదిగ మాట్లాడుతూ చీఫ్ జస్టిస్ మీద జరిగిన దాడి అనాగరికమైందని ఈ దాడి ప్రజాస్వామిక స్ఫూర్తి, రాజ్యాంగం మీద జరిగిన దాడిగానే ఉన్నదని అన్నారు ఈ దాడి సమస్త భారతీయులను దిగ్భ్రాంతికి గురి చేసిందని తెలిపారు దళిత, పీడిత వర్గాల ప్రజలను తీవ్ర మనోవేదనకు గురి చేసింది అన్ని. అందువల్ల దేశ ప్రజలందరూ ఈ దాడిని ఖండించారు అని అన్నారు దళితుడైన బిఆర్ గవాయి సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ కావడం కొన్ని ఆధిపత్య శక్తులు జీర్ణించుకోలేకపోతున్నాయి అందుకే అహంపూరితంగా ఈ దాడికి తెగపడ్డారు అని ఆరోపించారు ఈ దాడికి పాల్పడ్డ వ్యక్తి మీద తక్షణమే కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలి అని అలాగే దాడికి వెనుక ఉన్న శక్తులను గుర్తించి వారికి శిక్షలు పడేలా ఈ ఘటన మీద సమగ్రమైన దర్యాప్తు జరిపించాలి అని డిమాండ్ చేశారు సుప్రీం కోర్టులో అనుభవం కలిగిన ప్రజస్వామిక దృక్పథం కలిగిన రిటైర్డు జడ్జీలను దర్యాప్తు కోసం నియమించాలి అన్ని ఇలాంటి ఘటనలు ఉన్నత న్యాయవ్యవస్థల్లో పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలి అన్ని డిమాండ్ చేస్తూ భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్ ముందు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం అనంతరం డిప్యూటీ కలెక్టర్ అశోక్ కుమార్ కి వినతి పత్రాన్ని అందించారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లాలలోని నాయకులు దోర్నాల రాజేందర్ మాదిగ దోర్నాల భరత్ మాదిగ, మెరపట్టి అశోక్ మాదిగ మంద కిరణ్ మాదిగ, మంద తిరుపతి మాదిగ, మామిడి రవి మాదిగ,ఎర్ర భద్రయ్య మాదిగ, రామ్ చందర్ మాదిగ,మంచినీళ్ల వైకుంఠం మాదిగ,మొలుగూరి రవీందర్ మాదిగ ఒంటరి రాజేష్ మాదిగ బోడికల శ్రీకాంత్ మాదిగ,బెల్లంపల్లి సురేష్ మాదిగ,రేణిగుంట్ల శంకర్ మాదిగ,చావటి సంతోష్ మాదిగ, పుల్యాల రాజయ్య మాదిగ పంగ చందు మాదిగ, దోర్నాల నరేష్ దోర్నాల స్వామి నోముల రాజ పోషాలు నోముల రాజు సమ్మయ్య చిరపాక సుమన్ మంగలి రవి ఎర్ర వంశి మాదిగ సాంబయ్య అంకుష్ ప్రభాకర్ బోడికల సమ్మయ్య కన్నూరి రాజేందర్ నిరపటి సిద్దు మాదిగ నిరపటి దీక్షిత్ మాదిగ సదరపు రాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# దమ్మపేటలో ఘనంగా పోషణ మాసం




**దమ్మపేట అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం మల్లారం గ్రామం రైతువేదిక నందు సోమవారం పోషణ మాసం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా దమ్మపేట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని దమ్మపేట మండల స్థాయిలో "సామూహిక సీమంతాలు, అన్నప్రాసనలు, మొదటి 1000 రోజుల ప్రాముఖ్యత పై అవగాహన కార్యక్రమాలు" నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీలక్ష్మి, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిణి స్వర్ణలత లెనినా, స్త్రీ శిశు సంక్షేమ అధికారిణి హేమసత్య, సూపర్వైజర్లు, పోషణ అభియాన్ బ్లాక్ కో ఆర్డినేటర్, అంగన్వాడి టీచర్లు, గ్రామస్తులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# పీసీసీ సభ్యుడు రంజిత్ రెడ్డిని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



**ఖానాపురం, అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి):** పీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి తాతమ్మ సుశీలమ్మ ఇటీవలే మృతి చెందగా మృతురాలి చిత్రపటానికి నర్సంపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల జగన్ మోహన్ రెడ్డి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వీరమనేని సాగర్ రావు, సీనియర్ నాయకుడు దేవినేని వేణుగోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

# రెండు బైకులు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు



**(గద్వాల అక్టోబర్ 13 వుదయం ప్రతినిధి)** గద్వాల, అయిజ ప్రధాన రహదారి పై సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకెళితే అయిజ మండలం పులికల్ గ్రామానికి చెందిన ఓ యువకుడు, దౌదర్ పల్లి గ్రామానికి చెందిన విజయ్ అనే యువకుడు తమ తమ బైకుల పై గద్వాల్ వైపు వస్తుండగా రైల్వే బ్రిడ్జి సమీపంలో ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే గద్వాల్ ప్రభుత్వ ఆసుపత్రికి వారిని తరలించారు. ప్రమాద సమాచారం అందుకున్న గద్వాల టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక రైల్వే బ్రిడ్జి వద్ద తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని, అక్కడ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

# ప్రతి ఒక్కరు నేత్రదానానికి ముందుకు రావాలి: అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని విక్రమార్క



**మధిర,అక్టోబర్ 13(వుదయం ప్రతినిధి)** మధిర మండల కృష్ణాపురం గ్రామం వాస్తవ్యులు వ్యవసాయ శాఖ, విశ్రాంత సహాయ సంచాలకులు చావ నాగేశ్వరరావు ఈనెల 2 న పరమపదించగా వారి భార్య విజయ, కుమారులు రమేష్ బాబు, సతీష్ బాబు యుఎస్ఏ నాగేశ్వరరావు నేత్రాలను కార్నియా అంధులకు అమర్చే నిమిత్తం, ఖమ్మం నేత్రనిధికి అందజేశారు. ఈనెల 12 న నాగేశ్వరరావు ఇష్ట బంతి పురస్కరించుకొని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి వర్యులు భట్టి విక్రమార్క సతీమణి అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మల్లు నందిని విక్రమార్క నేత్రదాత కుటుంబ సభ్యులను కృష్ణాపురంలోని వారి ఇంటికి వచ్చి పరామర్శించినారు. సమాజంపట్ల బాధ్యతతో,వీరు చేసిన నేత్ర దానంతో ఇరువురు కార్నియా అంధులకు చూపు వచ్చిందని, ప్రతిఒక్కరు మరణానంతరనేత్రదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నేత్రదాత భార్య విజయకి నేత్రదాన ప్రశంసా పత్రం,జ్ఞాపిక,బ్యానర్, అందజేసి మల్లు నందిని విక్రమార్క చేతుల మీదుగా నేత్ర నిధి బాధ్యులు మాధవరపు నాగేశ్వరరావు సత్కరింప చేశారు. నేత్ర శరీర దానాలపై అవగాహన సదస్సులు నిర్వహించి, దాతలను ప్రోత్సహించి,నేత్ర శరీర దానాల సమయంలో తగు సహాయ సహకారాలు అందిస్తూ కృషి చేస్తున్న, తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవరపు నాగేశ్వరరావును నందిని విక్రమార్క అభినందించినారు. ఈ కార్యక్రమంలో వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి,కోనా ధని కుమార్, కర్నాటి రామారావు, కర్నాటి రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు పంట నష్ట పరిహారం అందించాలి:

## గడ్డం శ్రీహరి, బిజెపి మండల అధ్యక్షులు



**మధిర, అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి):** ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మండలంలో దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని బిజెపి మండల అధ్యక్షులు గడ్డం శ్రీహరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరు నాగేశ్వరరావుతో కలిసి మండల నాయకులు తాహశిల్దార్ రాళ్లబండి రాంబాబుకు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆ పార్టీ మండల అధ్యక్షులు గడ్డం శ్రీహరి మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, ఎకరాకు 25 వేల నష్టపరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు నెల్లూరి బెనర్జీ,మచ్చా కృష్ణారావు, అంకె విజయ్, అంకె శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

# వివేక్ మృతి బాధాకరం

## రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**హుస్నాబాద్ (వుదయం) అక్టోబర్:13** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం జిల్లెల్లగడ్డలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సోమవారం సందర్శించారు. ఈ నెల 7వ తేదీన పాఠశాలలో అనుమానాస్పదంగా మృతి చెందిన విద్యార్థి వివేక్ ఘటనపై ఆయన ఉపాధ్యాయులు, విద్యార్థుల నుండి వివరాలు సేకరించారు. హాస్టల్ వంటగదిని పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడిన బక్కి వెంకటయ్య...విద్యార్థి వివేక్ మృతి అత్యంత బాధాకరం. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీ, కలెక్టర్‌లకు ఆదేశించాం అని తెలిపారు. కలెక్టర్ విద్యార్థి మృతి విచారణకు ఎంక్వైరీ ఆఫీసర్‌గా ఈడిఎస్సీ కార్పొరేషన్ అధికారి విజయ్ భాస్కర్‌ను నియమించినట్లు ఆయన చెప్పారు. హుస్నాబాద్ ఏసీపీ నివేదిక, పోస్టుమార్టం రిపోర్ట్, అలాగే విచారణాధికారి విజయ్ భాస్కర్ సమర్పించే నివేదికల ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఇప్పటికే 12 మంది సహ విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడిని విచారణకు హాజరు పరచి వివరాలు సేకరించాం. విద్యార్థి మృతి వెనుక ఉన్న కారణాలను సమగ్రంగా విచారించి, దోషులపై కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జాతీయ మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న రాజు, రాష్ట్ర సాంస్కృతిక చైర్మన్ ఎలుక దేవయ్య, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఆరె. కిశోర్, కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలుక ఆంజనేయులు, మీడియా సెల్ ఇన్‌ఛార్జ్ జాల శ్రీనివాస్, అక్కన్నపేట మండల నాయకులు గిరిమల్ల గిరి ప్రసాద్, మాషం కొమురయ్య, సుంకే రమేష్, గుమ్మడి సాయి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటు చోర్‌పై సంతకాల సేకరణను విజయవంతం చేయాలి: సూరంశెట్టి కిషోర్



**మధిర,అక్టోబర్ 13,(వుదయం ప్రతినిధి)** ఓటు చోర్ సంతకాల సేకరణ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా పాల్గొని విజయవంతం చేయాలని మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూరం శెట్టి కిషోర్ పిలుపునిచ్చారు. మధిర పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మధిర మండల గ్రామ శాఖ అధ్యక్షులు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిజెపి ఓటు చోర్‌తో ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో అధికారంలోకి రావాలని చూస్తుందని ధ్వజమెత్తారు. మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రంలో కూడా ఓటు చోర్ కు పాల్పడిందని విమర్శించారు. రాత్రికి రాత్రి 60 లక్షల ఓట్లు నమోదు చేసిందని ఆరోపించారు. దీనిని నిరసిస్తూ ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పాదయాత్ర చేపట్ట డం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీ పిలుపుమేరకు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు మధిర నియోజకవర్గం వ్యాప్తంగా అన్ని పట్టణాలు, గ్రామాల్లో ఓటు చోరిపై సంతకాల సేకరణ కార్య క్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతి గ్రామంలో 100కు పైగా సంతకాలు సేకరించి రాష్ట్రపతికి, ఎన్నికల కమిషన్కు పంపడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మధిర మండలంలోని కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు దుంప వెంకటేశ్వర రెడ్డి, సేవాదళ్ అధ్యక్షులు ఆదూరి శీను, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్నాటి రామారావు,నిడమనూరు వంశీకృష్ణ,పగిడిపల్లి డేవిడ్, బిట్రా ఉద్దండయ్య, వనమా పిచ్చయ్య, ఓబుల లక్ష్మారెడ్డి, కరివేద రాంబాబు,దూదేకుల జానీ మధిర మండలంలోని గ్రామ శాఖ అధ్యక్షులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ ద్వారా నిరుపేదలకు ఊరట

## ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి



**కరీంనగర్, అక్టోబర్13 (వుదయం ప్రతినిధి)** ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థిక సహాయం అందిస్తూ పేద,మధ్య తరగతి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఊరట కల్పిస్తున్నదని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పారు. సోమవారం ఇల్లంతకుంట మండల పరిషత్ కార్యాలయ కార్యాలయంలో 71 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు.

# నెర్రలు బారిన అయిజ 30 పడకల ఆసుపత్రి..

## పట్టించుకోని రేవంత్ రెడ్డి సర్కార్...

## బి అర్ ఎస్వీ.జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య

**(అలంపూర్ అక్టోబర్ 13 వుదయం ప్రతినిధి)** జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండల కేంద్రంలోని 30 పడకల ఆసుపత్రి భవనం ను తక్షణమే పూర్తి చేసి ప్రజలకు



అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బియం.సంతొష్ కి జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య సోమవారం ప్రజావాణిలో వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కురువ పల్లయ్య మాట్లాడుతూ, మండల కేంద్రంలోని 30 పడకల ఆసుపత్రి లక్షల రూపాయలతో కట్టించి ఇవాళ శిథిలావస్థకు చేరుకున్న పరిస్థితి ఉన్నది. ఇందులో ఇప్పటికే గోడలు పగుళ్ళు వచ్చాయి. కిటికీలు, డోర్లు పగిలిపోయినవి. లోపల సిగరెట్లు మందు సీసాలతో స్వైర విహారం చేస్తున్నాయని అన్నారు. కేవలం కేసీఆర్ నిర్మించినారు అనే అక్కసుతో దాన్ని ప్రారంభించకుండా సామాన్య ప్రజలకు వైద్యాన్ని అందించకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మూర?ంగా వ్యవహరిస్తున్నరని విమర్శించారు. ఇవాళ ఈ మండల కేంద్రానికి దాదాపుగా 70 గ్రామాల ప్రజలు నిత్యం వస్తూ ఉంటారు. తక్షణమే 30 పడకల ఆసుపత్రి పైన నిర్లక్ష్యంను వీడనాడి ప్రజలకు అందుబాటులోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామాంజనేయులు, రమేష్, రవి తదితరులు ఉన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## కాంగ్రెస్ పార్టీ అంటేనే బడుగు బలహీన వర్గాల పార్టీ

## మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల



**ఖానాపురం అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి):** అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆశయమని నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల జగన్ మోహన్ రెడ్డి మండల ప్రజలకు తెలిపారు. మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఇంటి వద్ద మంగళవారిపేట గ్రామ పార్టీ అధ్యక్షుడు బొమ్మగాని నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి ముఖ్య అతిథులుగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్గొని ఐటీడీఏ పరిధిలోని గ్రామాల ప్రజలకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను మండల ప్రజలను ఉద్దేశించి వారు మాట్లాడుతూ, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో మండలంతో పాటు మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాలలోని ఎంపీటీసీలను సర్పంచ్లను జడ్పిటిసిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని ప్రజలకు నాయకులకు లబ్ధిదారులకు తెలుపుతూ, కాంగ్రెస్ పార్టీ అంటేనే బడుగు బలహీన వర్గాల పార్టీ అని తెలుపుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారంటీల సంక్షేమ పథకాలను విడుదల వారీగా బడుగు బలహీన వర్గాల ప్రజలకు అందజేస్తున్న పార్టీ అంటే కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి మహిళకు ఉచిత బస్ సౌకర్యం, ప్రతి ఇంటికి ఉచిత విద్యుత్, మహిళకు గ్యాస్ సిలిండర్, రైతులకు బోనస్, రైతులకు రుణమాఫీ, ఇంటింటికి సన్న బియ్యం, రేషన్ కార్డు లేని వారికి రేషన్ కార్డులు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వందేనని తెలిపారు. బోకరిగాండ్ల పార్టీ అంటే బిఆర్ఎస్ పార్టీ అని బిఆర్ఎస్ పార్టీ బోకరిగాండ్లు పట్టుకొచ్చే డోకా కార్డులను తీసుకునే ముందు గత పది సంవత్సరాలు మీరు ఏం మాకు చేశారని నిలదీయాలని ఇంటింటి ప్రజలకు వారు విజ్ఞప్తి చేస్తూ, గత పది సంవత్సరాలలో ఏ ఒక్కరికైనా ఇల్లు ఇచ్చారా, ఏ ఒక్కరికైనా ఉచిత విద్యుత్ ఇచ్చారా, ఏ ఒక్కరికైనా కొత్త రేషన్ కార్డు ఇచ్చారా, ఎప్పుడైనా 10 సంవత్సరాల కాలంలో సన్న బియ్యం ఇచ్చిన దాఖలాలు ఉన్నాయని డోకా కార్డులు పట్టుకుచ్చే బోకర్ గాండ్లను నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇల్లులేని నిరుపేదలకు మొదటి విడతలో మండల వ్యాప్తంగా 345 ఇండ్లు మంజూరు కాగా అవన్నీ బేస్మెంట్ లెవల్, సబ్జా లెవెల్, స్లాబ్ లెవల్ లో ఉన్నాయని లబ్ధిదారుల ఖాతాలో రెండు నుంచి మూడు బిల్లులు జమఅయ్యాయని తెలుపుతూ, వీటితో పాటు ఐటీడీఏ పరిధిలోని మన మండలంలోని ఎనిమిది గ్రామాలకు 122 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా 96 ఇందిరమ్మ ఇండ్లకు ప్రొసీడింగ్ పత్రాలు వచ్చాయని మిగిలినవి కూడా త్వరలో ప్రొసీడింగ్ పత్రాలువస్తాయని లబ్ధిదారులకు తెలుపుతూ, సోమవారం మంగళవారపేట పరిధిలోని 27 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వీరమనేని సాగర్ రావు, ఉపాధ్యక్షుడు మూడు పూల్ సింగ్, ప్రధాన కార్యదర్శి ఎస్కే లాల్ సాబ్, కార్యదర్శి కోరే రాములు, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్కే ముస్తాపా. మండల సీనియర్ నాయకులు వేములపల్లివెంకటప్రసాదరావు,మారబోయినరాములు, జాటోతు నరసింహనాయక్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆరే సంపత్ కుమార్, నాయకులు వెంకన్న, మురళి, మహేష్, శ్రీను, మనోజ్, సదన్, లింగయ్య, సునీల్, మల్లేష్, హరిలాల్ లబ్ధిదారులు తదితరులు.

# జాతీయం – అంతర్జాతీయం

## ఢిల్లీలోని అఫ్ఘాన్ రాయబార కార్యాలయం తమదేనన్న మంత్రి ముత్త



భారత్‌లో పర్యటిస్తున్న ఆఫ్ఘనిస్థాన్ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాఖీ సంచలన ప్రకటన చేశారు. న్యూఢిల్లీలోని ఆఫ్ఘన్ రాయబార కార్యాలయం పూర్తిగా తమ నియంత్రణలోనే ఉందని స్పష్టం చేశారు. ఆదివారం ఆయన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తన ముందు, వెనుక ఇస్లామిక్ ఎమిరేట్ జెండాను ఉంచి మాట్లాడటం ప్రాధాన్యం సంతరించుకుంది. భారత్ ఇంకా అధికారికంగా తాలిబన్ ప్రభుత్వాన్ని గుర్తించనప్పటికీ, ఎంబసీలో పాత జెండానే కొనసాగుతున్నప్పటికీ ఆయన ఈ ప్రకటన చేయడం గమనార్హం. "ఇది మా జెండా. దీని నీడలోనే మేం జిహాద్ చేశాం. ఈ ఎంబసీ నూటికి నూరు శాతం మాదే. ఇక్కడ పనిచేస్తున్న వారంతా మాతోనే ఉన్నారు" అని ముత్తాఖీ ఒక ప్రశ్నకు బదులిస్తూ తేల్చి చెప్పారు.గతంలో మహిళా జర్నలిస్టులను అనుమతించలేదని విమర్శలు రావడంతో, ఈసారి ఆదివారం నాటి సమావేశానికి మహిళా జర్నలిస్టులతో సహా పెద్ద సంఖ్యలో మీడియా ప్రతినిధులను అనుమతించారు.భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో జరిపిన చర్చలు ఫలవంతంగా, నిర్మాణాత్మకంగా సాగాయని ముత్తాఖీ తెలిపారు. "వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థ, ఆరోగ్యం, విమాన సర్వీసులు, అభివృద్ధి ప్రాజెక్టులపై చర్చించాం. వాణిజ్య వీసాలు, విద్యార్థుల మార్పిడి, ఆగిపోయిన పనులను తిరిగి ప్రారంభించేందుకు భారత్ సంసిద్ధత వ్యక్తం చేసింది" అని ఆయన వివరించారు. కాబూల్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని అప్‌గ్రేడ్ చేసేందుకు కూడా భారత్ నిర్ణయించిందని ఆయన వెల్లడించారు.ఢిల్లీ–కాబూల్, ముంబై–కందహార్, అమృత్‌సర్–ఆఫ్ఘనిస్థాన్ మధ్య కొత్త విమాన సర్వీసులను ప్రారంభించే ప్రణాళికలను ముత్తాఖీ ప్రకటించారు. ఇరు దేశాల మధ్య ఉమ్మడి వాణిజ్య కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు, ఖనిజాలు, వ్యవసాయం, క్రీడల రంగాల్లో సహకారంపై కూడా చర్చలు జరిపినట్లు తెలిపారు. ఆఫ్ఘన్ సరుకుల కోసం అటారీ–వాఘా సరిహద్దును తెరవాలని భారత్‌ను కోరినట్లు ఆయన ధృవీకరించారు.మహిళల హక్కులపై అడిగిన ప్రశ్నకు, "ఇస్లాంలో స్త్రీ, పురుషులు అనే తేడా లేకుండా అందరి హక్కులకు రక్షణ ఉంది. మేం విద్యకు వ్యతిరేకం కాదు.

## అమ్మాయిలు రాత్రి వేళల్లో బయట తిరగవద్దని సీఎం మమతా బెనర్జీ వ్యాఖ్య



పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్‌లో వైద్య విద్యార్థినిపై జరిగిన సామూహిక అత్యాచార ఘటనపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. అమ్మాయిలు, ముఖ్యంగా హాస్టళ్లలో ఉండే విద్యార్థినులు రాత్రి వేళల్లో బయటకు వెళ్లకపోవడం మంచిదని ఆమె సూచించారు. అయితే, ఇలాంటి కిరాతక ఘటనల పట్ల తమ ప్రభుత్వం ఎంతమాత్రం సహించబోదని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించినట్లు ఆమె స్పష్టం చేశారు.ఆదివారం కోల్‌కతా విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతూ, "బయటి రాష్ట్రాల నుంచి ఎంతో మంది విద్యార్థులు ఇక్కడ చదువుకోవడానికి వస్తున్నారు. రాత్రిపూట ఎవరు ఎక్కడికి వెళుతున్నారో పోలీసులకు తెలియదు. ప్రతి ఇంటికీ వెళ్లి పోలీసులు కాపలా కాయలేరు కదా. రాత్రి 12:30 గంటలకు బయటకు వెళ్లినప్పుడు ఏదైనా జరిగితే మేము ఆ ఘటనను ఖండిస్తున్నాం. ఎక్కడికైనా వెళ్లే స్వేచ్ఛ అందరికీ ఉంది, కానీ జాగ్రత్తగా ఉండాలి" అని మమతా బెనర్జీ అన్నారు. విద్యార్థుల భద్రత విషయంలో ప్రైవేట్ మెడికల్ కాలేజీ యాజమాన్యానికి కూడా బాధ్యత ఉంటుందని ఆమె గుర్తుచేశారు. ఒడిశాలోని జలేశ్వర్‌కు చెందిన ఓ యువతి దుర్గాపూర్‌లోని ఒక ప్రైవేట్ మెడికల్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. శుక్రవారం రాత్రి ఆమె తన స్నేహితుడితో కలిసి భోజనం కోసం కాలేజీ క్యాంపస్ బయటకు వెళ్లింది. ఆ సమయంలో బైక్‌లపై వచ్చిన కొందరు యువకులు వారిని వెంబడించి, అసభ్యంగా ప్రవర్తించారు. విద్యార్థిని స్నేహితుడిని బెదిరించి పంపించివేసి, ఆమెను సమీపంలోని అటవీ ప్రాంతంలోకి లాక్కెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె మొబైల్ ఫోన్ కూడా లాక్కుని పడేశారు.కాసేపటి తర్వాత ఆ స్నేహితుడు మరికొందరితో కలిసి అక్కడికి చేరుకోగా, విద్యార్థిని గాయాలతో కిందపడి ఉండటాన్ని గమనించి ఆసుపత్రికి తరలించారు. కాలేజీ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు. ఈ ఘటనకు సంబంధించి షేక్ రియాజుద్దీన్, అపు బౌరి, ఫిర్దోస్ షేక్‌లను అరెస్ట్ చేశారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు.ఈ ఘటనపై జాతీయ మహిళా కమిషన్ కూడా స్పందించింది. ఐదు రోజుల్లోగా యాక్షన్ టేకెన్ రిపోర్ట్ సమర్పించాలని పశ్చిమ బెంగాల్ డీజీపీని ఆదేశించింది. విద్యార్థినికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని మెడికల్ కాలేజీ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది.

## మైనర్ బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన దుండగులు

ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో దారుణ ఘటన చోటుచేసుకుంది. 16 ఏళ్ల బాలికపై ఐదుగురు దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈకేసులో పోలీసులు వేగంగా స్పందించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు.ఒకరిని ఎన్‌కౌంటర్ అనంతరం అదుపులోకి తీసుకున్నారు. పోలీ సుల కథనం ప్రకారం బాధితురాలు శనివారం మధ్యాహ్నం 12గంటల సమయంలో తన సోదరి ఇంటికి వెళ్లేందుకు ఒక పరిచయస్తుడితో కలిసి మోటార్‌సైకిల్‌పై బయలుదేరింది. మార్గమధ్యలో బంత్రా ప్రాంతంలోని ఓ పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న మామిడి తోట వద్ద వారు ఆగారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న ఐదుగురు వ్యక్తులు, బాలికతో ఉన్న వ్యక్తిని చితకబాది, ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టారు.ఈ ఘటనపై బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుల కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ఈ క్రమంలో గత రాత్రి హరౌనీ రైల్వే స్టేషన్ సమీపంలో తనిఖీలు చేస్తుండగా, బైక్‌పై వస్తున్న ఇద్దరు అనుమానితులను ఆపేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఈ క్రమంలో వారు పోలీసులపై కాల్పులు జరిపారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన ఎదురుకాల్పుల్లో ఒక నిందితుడి కాలికి బుల్లెట్ తగిలింది.గాయపడిన నిందితుడిని లలిత్ కశ్యప్‌గా గుర్తించామని, అతడిని ఆసుపత్రికి తరలించామని డీసీపీ నిపుణ్ అగర్వాల్ తెలిపారు. గతంలో కూడా లలిత్‌పై జూదం, దొంగతనం కేసులు ఉన్నాయని ఆయన వెల్లడించారు. సంఘటనా స్థలం నుంచి తప్పించుకున్న మరో నిందితుడు, 20 ఏళ్ల మీరజ్‌ను కూడా రైల్వే స్టేషన్ సమీపంలోనే అరెస్ట్‌చేసినట్లు డీసీపీ చెప్పారు. నిందితుల నుంచి ఒకబైక్, నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నామని, పరారీలో ఉన్న మిగతా ముగ్గురి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని ఆయన వివరించారు.

## బంగ్లాదేశ్‌లో హిందువులపై హింస అంతా అసత్య ప్రచారమే

బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై హింస జరుగుతోందంటూ వస్తున్న వార్తలను ఆ దేశ ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్ తీవ్రంగా ఖండించారు. ఇదంతా భారత్ నుంచి ఉద్దేశపూర్వకంగా వ్యాప్తి చేస్తున్న 'ఫేక్ న్యూస్' అని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. గత వారం అమెరికన్ జర్నలిస్ట్ మెహదీ హసన్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు."ప్రస్తుతం భారత్‌లో ఫేక్ న్యూస్ ఒక ప్రత్యేకతగా మారిపోయింది. అక్కడి నుంచి తప్పుడు వార్తలు వెల్లువెత్తుతున్నాయి" అని యూనస్ ఆరోపించారు. దేశంలో జరుగుతున్న కొన్ని సంఘటనలను మతపరమైనవిగా చిత్రీకరిస్తున్నారని, అవి కేవలం భూవివాదాలు వంటి స్థానిక సమస్యల కారణంగా పొరుగువారి మధ్య జరిగే సాధారణ గొడవలు మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో భారత్ నిరంతరం ఒత్తిడి తెస్తున్నందున తమ ప్రభుత్వం చాలా అప్రమత్తంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

## ఆఫ్ఘనిస్థాన్‌పై పాకిస్థాన్ తీవ్ర ఆగ్రహం

భారత్‌తో స్నేహాన్ని బలపరుచుకుంటున్న ఆఫ్ఘనిస్థాన్‌పై పాకిస్థాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇటీవల న్యూఢిల్లీలో వెలువడిన భారత్–ఆఫ్ఘనిస్థాన్ సంయుక్త ప్రకటనపై తీవ్ర అభ్యంతరం తెలుపుతూ, ఇస్లామాబాద్‌లోని ఆఫ్ఘన్ రాయబారికి సమన్లు జారీ చేసింది. ఆఫ్ఘన్ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తఖీ ప్రస్తుతం భారత్‌లో ఆరు రోజుల పర్యటనలో ఉన్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.పాకిస్థాన్ విదేశాంగ శాఖ అదనపు కార్యదర్శి (పశ్చిమాసియా, ఆఫ్ఘనిస్థాన్), ఆఫ్ఘన్ రాయబారితో సమావేశమై తమ దేశం తీవ్ర ఆందోళనలను తెలియజేశారు. ముఖ్యంగా, అక్టోబర్ 10న విడుదలైన ఉమ్మడి ప్రకటనలో జమ్మూకశ్మీర్‌పై చేసిన ప్రస్తావనను పాకిస్థాన్ తీవ్రంగా వ్యతిరేకించింది. "జమ్మూకశ్మీర్‌ను భారత్‌లో భాగంగా పేర్కొనడం ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానాలకు స్పష్టమైన ఉల్లంఘన" అని పాక్ విదేశాంగ శాఖ తన అధికారిక ప్రకటనలో స్పష్టం చేసింది.

## యుద్ధం ముగిసింది.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్



ఇజ్రాయెల్–హమాస్ మధ్య తొలి దశ శాంతి ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా హమాస్ ఈరోజు ఇజ్రాయెల్ బందీలను విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇజ్రాయెల్ బయలుదేరి వెళ్లారు. విమానంలో బయలుదేరే ముందు రిపోర్టర్లతో మాట్లాడుతూ.. గాజాలో యుద్ధం ముగిసినట్లు ప్రకటించారు. ఇక నుంచి పశ్చిమాసియాలో సాధారణ పరిస్థితులు నెలకొననున్నట్లు పేర్కొన్నారు. దాదాపు రెండేళ్ల తర్వాత గాజా–ఇజ్రాయెల్ మధ్య శాంతి ఒప్పందం నెలకొంది. సోమవారం బందీల విడుదల నేపథ్యంలో ట్రంప్ ఇజ్రాయెల్‌కు వచ్చారు. ఈరోజు ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రసంగించనున్నారు. అనంతరం బందీల కుటుంబ సభ్యులను కలవనున్నారు. అక్కడి నుంచి ఈజిప్ట్ వెళ్లనున్నారు. అధ్యక్షుడు అబ్దెల్ ఫతా అల్ సిసీ నిర్వహిస్తున్న శాంతి శిఖరాగ్ర సదస్సులో పాల్గొంటారు. ఈ సందర్భంగా కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధించిన సంతకాల కార్యక్రమం ఉంటుంది. ఈ సదస్సుకు 20 దేశాల అధినేతలు, అంతర్జాతీయ ప్రముఖులు హాజరుకానున్నారు.

## శాంతి ప్రణాళికపై సంతకానికి హమాస్ దూరం

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన గాజా శాంతి ప్రణాళిక అమలుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ఈ ప్రణాళికపై ఈజిప్ట్ రాజధాని కైరోలో అధికారికంగా సంతకాలు జరగాల్సి ఉండగా ఆ కార్యక్రమానికి హాజరు కావడంలేదని హమాస్ ప్రకటించింది. ప్రణాళికలో నిరాయిధీకరణ, రాజకీయ బహిష్కరణ అంశాలపై అభ్యంతరాలు వ్యక్తంచేసింది.. హమాస్ నిర్ణయంతో ఈ ఒప్పందం భవితవ్యం అనిశ్చితిలో పడినట్లైంది. ప్రణాళికలో తన సభ్యులు గాజా స్ట్రిప్‌ను వీడాలన్న సూచనలను హమాస్ తోసిపుచ్చింది. ట్రంప్ ప్రతిపాదనలను నిరర్థకమైనవిగా అభివర్ణించింది. హమాస్ రాజకీయ బ్యూరో సభ్యుడు హొసామ్ బద్రాన్ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ' హమాస్ సభ్యులైనా కాకపోయినా పాలస్తీనియన్లు తమ మాతృభూమి నుండి బహిష్కరించడం అర్థం లేనిదని ' చెప్పారు. ప్రణాళిక రెండో దశపై సంప్రదింపులు జరగడం కష్టమేనని, ఎందుకంటే దానిలో అనేక సంక్లిష్టతలు, సమస్యలు ఉన్నాయని తెలిపారు. మధ్యప్రాచ్యంలో ట్రంప్ పర్యటిస్తున్న తరుణంలో హమాస్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. హమాస్ దాడి తర్వాత గాజాలో నిర్బంధంలో ఉన్న ఇజ్రాయిల్ బందీల విడుదల కార్యక్రమానికి హాజరయ్యేందుకు ట్రంప్ మధ్యప్రాచ్యంలో అడుగుపెడుతున్నారు.

## అమెరికా బెదిరింపులకు వెనక్కి తగ్గేది లేదు



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 100శాతం సుంకాల బెదిరింపులకు వెనక్కి తగ్గేది లేదని చైనా ధీటుగా బదులిచ్చింది. బెదిరింపులతో కాకుండా చర్చలతో విభేదాలను పరిష్కరించుకోవాలని అమెరికాకు సూచించింది. 'అమెరికా సుంకాలపై చైనా వైఖరి స్థిరంగా ఉంది' అని వాణిజ్య శాఖ ఆన్‌లైన్‌లో పోస్ట్ చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. "మేము సుంకాల యుద్ధాన్ని కోరుకోవడం లేదు. కాని సుంకాలకు భయపడేది లేదు" అని పేర్కొంది. ఏవైనా ఆందోళనలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించింది. అమెరికా బెదిరింపులకు దిగితే.. తమ దేశ చట్టబద్ధమైన హక్కులు మరియు ప్రయోజనాలను కాపాడుకోవడానికి తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

## భారత్-అమెరికా మధ్య రానున్న రోజుల్లో భాగస్వామ్యం పెరగనుంది




భారత్–అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఒక నూతన శకం ప్రారంభమైందని, దీనికి ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బలమైన నాయకత్వమే కారణమని భారత్‌లో అమెరికా కొత్త రాయబారిగా నియమితులైన సెర్గియో గోర్ అన్నారు. ట్రంప్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరున్న 38 ఏళ్ల గోర్, అమెరికా చరిత్రలోనే అత్యంత పిన్నవయస్కుడైన రాయబారిగా రికార్డు సృష్టించారు. అధికారికంగా బాధ్యతలు స్వీకరించడానికి ముందే ఆయన ఢిల్లీలో పర్యటిస్తూ, కీలక సమావేశాలు నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది.అక్టోబర్ 9న ఢిల్లీ చేరుకున్న సెర్గియో గోర్, తన ఆరు రోజుల పర్యటనలో భాగంగా విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీలతో సమావేశమయ్యారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీతో ఆయన నివాసంలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో రక్షణ, వాణిజ్యం, టెక్నాలజీ, ఇంధన భద్రతకు అవసరమైన కీలక ఖనిజాల వంటి అంశాలపై ఫలప్రదమైన చర్చలు జరిగాయి.ఈ సందర్భంగా, ట్రంప్ పంపిన ఒక ప్రత్యేక బహుమతిని గోర్ ప్రధాని మోదీకి అందించారు. గతంలో వైట్‌హౌస్‌లో ఇరువురు నేతలు కలుసుకున్నప్పటి ఫొటోపై "మిస్టర్ ప్రైమ్ మినిస్టర్, మీరు గొప్పవారు" అని ట్రంప్ స్వయంగా రాసి సంతకం చేసి పంపారు.సమావేశం అనంతరం గోర్ మాట్లాడుతూ, "ప్రధాని మోదీతో సమావేశం అద్భుతంగా జరిగింది. భారత్‌తో ఉన్న బంధాన్ని అమెరికా ఎంతో విలువైనదిగా భావిస్తుంది. అధ్యక్షుడు ట్రంప్ ప్రధాని మోదీని ఒక గొప్ప, వ్యక్తిగత మిత్రుడిగా భావిస్తారు. నేను ఢిల్లీ బయలుదేరడానికి ముందు కూడా ఇద్దరు నేతలు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. వారి మధ్య ఈ సంప్రదింపులు రానున్న రోజుల్లోనూ కొనసాగుతాయి. ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తాను," అని తన అధికారిక ప్రకటనలో తెలిపారు.

## బాలికల సంఖ్య తగ్గడం ఆందోళనకరం



న్యూఢిల్లీ: దేశంలో లింగ నిష్పత్తులు పడిపోవటంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి బి.వి నాగరత్న ఆందోళన వ్యక్తం చేశారు. బాలికలు మనుగడ సాగించటం మాత్రమే కాదనీ, అభివృద్ధి కూడా చెందాలని ఆమె సూచించారు. కొన్ని రాష్ట్రాల్లో శిశుహత్యలు, భ్రూణహత్యలతో లింగ నిష్పత్తులు క్షీణించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు జువైనల్ జస్టిస్ కమిటీ (జెజెసి) యునిసెఫ్ ఇండియా సహకారంతో నిర్వహించిన 'బాలికను రక్షించడం : భారతదేశంలో ఆమెకు సురక్షితమైన, అనుకూలమైన వాతావారణాన్ని అందించడం' పేరుతో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ బి.ఆర్ గవారు, కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రి అన్నపూర్ణ దేవి, జెజెసి సభ్యురాలు జస్టిస్ జె.బి పార్దివాలా, ఇతర సుప్రీంకోర్టు న్యాయమూర్తులు కూడా పాల్గన్నారు. భారత్‌లో ఒక యువతి.. ఒక పురుషుడిలాగే స్వేచ్ఛను, నాణ్యమైన మద్ధతును, తగిన వనరులను పొందగలిగినప్పుడే ఆమె నిజమైన సమాన పౌరురాలు అవుతుందని బి.వి నాగరత్న అన్నారు. ఆమె పుట్టే అవకాశాలు, సరైన పోషకాహారం, సంరక్షణ, విద్య మరియు భౌతిక వనరులు, సురక్షితమైన వాతావరణం, ప్రత్యేక స్వీయ భావాన్ని పెంపొందించుకోవడం వంటివి ఈ దేశంలో జన్మించే మగబిడ్డకు సమానంగా ఆమెకు కూడా ఉంటాయని చెప్పారు. ఆమె(బాలిక) కేవలం జీవించడమే కాదు.. చురుకుగా అభివృద్ధి చెందాలని ఆమె తెలిపారు. దేశంలో ఒక ఆడబిడ్డ ఎదుర్కొనే మొదటి అడ్డంకి.. పుట్టడం అనే చర్యేనని జస్టిస్ బి.వి నాగరత్న అభిప్రాయపడ్డారు. పుట్టే బిడ్డ ఆడపిల్ల అని విన్నప్పుడు చాలా కుటుంబాలు నిరాశ చెందడం దురదృష్టకరమైన వాస్తవమని చెప్పారు. "భారత్‌లో పిల్లల లింగ నిష్పత్తి (0–6 సంవత్సరాలు) స్వల్పంగా మాత్రమే మెరుగుపడింది. 2011 జనాభా లెక్కల ప్రకారం 1000 మంది అబ్బాయిలకు 914 మంది బాలికలు ఉన్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే–5 ప్రకారం అది 929కి పెరిగింది. కొన్ని రాష్ట్రాల్లో ఆడ శిశు హత్యలు, భ్రూణహత్యల కారణంగా లింగ నిష్పత్తులు దిగజారుతున్నట్టు ఇటీవల నివేదికలు వచ్చాయి" అని ఆమె అన్నారు. పోషకాహార సంరక్షణ ప్రాముఖ్యతను ఆమె నొక్కి చెప్పారు. సరైన పోషకాహారం లేకుండా ఆడపిల్లను ఉద్ధరించడానికి చేసే అన్ని ప్రయత్నాలూ వ్యర్థం కావచ్చని వివరించారు.

## భారత రాజ్యాంగం పవిత్ర గ్రంథమేమీ కాదు



భారత రాజ్యాంగం పవిత్ర గ్రంథమేమీ కాదని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) మాజీ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ అదే పవిత్ర గ్రంథమైతే, దానికి ఇప్పటివరకు 106 సార్లు సవరణలు ఎందుకు చేశారని ఆయన సూటిగా ప్రశ్నించారు. రామాయణం, భారతం, భగవద్గీత వంటి గ్రంథాలకు ఎటువంటి సవరణలు జరగలేదని ఆయన గుర్తుచేశారు.శనివారం హైదరాబాద్‌లోని ఫిలింనగర్ క్లబ్‌లో పాత్రికేయులు, మేధావులతో నిర్వహించిన ఒక చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "హిందువులకు సమాన హక్కుల నిరాకరణ, రాజ్యాంగ వివక్ష" అనే అంశంపై జరిగిన ఈ సమావేశంలో ఆయన తన అభిప్రాయాలను వెల్లడించారు. హిందువులు మెజారిటీగా ఉన్న ప్రాంతాల్లో ఇతర మతాల వారు సురక్షితంగా జీవించగలుగుతున్నారని, కానీ ఎక్కడైతే హిందువులు మైనారిటీలుగా ఉన్నారో అక్కడ వారి మనుగడే ప్రమాదంలో పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కశ్మీర్ అంశాన్ని ఆయన ఉదాహరణగా చూపారు. స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో కశ్మీర్‌లో 21 శాతంగా ఉన్న హిందువుల జనాభా, నేడు ఒక్క శాతం కూడా లేని దుస్థితికి చేరిందని తెలిపారు. లౌకికవాదం గురించి చెప్పే రాజ్యాంగం, కశ్మీర్‌లో హిందువులపై జరిగిన మారణహోమాన్ని ఎందుకు ఆపలేకపోయిందని ఆయన నిలదీశారు.విద్యా హక్కు విషయంలోనూ హిందువుల పట్ల వివక్ష కొనసాగుతోందని నాగేశ్వరరావు ఆరోపించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 28, 29, 30 ప్రకారం క్రైస్తవులు, ముస్లింలకు విద్య అనేది ప్రాథమిక హక్కుగా ఉందని, కానీ హిందువులకు మాత్రం అది కేవలం పౌర హక్కుగానే పరిమితమైందని ఆయన విశ్లేషించారు.

## బావిలో పడ్డ మహిళను కాపాడబోయి ముగ్గురు మృతి

బావిలో పడ్డ మహిళను కాపాడబోయి రెస్క్యూ ఆపరేషన్ అధికారితో సహా ముగ్గురు మృతి చెందారు. ఈ ఘటన సోమవారం ఉదయం కొల్లంలోని నెడువతూర్ వద్ద జరిగింది. ఈ ప్రమాదంలో అట్టింగల్‌కు చెందిన సోను ఎస్. కుమార్ (36) అనే రెస్క్యూ అధికారి మృతి చెందినట్లు కొల్లాం పోలీసులు గుర్తించారు. సోను కొట్టారక్కరలోని అగ్నిప్రమాక, రెస్క్యూ సర్వీసెస్ యూనిట్‌లో అధికారిగా పనిచేస్తున్నారు. నెడువతూర్‌కు చెందిన అర్చన (33), ఆమె పార్టనర్ కొండుంగల్లూర్ నివాసి శివకృష్ణన్ (22) చనిపోయారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. సోమవారం తెల్లవారుజామున అర్చన తన ఇంటికి ఆనుకుని ఉన్న మున్సిపల్ బావిలోకి దూకిందని అగ్నిమాపక, రెస్క్యూ సర్వీసెస్ విభాగానికి ఫోన్ కాల్ వచ్చింది. అత్యవసర విభాగంలో పనిచేసే కుమార్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని అర్చనను కాపాడడానికి బావిలో దూకారు. అలాగే శివకృష్ణన్ కూడా బావిలోకి దూకాడు. ఆ సమయంలోనే బావి గోడలు కూలిపోయి బావిలో పడిపోయాయి. దీంతో ఆ శిథిలాల కింద పడి ఉన్న వారిని స్థానిక ప్రజలే బయటకు తీశారు. తక్షణమే వారిని చికిత్స కోసం స్థానిక ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. శివకృష్ణన్ మద్యం మత్తులో అర్చనతో గొడవకు దిగడంతో.. ఆమె మనస్థాపానికి గురై బావిలోకి దూకినట్లు పోలీసుల తెలిపారు. వారిమధ్య అంతకుముందు జరిగిన గొడవల్లో తనకు తగిలిన గాయాలకు సంబంధించిన వీడియోలను అర్చన సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. ఈ వీడియోలను పోలీసులు పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.



# బిజినెస్



## అమెరికా అప్పులు తీర్చుకునేందుకే.. బంగారం ధరను అంతగా పెంచేస్తుందా!

ప్రపంచ మార్కెట్‌లో ఇటీవల బంగారం ధర అనూహ్యంగా పెరిగిపోయింది. ఇలా రికార్డు స్థాయిలో పెరగడం ఒక అడ్డంకి ప్రణాళికా లేదా అమెరికా రుణ సంక్షోభాన్ని అధిగమించడానికి ఒక రహస్య నాటకమా అన్న షాడో థియరీ ప్రచారంలో ఉంది.ప్రస్తుత మార్కెట్ ధరతో లెక్క కడితే అమెరికాలో బంగారం పుస్తక విలువ 11 బిలియన్ డాలర్ల నుంచి ఒక ట్రిలియన్ డాలర్‌కు పెరుగుతుంది. ఈ పెరుగుదలతో అమెరికా సులభంగా తన అప్పులు తీర్చేయవచ్చు. దీంతో ఆ దేశానికి ఇప్పుడు కొత్త అప్పులు చేయాల్సిన అవసరం లేకుండా, ఆస్తుల అమ్మకాలు జరపకుండా ఆకస్మిక లాభం చేకూరుతుందని ఆర్థికవేత్తలు అంటున్నారు. లింక్‌డ్ ఇన్‌లో వచ్చిన ఒక పోస్ట్ ప్రకారం 1970 నుంచి చూస్తే బంగారం రాబడి 649 రెట్లు ఉంది. ఈ లోహం ఇటీవలి పెరుగుదలకు నిజమైన కారణమేమిటనే లోతైన చర్చకు దారి తీసింది. పెరుగుతున్న రుణాన్ని భర్తీ చేయడానికి అమెరికా తన బంగారు నిల్వలను తిరిగి అంచనా వేయడానికి సిద్ధమవుతుండవచ్చు అన్న సిద్ధాంతం ప్రచారంలో ఉంది. అమెరికా ఇప్పటికీ తన బంగారాన్ని ఫెడరల్ రిజర్వ్ పుస్తకాలలో 1970లో నిర్ణయించిన ఔన్స్‌కు కేవలం 42.22 డాలర్ల ప్రకారం (ప్రస్తుతం 3,000 డాలర్లు) మాత్రమే నమోదు చేసిందని సీనియర్ సలహాదారు ఆసిన్ గుప్తా తెలిపారు. అయితే బంగారం 10 రెట్లు పెరిగిన ప్రకారం లెక్క వేసినా అమెరికా ట్రిలియన్ డాలర్ల రుణాన్ని తుడిచిపెట్టేస్తుందని ఆశిష్ యూ అనే మరో ఆర్థిక నిపుణుడు తెలిపాడు. అయితే ఇది డాలర్ పతనానికి దారి తీస్తుందని, ద్రవ్యోల్బణం ఆకాశాన్ని అంటుతుందని హెచ్చరించారు. ఈ వాదనను మరో ఆర్థిక వేత్త సేనుగుప్తా ఖండించారు. బంగారం బలపడితే డాలర్ కూడా బలంగా ఉంటుందని ఆయన అన్నారు.



## మార్ట్‌కు 3 నెలల్లోనే వందల కోట్ల లాభం..

భారతదేశంలోని ప్రజలకు.. ముఖ్యంగా సిటీల్లో ఉండే వారికి డీమార్ట్ గురించి తెలిసే ఉంటుంది. ఇది కిరాణా కింగ్‌గా పేరుగాంచింది. సామాన్యులు సహా ధనవంతులు కూడా కిరాణా సామగ్రి నుంచి ఫర్నీచర్, దుస్తులు, ఫుట్‌వేర్ ఇతర అన్ని రకాల వస్తువుల కోసం డీమార్ట్‌ను సందర్శిస్తుంటారు. ఎప్పుడూ జనం తాకిడి ఉంటుంది. శని, ఆదివారాల్లో ఇంకా ఎక్కువగా ఉంటుంది. అన్ని రకాల కిరాణా సామగ్రి.. పప్పులు, ఉప్పులు, ఆయిల్ ప్యాకెట్లు, డైరీ ప్రొడక్ట్స్, ఫర్నీచర్, ఫుట్‌వేర్, డ్రెస్సెస్, స్టీల్ సామగ్రి ఇలా ఇంట్లో అవసరమయ్యే వస్తువుల్లో మెజార్టీ ఇక్కడ అందుబాటులో ఉంటాయని చెప్పొచ్చు. మరి ఇలాంటి డీమార్ట్ స్టోర్లు దేశవ్యాప్తంగా వందల్లో ఉంటాయి. ఇక్కడ లాభాలు ఎలా వస్తాయో మీరు ఎప్పుడైనా తెలుసుకున్నారా.. తెలుసుకోవాలన్నా కోరిక కలిగిందా..? డీమార్ట్ రిటైల్ చెయిన్స్ నిర్వహిస్తున్న దాని మాతృ సంస్థ అవెన్యూ సూపర్‌మార్ట్స్ లిమిటెడ్.. 2025-26 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం ఫలితాల్ని తాజాగా విడు దల చేసింది.



 ఈ జులై- సెప్టెంబర్ త్రైమాసికంలో సంస్థ నికర లాభం 3.9శాతం పెరిగి రూ.684.8 కోట్లుగా నమోదైంది. అంటే 3 నెలల్లో ఇంత లాభం వచ్చిందన్నమాట. ఇది అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే సమ యంలో రూ.659.4 కోట్లుగా ఉండే ది. లాభం ఇక్కడ కాస్త పెరిగింది. ఇక సంస్థ కార్యకలాపాల ఆదాయం ఇదే 3 నెలల కాలంలో 15.4 శాతం పెరిగి రూ. 16,676.3 కోట్లుగా వచ్చింది. అంతకు ముందు అంటే 2024-25 ఆర్థిక సంవత్సరం జులై- సెప్టెంబరులో ఇది రూ. 14,444.5 కోట్లుగా ఉండేది. ఇక అవెన్యూ సూపర్‌మార్ట్స్ మొత్తం వ్యయాలు 16 శాతం పెరిగి రూ. 15,751.08 కోట్లుగా ఉంది. ఈ ముంబై ప్రధాన కేంద్రంగా ఉన్న రిటైలర్.. జులై- సెప్టెంబరులో కొత్తగా 8 స్టోర్లను యాడ్ చేస్కొని.. మొత్తం సంఖ్యను 432 స్టోర్లకు చేర్చుకుంది. కంపెనీ ప్రకటన ప్రకారం.. ఇక్కడ పాత స్టోర్లలోనే వృద్ధి ఎక్కువగా ఉంది. అంటే కొత్త స్టోర్లలో ఇంకా అంతగా ఆదాయం రాట్లేద ని వెల్లడించింది. తమ మొత్తం ఆదాయంలో 57 శాతం వరకు.. ఫుడ్, గ్రాసరీ ప్రొడక్ట్స్ ఉన్నట్లు తెలిపింది. జనరల్ మర్చం డైజ్, దుస్తుల వాటా 19.7 శాతం, నాన్ ఫుడ్ ఎఫ్ఎంసీజీ వాటా 20.2 శాతంగా ఉంది.

## మార్కెట్‌లో టాటా మోటార్స్ హవా..!

దేశీయ ప్రముఖ ఆటో మొబైల్ దిగ్గజం టాటా మోటార్స్ భారత ఆటోమొబైల్ రంగంలో తాజాగా ఓ మైలురాయి సాధించింది. ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో కంపెనీ చరిత్రలో ఎప్పుడూ లేనంతగా రిటైల్ అమ్మకాలతో సరికొత్త రికార్డును నెలకొల్పింది. ఇదే సమయంలో మార్కెట్‌లో ఇప్పటికే కీలక స్థానంలో ఉన్న మారుతీ సుజుకీ తన ఆధిపత్యాన్ని మరింత చాటగా.. హ్యుందాయ్, కియా వంటి ఇతర కంపెనీలు అమ్మకాల్లో వెనుకబడ్డాయి. వాహన్ పోర్టల్ విడుదల చేసిన లెక్కల ఆధారంగా ఈ సమాచారం వెల్లడైంది. స్పష్టంగా చెప్పాలంటే సెప్టెంబర్‌లో టాటా మోటార్స్ 40,594 కార్లను విక్రయించింది. అందులోనూ నెక్సాన్ మోడల్ విపరీతంగా డిమాండ్ ఉన్నది. ఈ ఒక్క మోడల్‌నే 22,500 యూనిట్లకుపైగా అమ్ముడయ్యింది. కంపెనీ మార్కెట్ వాటా 11.52 శాతం నుంచి 13.75 శాతానికి పెరిగింది. ఇదిలా ఉంటే.. ప్యాసింజర్ వాహనాల్లో మారుతీ సుజుకీ దూసుకెళ్లింది. మొత్తం 1,23,242 యూనిట్లు విక్రయించి, మార్కెట్‌లో 41.17 శాతం వాటాను సొంతం చేసుకుంది. గతేడాదితో పోలిస్తే సంస్థ విక్రయాల్లో, వాటాలో స్వల్ప మెరుగుదల కనిపించింది. ఇక మూడోస్థానాన్ని స్థానాన్ని మహీంద్రా అండ్ మహీంద్రా దక్కించుకుంది. థార్, స్కార్పియోకు డిమాండ్ రాగా.. 37,659 కార్లు విక్రయించి 12.58 శాతం వాటా సాధించింది. హ్యుందాయ్ మోటార్ ఇండియా ఈసారి మాత్రం ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. గత సంవత్సరం ఇదే సమయంలో 38,833 కార్లు అమ్మిన సంస్థ.. ఈ సెప్టెంబర్‌లో మాత్రం 35,812 యూనిట్ల అమ్మకాలకే పరిమితమైంది. దీంతో కంపెనీ మార్కెట్ షేర్ 13.72 శాతం నుంచి 11.96 శాతానికి పడిపోయింది. అలాగే కియా ఇండియా, టయోటా కిర్లోస్కర్ మోటార్స్ తమ మార్కెట్ వాటాను కోల్పోయాయి. దేశవ్యాప్తంగా ప్యాసింజర్ కార్ల మొత్తం అమ్మకాలు ఈ నెలలో 6 శాతం పెరిగి 2,99,369 యూనిట్లుగా నమోదయ్యాయి. ఇక ద్విచక్ర వాహనాల విభాగంలో హీరో మోటోకార్ప్ తన మార్కెట్ హెూల్డింగ్‌ను 22.48 శాతం నుంచి 25.1 శాతానికి పెంచుకుంటూ ముందంజ వేసింది. మరోవైపు, హెూండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా తన వాటాను 27.7 శాతం నుంచి 25.05 శాతానికి కోల్పోయింది. టీవీఎస్ మోటార్ సంస్థ మాత్రం మార్కెట్ వాటాలో పురోగతి సాధించింది. మొత్తం మీద టూవీలర్ అమ్మకాలు 6.5 శాతం వృద్ధి చెందినట్లుగా డేటా తెలిపింది.



## ముందుకెళ్తోన్న రియల్ ఎస్టేట్

రాష్ట్రంలో అభివృద్ధికి చిహ్నంగా రియల్ ఎస్టేట్ ముందుకువెళ్తొందని, కేంద్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనను చాలా కీలకంగా ముందుకు తీసుకెళ్తొందని కేంద్ర మంత్రి కిషన్రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో రోడ్ల అభివృద్ధికి రూ. లక్ష 80వేల కోట్ల చేస్తున్నామన్నారు. మన దేశం అభివృద్ధి చెందిన దేశాల సరసన ఉండాలని ప్రధాని నరేంద్రమోడీ కోరుకుంటున్నారని పేర్కొన్నారు. నేషనల్ రియల్ ఎస్టేట్ మెంట్ కౌన్సిల్ (నారెడ్కో) తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో హైటెక్స్‌లో నిర్వహిస్తున్న 15వ నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షో ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 2047 లక్ష్యంగా పెట్టుకుని అభివృద్ధి చెందిన దేశాల వరుసలో మన దేశం ఉండాలని పేర్కొన్నారు. దేశంలో ప్రతి శాఖకు మౌలిక సదు పాయాల కల్పనకు బడ్జెట్లో అత్యధిక కల్పన చేస్తున్నామన్నారు. ప్రపంచంలో 4వ ఆర్థిక ఎకనామిగా అభివృద్ధి చెందుతున్నామని, ప్రధాని నరేంద్ర మోడీ సంస్కరణలు లేకుండా అభివృద్ధి పనులు చేయమని పేర్కొంటున్నారని తెలిపారు. 331 లక్షల కోట్లకు మన దేశ జిడిపి పెరిగిందని, 20 మంది ప్రజలు దారిద్ర్య రేఖ నుంచి బయటకు వచ్చారని తెలిపారు. అవినీతి లేని పాలన మోడీ అందిస్తున్నారని, గతంలో ఎన్నడూ లేని విధంగా ధరలు తగ్గించారని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ సెక్టార్లో రెరా యాక్ట్ మైల్ స్టోన్గా ఉపకరిస్తుందని, జిఎస్టి స్లాబ్ తగ్గడంతో రియల్ ఎస్టేట్కు బాగా లాభం జరిగిందని పేర్కొన్నారు. 2024-25లో రియల్ ఎస్టేట్, వృత్తిపరమైన సేవల రంగం 15.4 శాతం వృద్ధి రేటును నమోదు చేసింది. 11.97 శాతం వృద్ధి రేటుతో నిర్మాణ రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రూ.80వేల కోట్లకు పైగా సమకూర్చింది. స్టేట్ సర్వీసెస్ జీఎస్ డీపీలో ఈ రెండు రంగాల వాటానే 24.9 శాతంగా ఉంది అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాల పరిధిలో 2024 సెప్టెంబర్ లో రూ.2820 కోట్ల విలువైన 4903 ఇళ్ల రిజిస్ట్రేషన్ జరిగింది. ఈ ఏడాది సెప్టెంబర్ లో రూ.4804 కోట్ల విలువైన 6612 ఇళ్ల రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. ఇది 35 శాతం అధికం. విలువలో వార్షిక వృద్ధి 70 శాతంగా నమోదయ్యింది. ఇవి కేవలం గణాంకాలు కాదు, రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ కుదేలయ్యిందంటూ మాపై దుష్ప్రచారం చేస్తున్న వారికి ధీటైన సమాధానా లు అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ సెప్టెంబర్ లో రూ. కోటి పైన విలువైన ఆస్తుల రిజిస్ట్రేషన్లలో 151 శాతం పెరుగుదల ఉంది. మొత్తం విక్రయాల్లో విలువ పరంగా వీటి వాటానే 53 శాతం అని చెప్పారు. భారత్లో వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది రియల్ ఎస్టేట్ రంగంలోనే ఉపాధి పొందుతున్నారు.




## ఏడాదికి రూ.10 కోట్లు సంపాదిస్తున్న క్రికెట్ కామెంటేటర్లు



క్రికెట్ మ్యాచులో కామెంటేటర్‌గా ఉండటం అనేది ఒక ఆర్ట్ లాంటిదే. ఇందులో ఒక్కొక్కరిదీ ఒక్కో స్టైల్. రవిశాస్త్రి లాంటి గురించి అయితే ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అతడు టాస్ వేసేటప్పుడు గ్రౌండ్‌లో దిగాడంటే ఆ జోషే వేరే లెవెల్‌లో ఉంటుంది. కానీ అసలు వ్యాఖ్యతలకు మ్యాచ్‌కు ఎంత చొప్పున డబ్బులు ఇస్తారు? ఒక్కో మ్యాచ్‌కు కామెంట్రీ చెప్పినందుకు వారు ఎంత సంపాదిస్తారు? అనే ప్రశ్న చాలా మందిలో ఉండే ఉంటుంది. దీనిపై టీమిండియా మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత ఆకాశ్ చోప్రా మాట్లాడారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త, ఇన్‌ఫ్లుయెన్సర్ రాజ్ షమానీతో ఇటీవల మాట్లాడుతూ.. ఆకాశ్ చోప్రా ఈ విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా క్రికెట్ వ్యాఖ్యాతల వార్షిక ఆదాయం గురించి ఆకాశ్ చోప్రాకు ప్రశ్న ఎదురైంది. “కామెంటేటర్‌ల ఆదాయం అనేది మ్యాచులను బట్టి డిసైడ్ అవుతుంది. ఎన్ని రోజులు అనేది ఇందులో కీలకం. జూనియర్ లేదా ఫ్రెషర్ కామెంటేటర్స్ సాధారణంగా రోజుకు రూ.35,000 నుంచి రూ.40,000 వరకు సంపాదిస్తారు. సాధారణంగా సంవత్సరానికి 100 రోజులు వారు బిజీగా ఉంటారు. ఈ లెక్కన చూస్తే.. నెలకు రూ.2 లక్షల నుంచి రూ.2.5 లక్షల వరకు వారు సంపాదిస్తారు. ఇక సీనియర్ లేదా టాప్ కామెంటేటర్ల వేతనం రోజుకు రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉంటుంది. కొత్త వారికి, అనుభవజ్ఞులకు మధ్య తేడా ఇదే” అని ఆకాశ్ చోప్రా వ్యాఖ్యానించారు. ఈ లెక్కన టాప్ కామెంటేటర్లు ఏడాదికి 100 రోజులు పని చేసినా.. సుమారు రూ.10 కోట్ల నుంచి రూ.12 కోట్ల వరకు సంపాదిస్తారని.. రాజ్ షమానీ అన్నారు. దీన్ని ఆకాశ్ చోప్రా కూడా అంగీకరించారు. వ్యాఖ్యాతల ఆదాయం అనేది వారు కవర్ చేసే టోర్నీలపై ఆధారపడి ఉంటుంది. ఐపీఎల్, ద్వైపాక్షిక సిరీస్‌లు, ఐసీసీ ఈవెంట్‌లకు వేర్వేరుగా చెల్లింపులు ఉంటాయి. కామెంటేటర్లతో బ్రాడ్ కాస్టర్లు ఈ విషయంపై ముందుగానే ఒప్పందం చేసుకుంటారు. ఆ మేరకు చెల్లింపులు జరుగుతాయి.


## పతకాలపై భారత షట్లర్ల గురి

ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో మిక్స్‌డ్ టీమ్‌లో కాంస్య పతకంతో చరిత్ర సృష్టించిన భారత క్రీడాకారులు వ్యక్తిగత విభాగాలపై దృష్టిసారించారు. సోమవారం ప్రారంభంకానున్న వ్యక్తిగత పోటీల్లో పతకాలపై గురిపెట్టారు. 17 ఏళ్ల క్రితం బాలికల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్ స్వర్ణం,



బాలురలో గురుసాయి దత్ కాంస్యం సాధించడమే ఈ టోర్నీలో భారత్ అత్యుత్తమ ప్రదర్శన. ఇప్పటి వరకు భారత్ వ్యక్తిగత విభాగంలో నాలుగు రజతాలు సహా 11 పతకాలు గెలుచుకుంది. బాలికల సింగిల్స్‌లో ప్రపంచ జూనియర్ నంబర్‌వన్ తన్వి శర్మ, చైనా ఓపెన్ క్వార్టర్‌ఫైనలిస్ట్ ఉన్నతి హుడా ఈసారి బరిలో ఉండటంతో భారత్ మరో స్వర్ణం సాధించొచ్చన్న అంచనాలు ఉన్నాయి. వెన్నెల కలగొట్ల, రక్షితశ్రీ కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. బాలుర సింగిల్స్‌లో రౌనక్ చౌహాన్, జ్ఞాన దత్తు.. బాలుర డబుల్స్‌లో అరిగెల భార్గవ రామ్- గొబ్బూరు విశ్వ తేజ జోడీపై భారీ అంచనాలు ఉన్నాయి.

## ఆఫర్ రిజెక్ట్... ఫోన్ కూడా లిఫ్ట్ చేయని కోహ్లీ ?



టీమిండియా స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ఇచ్చే ఆలోచనలో విరాట్ కోహ్లీ ఉన్నట్లు నేషనల్ మీడియాలో కథనాలు వస్తున్నాయి.ప్రతి ఏడాది రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టుకు ఆడేందుకు అగ్రిమెంట్ పై విరాట్ కోహ్లీ సంతకం చేయాల్సి ఉంటుంది. అయితే ఐపీఎల్ 2026 టోర్నమెంట్ నేపథ్యంలో ఈ అగ్రిమెంటుపై ఇప్పటివరకు విరాట్ కోహ్లీ సంతకం చేయలేదని తెలుస్తోంది. ఈ అగ్రిమెంట్ పై సంతకం చేయాలని రాయల్ చాలెంజర్స్ బెంగళూరు యాజమాన్యం, విరాట్ కోహ్లీకి సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోందని తెలుస్తోంది. అయితే వాళ్లకు విరాట్ కోహ్లీ అందుబాటులోకి రావడం లేదని సమాచారం. ఫోన్ కూడా ఎత్తడం లేదట. దీంతో ఐపీఎల్ కు రిటైర్మెంట్ ప్రకటించబోతున్నాడని విరాట్ కోహ్లీపై వార్తలు వస్తున్నాయి. ఇండియా వర్సెస్ ఆస్ట్రేలియా మధ్య వన్డే సిరీస్ పూర్తయిన తర్వాత వన్డేలతో పాటు ఐపీఎల్ కు రిటైర్మెంట్ ప్రకటిస్తాడని సోషల్ మీడియాలో వార్తలు చెక్కర్లు కొడుతున్నాయి. ఒకవేళ ఇదే జరిగితే, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు ఫ్యాన్ ఫాలోయింగ్ అమాంతం పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. మరి దీనిపై కోహ్లీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడో చూడాల్సి ఉంది. కాగా ఐపీఎల్ ప్రారంభమైనప్పటి నుంచి బెంగళూరు జట్టుకే ప్రాతినిధ్యం వహించాడు కోహ్లీ. గత ఏడాది సీజన్‌లో బెంగళూరు ఛాంపియన్‌గా కూడా అవతరించింది. ఈ నేపథ్యంలోనే రిటైర్మెంట్ కు సిద్ధమవుతున్నాడట కోహ్లీ.

## వన్డేల్లో అత్యంత వేగంగా 5000 పరుగులు చేసిన స్మృతి మంధాన

భారత మహిళల క్రికెట్ జట్టు స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన వన్డే ఫార్మాట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. మహిళల వన్డే క్రికెట్‌లో అత్యంత వేగంగా 5,000 పరుగుల మైలురాయిని అందుకున్న క్రీడాకారిణిగా ప్రపంచ రికార్డు నెలకొల్పింది. విశాఖపట్నంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న ప్రపంచ కప్ మ్యాచ్‌లో ఆదివారం ఆమె ఈ అరుదైన ఘనతను సాధించింది.ఈమ్యాచ్‌కు ముందు 5 వేల పరుగుల మార్కుకు చేరువలో ఉన్న మంధన, తన 112వ వన్డే ఇన్నింగ్స్‌లో ఈ రికార్డును అందుకుంది. నేటి మ్యాచ్ లో ఆస్ట్రేలియా బౌలర్ కిమ్ గార్త్ వేసిన 21వ ఓవర్‌లో అద్భుతమైన సిక్సర్ బాది ఆమె ఈ మైలురాయిని పూర్తి చేసుకోవడం విశేషం. దీంతో, వెస్టిండీస్ క్రీడాకారిణి స్టెఫానీ టేలర్ పేరిట ఉన్న రికార్డు బద్దలైంది. టేలర్ 129 మ్యాచ్‌లలో ఈ ఘనత సాధించగా, మంధన కేవలం 112 మ్యాచ్‌లలోనే ఈ ఘనత సాధించింది. ఈ జాబితాలో సుజీ బేట్స్ (136), మిథాలీ రాజ్ (144), చార్లెట్ ఎడ్వర్డ్స్ (156) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.ఈ మ్యాచ్‌లో అద్భుతంగా ఆడిన మంధన, కేవలం 66 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 80 పరుగులు చేసి సోఫీ మొలినెక్స్ బౌలింగ్‌లో అవుటైంది. ఈ ప్రపంచకప్‌లో తొలి మూడు మ్యాచ్‌లలో కేవలం 54 పరుగులే చేసి నిరాశపరిచినప్పటికీ, ఈ ఇన్నింగ్స్‌తో ఆమె తిరిగి ఫామ్‌లోకి వచ్చింది. ఈ క్యాలెండర్ ఇయర్‌లో ఇప్పటికే 974 పరుగులు చేసి అత్యధిక పరుగులు సాధించిన క్రీడాకారిణిగా నిలిచిన మంధన, ప్రపంచకప్‌కు ముందు ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్‌లో కూడా రెండు సెంచరీలతో రాణించిన విషయం తెలిసిందే.



# ఆట

## భారత్‌పై ఆసీస్ ఘన విజయం

మహిళల ప్రపంచకప్‌లో ఆతిథ్య భారత జట్టుకు వరుసగా రెండో ఓటమి ఎదురైంది. డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా బంతితో విఫలమైనా బ్యాట్‌తో దుమ్మురేపింది. ఇరుజట్ల మధ్య వైజాగ్‌లో భారీ స్కోర్లు నమోదైన మ్యాచ్‌లో ఆసీస్.. 3 వికెట్ల తేడాతో భారత్‌పై గెలిచింది. ఆ జట్టు సారథి అలిస్సా హీలి (107 బంతుల్లో 142, 21 ఫోర్లు, 3 సిక్సులు) చిరస్మరణీయ ఇన్నింగ్స్‌తో భారత్ నిర్దేశించిన 331 పరుగుల లక్ష్యాన్ని ఆ జట్టు 49 ఓవర్లలో 7 వికెట్లు నష్టపోయి ఛేదించింది. హీలి వీరవిహారానికి తోడు ఎల్లీస్ పెర్రీ (52 బంతుల్లో 47 నాటౌట్, 5 ఫోర్లు, 1 సిక్స్), గార్డ్‌నర్ (45), లిచ్‌ఫీల్డ్ (40) ఆ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. ‘ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్’ హీలి బాదుడుతో భారత బౌలర్లు భారీగా పరుగులిచ్చుకున్నారు. శ్రీచరణి (3/41) మినహా మిగిలిన బౌలర్లంతా తేలిపోయారు.



అంతకుముందు మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. స్మృతి మంధాన (66 బంతుల్లో 80, 9 ఫోర్లు, 3 సిక్సులు), ప్రతీక రావల్ (96 బంతుల్లో 75, 10 ఫోర్లు, 1 సిక్స్) రాణించడంతో 48.5 ఓవర్లలో 330 రన్స్‌కు ఆలౌట్ అయింది. హర్లీన్ (38), జెమీమా (33), రిచా (32) ఫర్వాలేదనిపించారు. గత మూడు మ్యాచ్‌లతో పోలిస్తే ఆసీస్‌తో భారత టాపార్డర్ మెరుగ్గా రాణించి భారీ స్కోరు సాధించినా బౌలింగ్ వైఫల్యంతో ఉమెన్ ఇన్ బ్లూకు ఓటమి తప్పలేదు. ఈ టోర్నీలో టీమ్‌ఇండియాకు ఇది రెండో పరాభవం కాగా మూడు విజయాలతో ఏడు పాయింట్లు సాధించి పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో నిలి చింది. టోర్నీలో భారత్ తమ తదుపరి మ్యాచ్‌ను వచ్చే ఆదివారం ఇంగ్లండ్‌తో తలపడనుంది. భారీ ఛేదనను ఆసీస్ దూకుడుగానే ఆరంభించింది. ఓపెనర్లు లిచ్‌ఫీల్డ్, హీలి ఆరంభం నుంచే భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. లిచ్‌ఫీల్డ్ ఓవర్‌కు ఓ ఫోర్‌కు తగ్గకుండా ఆడితే క్రాంతి వేసిన 8వ ఓవర్లో హీలి.. 6,4, 4, 4తో 19 రన్స్ రాబట్టింది. అమన్‌జోత్ పదో ఓవర్లో లిచ్‌ఫీల్డ్ నాలుగు బౌండరీలు బాదింది. ఈ ఇద్దరూ తొలి వికెట్‌కు 85 పరుగులు జోడించారు. అయితే 12వ ఓవర్లో బంతినందుకున్న చరణి.. లిచ్‌ఫల్డ్‌ను ఔట్ చేసినా ఆసీస్ జోరు తగ్గలేదు. పెర్రీతో కలిసి రెండో వికెట్‌కు హీలి 83 రన్స్ జోడించి రిటైర్డ హర్ట్‌గా వెనుదిరిగింది.. 35 బంతుల్లో హాఫ్ సెంచరీ చేసిన హీలి.. తర్వాత మరింత దూకుడు పెంచింది. మూనీ (4), అన్నాబెల్ (0) స్వల్ప వ్యవధిలోనే నిష్క్రమించినా గార్డ్‌నర్ రాకతో ఆసీస్ స్కోరువేగం మరింత పెరిగింది. స్నేహ్ రాణా బౌలింగ్‌లో సింగిల్‌తో 84 బంతుల్లోనే హీలి శతకం పూర్తైంది.

# చక్కని ఆరోగ్యం

## తినగానే స్నానం చేస్తున్నారా?

చాలా మందికి భోజనం చేసిన వెంటనే స్నానం చేసే అలవాటు ఉంటుంది. ఈ పద్ధతి వారికి సౌకర్యంగా అనిపించినప్పటికీ, ఆరోగ్య నిపుణులు మాత్రం ఇది మంచిది కాదని స్పష్టం చేస్తున్నారు.తినగానే స్నానం చేయడం వలన జీర్ణ ప్రక్రియపై తీవ్ర ప్రభావం పడుతుందని, ఇది పలు జీర్ణ సమస్యలకు దారితీస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మీ ఆరోగ్యానికి మేలు చేయాలంటే, ఈ అలవాటును మార్చుకోవడం తప్పనిసరి. ఆహారం తీసుకున్న వెంటనే మన శరీరం జీర్ణక్రియకు సిద్ధమవుతుంది. ఈ సమయంలో, జీర్ణకోశ వ్యవస్థకు రక్త ప్రసరణ



పెరుగుతుంది, తద్వారా ఆహారం త్వరగా, సమర్థవంతంగా జీర్ణమవుతుంది. అయితే, మనం స్నానం చేసినప్పుడు, ముఖ్యంగా వేడి నీటితో చేసినప్పుడు, రక్త ప్రసరణ చర్మానికి, శరీర ఉపరితలానికి మళ్లుతుంది. దీని కారణంగా జీర్ణ అవయవాలకు అందవలసిన రక్తం తగ్గుతుంది. రక్త ప్రసరణ ఇలా మళ్లడం వల్ల జీర్ణక్రియ మందగిస్తుంది. ఆహారం సరిగా జీర్ణం కాక, కడుపు ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది.మంచి జీర్ణక్రియ కోసం, భోజనం చేసిన తర్వాత కొంత సమయం విరామం తీసుకోవడం చాలా ముఖ్యం. వైద్య నిపుణుల సలహా ప్రకారం, కనీసం గంట నుంచి గంటన్నర సమయం తర్వాతే స్నానం చేయాలి. ఈ సమయం శరీరానికి జీర్ణక్రియ ప్రక్రియను ప్రారంభించడానికి, రక్తాన్ని జీర్ణవ్యవస్థపై కేంద్రీకరించడానికి వీలు కల్పిస్తుంది. భోజనం భారీగా ఉన్నట్లయితే, రెండు గంటల వరకు వేచి ఉండటం మరింత మంచిది. స్నానానికి గోరువెచ్చని నీళ్లు ఉపయోగించడం కూడా మంచిది. మరీ వేడిగా ఉండే నీళ్లు శరీర ఉష్ణోగ్రతను అమాంతం పెంచి, రక్త ప్రసరణను మరింతగా చర్మానికి మళ్ళిస్తాయి. అదేవిధంగా, చాలా చల్లని నీళ్లు రక్త నాళాలను కుదించి, జీర్ణ ప్రక్రియపై ఒత్తిడిని పెంచుతాయి. కాబట్టి, జీర్ణ సమస్యలు లేకుండా ఆరోగ్యంగా ఉండాలంటే, ఆహారం తీసుకున్న వెంటనే స్నానానికి దూరంగా ఉండి, నిపుణులు సూచించిన సమయాన్ని పాటించడం ఉత్తమం.

## ఘుగర్ ఉన్నవారు ఏం తినాలి!

ఘుగర్ ఉన్నవారు సమస్యని తగ్గించుకోవాలనుకుంటే కొన్ని ఫుడ్స్‌కి కచ్చితంగా దూరంగా ఉండాలి. అంటే పూర్తిగా మానాల్సిన అవసరం లేదు. కంట్రోల్ చేసుకుంటే మంచిది. అప్పుడప్పుడు మాత్రమే తీసుకోవాలి. కొన్ని ఫుడ్స్ హెల్దీ అనిపించినప్పటికీ ఆరోగ్యంపై ఎక్కువగా ఎఫెక్ట్ చూపిస్తాయి. ప్రోటీన్ మంచిదనిపించినప్పటికీ అందులో రెడ్ మీట్, బీఫ్ వంటి ఫుడ్స్ సమస్యని మరింతగా పెంచుతాయి. కాబట్టి, తినే ముందు ఏం తినాలి, ఏం తినకూడదని తెలుసుకుని తినడం మంచిది. ఎందుకంటే కొన్ని ఫుడ్స్ ఘుగర్ లెవల్స్‌ని అమాంతం పెంచుతాయి. నేచురల్‌గానే సమస్యని కంట్రోల్ తగ్గించేందుకు కొన్ని ఫుడ్స్‌కి కూడా దూరంగా ఉండడం మంచిది. ముఖ్యంగా, మనకి కొన్ని హెల్దీ ఫుడ్స్ అని ప్రోటీన్, వెజిటేబుల్స్ అని చెబుతారు. అయితే, వాటిని కూడా కొన్ని రకాల ఫుడ్స్‌ని కూడా అసలే తీసుకోవద్దు. అలాంటి కొన్ని ఫుడ్స్ గురించి న్యూట్రిషనిస్ట్ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తున్నారు. కొబ్బరినూనె ఎంత ఆరోగ్యకరమైనదో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. డైట్ చేసేవారికి దీనిని చాలా మంది సజెస్ట్ చేస్తారు. ఇప్పుడిప్పుడే చాలా మంది దీనిని రెగ్యులర్‌గా వంటకాల్లో యాడ్ చేస్తున్నారు. అయితే, కొబ్బరినూనె ఎంత హెల్దీ అయినప్పటికీ కండరాల కణాలలో పేరుకుపోయే సంతృప్త కొవ్వుతో నిండి ఉంటుంది. దీంతో ఇన్సులిన్ దాని పనిని చేయకుండా అడ్డుకుంటుంది. కాబట్టి, కొబ్బరి నూనెని తగ్గించి తీసుకోవడం మంచిది. అదే విధంగా, వైట్ రైస్, బ్రెడ్, ప్రాసెస్డ్ ఫుడ్స్, ఫ్రై చేసిన కూరగాయలు తీసుకోవద్దు. ప్రాసెస్డ్ చేసిన పిండి, ఘుగర్‌తో చేసే ఈ ఫుడ్స్ కొవ్వుతో నిండి ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల రక్తంలో ఘుగర్ లెవల్స్ , ఇన్సులిన్ నిరోధకతని మరింతగా దిగజార్చుతాయి. కాబట్టి, ఇలాంటి పేస్ట్రీస్, కేక్స్‌ని తీసుకోకపోవడమే మంచిది. వీటికి ఎంత దూరం ఉంటే అంత మంచిది. సోడియం ఎక్కువగా ఉండే బటర్, చీజ్, సాస్ కలిపిన కూరగాయలు, ఊరగాయల వంటివి తీసుకోవద్దు. మీట్‌లో సంతృప్త కొవ్వు ఎక్కువగా ఉంటుంది. ఇది మీ కణాల లోపల కొవ్వు పేరుకుపోయేలా చేస్తుంది. రోజులు గడిచేకొద్దీ ఘుగర్‌ని ఎక్కువగా పెంచుతుంది. దీంతో పాటు మార్కెట్లో దొరికే ఎక్కువగా తియ్యగా ఉండే పండ్లు, ఫ్రూట్ రోల్స్, ప్లెయిన్ జామ్, జెల్లీ, ప్రిజర్వేటివ్స్ ఉండే ఫుడ్స్, తీపి పండ్లతో తయారైన గమ్మీస్ వంటి వాటికి దూరంగా ఉండాలి. రెడ్ మీట్, హాట్ డాగ్స్, సాసేజెస్, లివర్ వంటి కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉండే ఫుడ్స్ తీసుకోవడం తగ్గించాలి. ఫ్రైడ్ మీట్ కూడా తీసుకోవద్దు. ఘుగర్ ఎక్కువగా వేసి తయారుచేసిన డ్రింక్స్ తీసుకోవడం వల్ల ఒకేసారి రక్తంలో ఘుగర్‌ని పెంచుతుంది.



## ఆరోగ్యానికి అలవాటు పడాలంటే..

ప్రస్తుతం ఒబేసిటీ భారతదేశంలో ఒక ప్రధాన ఆరోగ్య సమస్యగా మారింది. ఎక్కువ బరువు వల్ల హృద్రోగాలు, ఘుగర్, హై బ్లడ్ ప్రెజర్ వంటి అనారోగ్య సమస్యలు ఎక్కువగా ఎదురవుతున్నాయి. చాలామంది, ఈ సమస్యలో ముఖ్య కారణం మన ఆహారపు అలవాట్లే అని భావిస్తున్నారు.అయితే, ఆరోగ్యకరమైన స్నాక్స్ తీసుకుంటే బరువును సమర్థవంతంగా నియంత్రించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇదే కారణంగా, ఇటీవల కాలంలో భారత్‌లో హెల్దీ స్నాక్స్‌కు డిమాండ్ విపరీతంగా పెరిగింది. వినియోగదారులు బరువు నిర్వహణలో సహాయపడే, పోషకాహారంతో కూడిన స్నాక్స్ కోసం ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ఈ ధోరణి జనాభాలో ఆరోగ్యంపై అవగాహన పెరుగుదల మరియు ఫిట్‌నెస్‌పై ఫోకస్ కారణంగా ఉద్భవించింది. ఇప్పుడు వినియోగదారులు కార్బోహైడ్రేట్స్ తక్కువ, తక్కువ క్యాలరీలతో కూడిన స్నాక్స్‌ను ప్రాధాన్యత ఇస్తున్నారు.ప్రస్తుతంలో, ముఖ్యంగా మిల్లెట్స్, పప్పులు, శనగలు వంటి సాంప్రదాయ పదార్థాలతో తయారు చేసిన స్నాక్స్ పాపులర్‌గా ఉన్నాయి. ఇవి కేవలం పోషకాహారంగా కాకుండా, స్థానిక రుచికి అనుగుణంగా ఉంటాయి. తక్కువ క్యాలరీల స్నాక్స్ మన శరీరానికి కావలసిన పోషకాలను అందిస్తాయి, శక్తి స్థాయిలను నిర్వహించడంలో, ఆకలి నియంత్రణలో కూడా సహాయపడతాయి.బరువు నియంత్రణలో హెల్దీ స్నాక్స్ కీలకంగా ఉన్నాయి. బేక్ చేసిన కూరగాయల చిప్స్, మిల్లెట్ బిస్కెట్స్, మిల్లెట్ పఫ్స్, వేయించిన శనగలు వంటి స్నాక్స్ బరువును సమర్థవంతంగా నిర్వహించడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి. ప్రస్తుత ఆహార అలవాట్ల కారణంగా, చాలామంది హెల్దీ స్నాక్స్ తయారీకి ఆసక్తి చూపుతున్నారు. నిపుణులు భావిస్తున్నారు, రాబోయే సంవత్సరాల్లో ఆరోగ్యకరమైన స్నాక్స్ మార్కెట్ మరింత విస్తరిస్తుంది.చాలామంది బరువు తగ్గడానికి, ఆరోగ్యంగా ఉండడానికి, తమ స్నాకింగ్ అలవాట్లలో మిల్లెట్స్‌తో తయారు చేసిన స్నాక్స్‌ను చేర్చుతున్నారు. వీటి ధర కొంచెం ఎక్కువగా ఉన్నప్పటికీ, వినియోగదారులు వాటిని కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఇది హెల్త్-కాన్షియస్ వినియోగదారుల అభిరుచికి అనుగుణంగా ఉంది.



## ఈ లక్షణాలు క్యాన్సర్ ముందస్తు సంకేతాలు కావచ్చు..

ఆరోగ్యంలో చిన్న చిన్న మార్పులను కూడా విస్మరించకూడదు. కొన్ని లక్షణాలు క్యాన్సర్ లాంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు ముందస్తు సంకేతాలుగా ఉండవచ్చు. ముఖ్యంగా, అధికంగా బరువు తగ్గిపోవడం, తరచుగా జ్వరం రావడం, దీర్ఘకాలిక అలసట లాంటివి కనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలి. ఇవి లుకేమియా వంటి రక్త క్యాన్సర్ రకాలకు సంబంధించిన సూచనలు కావచ్చు. శరీరం తమకు తాముగా ఇచ్చే ఈ సంకేతాలను అర్థం చేసుకుని వైద్యులను సంప్రదించడం చాలా ముఖ్యం.చర్మం మరియు ఇతర భాగాలలో మార్పులు కూడా క్యాన్సర్ సంకేతాలుగా ఉండవచ్చు. శరీరం రంగు నల్లగా మారడం, చర్మం ఎర్రగా మారడం, దురద ఎక్కువ కావడం లాంటివి స్కిన్ క్యాన్సర్ (చర్మ క్యాన్సర్) ప్రారంభ దశ లక్షణాలుగా కనిపిస్తాయి. అదే విధంగా, మూత్రానికి వెళ్లేటప్పుడు నొప్పి, మూత్రంలో రక్తం పడటం వంటివి పెద్దపేగు లేదా ఇతర యూరినరీ ట్రాక్ట్ క్యాన్సర్లకు సంకేతాలు కావచ్చు. ఈ మార్పులు కనిపించిన వెంటనే డాక్టర్‌ను



కలవడం వలన వ్యాధిని తొలిదశలోనే గుర్తించి చికిత్స అందించే అవకాశం ఉంటుంది.శరీరంలో కొత్తగా ఏర్పడే లేదా ఉన్న పుట్టుమచ్చలలో వచ్చే మార్పులను ఎప్పుడూ తేలికగా తీసుకోకూడదు. పుట్టుమచ్చలు పెరగడం, వాటి నుండి రక్తం కారడం, చిన్న గాయాలైనా ఎక్కువ కాలం మానకపోవడం వంటివి క్యాన్సర్ కణాల పెరుగుదలకు సూచనలు కావచ్చు. అంతేకాక, రొమ్ములు, వృషణాలు, గ్రంథులు లేదా ఇతర మృదువైన కణజాలాలలో గట్టిపడటం, గడ్డలు ఏర్పడటం గమనిస్తే, అది బ్రెస్ట్ క్యాన్సర్, టెస్టిక్యులర్ క్యాన్సర్ లేదా లింఫోమా లాంటి క్యాన్సర్లకు సంకేతం కావచ్చు. నోటిలో తరచూ పుండ్లు ఏర్పడి, అవి తగ్గకపోవడం నోటి క్యాన్సర్‌కు లక్షణం. ఈ లక్షణాలు కేవలం క్యాన్సర్ వల్లే కాకుండా ఇతర సాధారణ ఆరోగ్య సమస్యల వల్ల కూడా తలెత్తవచ్చు. కానీ, లక్షణాలు ఒకటి లేదా అంతకంటే ఎక్కువ రోజులు కొనసాగితే, వాటిని నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించడం ఉత్తమం. లుకేమియా, చర్మం, రొమ్ము, పెద్దపేగు మరియు నోటి క్యాన్సర్ లాంటి వివిధ రకాల క్యాన్సర్ల విషయంలో ముందస్తు గుర్తింపు, సకాలంలో చికిత్స అందించడం ద్వారా మెరుగైన ఫలితాలను పొందవచ్చు. అందువల్ల, ఏ చిన్న అనుమానం వచ్చినా వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

## బాడీపెయిన్స్ తగ్గేందుకు ఇంటి చిట్కాలు



నేటి ఫాస్ట్ ఫార్వార్డ్ లైఫ్‌లో ప్రతీ హెల్త్ ప్రాబ్లమ్ కామన్ అయిపోయింది. రోజంతా బిజీబిజీగా ఉండడం, ఊరికే కూర్చుని జాబ్ చేసినప్పటికీ బాడీ పెయిన్స్ వెంటాడుతున్నాయి. వీటిని దూరం చేసుకునేందుకు చాలా మంది నొప్పి నివారణ మందులు, పెయిన్ బామ్స్‌ని వాడుతుంటారు. అయితే, వీటిని రెగ్యులర్‌గా వాడడం వల్ల సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే ప్రమాదం ఉంది. అలాంటప్పుడు నొప్పుల్ని తగ్గించేందుకు కొన్ని సహజ మార్గాలు ఉన్నాయి. అవన్నీ కూడా బయట దొరికేవి కాకుండా ఇంట్లో దొరికే పదార్థాలతోనే నొప్పుల్ని తగ్గించుకోవచ్చు. దీనికోసం డాక్టర్ షాలినీ సింగ్ తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో కొన్ని నేచురల్ పెయిన్ కిల్లర్స్ గురించి సజెస్ట్ చేస్తున్నారు. వీటిని వాడడం వల్ల చాలా వరకూ నొప్పులు తగ్గుతాయని చెబుతున్నారు. లవంగాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇంట్లో మసాలా పదార్థాల్లో ఎక్కువగా వాడే ఈ లవంగాల్లో యూజినాల్ అనే సహజ మత్తుమందు ఉంటుంది. ఇది నొప్పుల్ని తగ్గిస్తుంది. ముఖ్యంగా దంత సమస్యలు, పంటి నొప్పిని దూరం చేయడంలో లవంగాలు చాలా బాగా పనిచేస్తాయి. మీకు పంటి నొప్పి ఎక్కువగా ఉన్నప్పుడు ఆ ప్రాంతంలో లవంగాన్ని పెట్టి ఉంచండి. లేదా లవంగం నూనెని రాయండి. దీంతో చాలా వరకూ రిలాక్స్‌గా ఫీల్ అవుతారు. దీనికోసం మరో ఇతర మెడిసిన్ అవసరమే లేదు. వాము గురించి ఎంత చెప్పినా తక్కువే. కాస్త చేదుగా ఉండే ఈ వాముని మనం అనేక నొప్పుల్ని తగ్గించేందుకు వాడొచ్చు. దీనిని వాడడం వల్ల కడుపు నొప్పి, గ్యాస్ నుండి రిలాక్స్ అవుతారు. దీనిని వాడితే సహజంగానే కండరాలు రిలాక్స్ అవుతాయి. అజీర్ణంతో కడుపు నొప్పి, భారంగా అనిపించినప్పుడు వాముని తినడం లేదా, నీటిలో కొద్దిగా వాము వేసి మరిగించి గోరువెచ్చగా అయ్యాక తాగండి. దీని వల్ల జీర్ణ సమస్యలు తగ్గుతాయి. కడుపు నొప్పి, అజీర్ణం ఇట్టే దూరమవుతుంది. అల్లంలో పవర్‌ఫుల్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ఏజెంట్ అయిన జింజెరాల్ ఉంటుంది. ఇది తలనొప్పి దగ్గర్నుంచీ, పీరియడ్స్‌లో వచ్చే నొప్పి, కీళ్ల నొప్పి వంటి సమస్యలన్నింటినీ తగ్గిస్తాయి. దీని కోసం మీరు అల్లాన్ని టీలా చేసి తాగొచ్చు. లేదా నేరుగా ఓ ముక్క నమిలి తినొచ్చు. అల్లం రసాన్ని మనం గోరువెచ్చని నీటిలో కలిపి తాగితే చాలా వరకూ రిజల్ట్ ఉంటుంది. బ్లాక్ పెప్పర్‌లో కూడా పైపెరిన్ అనే పదార్థం ఉంటుంది. దీని వల్ల బాడీలో ఇన్‌ఫ్లమేషన్, నొప్పి తగ్గుతుంది. దీనిని మనం ఆహారంలో కలిపి తీసుకోవచ్చు. లేదా గోరువెచ్చని పాలల మిరియాల పొడి కొద్దిగా వేసి తాగొచ్చు. దీంతో గొంతు నొప్పి, జలుబు వంటి సమస్యలు కూడా తగ్గుతాయి. పసుపులో కూడా కర్క్యుమిన్ ఉంటుంది. ఇది బాడీ పెయిన్స్, వాపు, స్టిఫ్‌నెస్‌ని తగ్గిస్తాయి. నిజం చెప్పాలంటే ఇదో నేచురల్ పెయిన్ కిల్లర్ అని చెప్పొచ్చు. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండానే నొప్పుల్ని తగ్గించడంలో పసుపు ముందుంటుంది. దీనికోసం పడుకునే ముందు ఓ గ్లాసు గోరువెచ్చని పాలలో అర టీస్పూన్ పసుపు కలిపి తాగండి. దీంతో బాడీ రిలాక్స్ అవ్వడమే కాకుండా మంచి నిద్ర మీ సొంతమవుతుంది.

## సీతాఫలం ఆకులు తింటే కలిగే లాభాలు!

పండు, గింజలు, వేర్లు మాత్రమే కాదు, సీతాఫలం చెట్టు ఆకుల్లో కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలు దాగున్నాయి. ఆయుర్వేదం, సాంప్రదాయ వైద్యంలో సీతాఫలం ఆకులను ఔషధంగా వాడుతుంటారు.ఈ ఆకులు తినడం లేదా కషాయం రూపంలో తీసుకోవడం వలన కలిగే కొన్ని ముఖ్య లాభాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. సీతాఫలం ఆకులలో ఉండే అసెటోజెనిన్స్ అనే శక్తివంతమైన సమ్మేళనాలు క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధించడంలో సహాయపడతాయని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. అందుకే ఇవి సహజసిద్ధమైన కీమోథెరపీ ఏజెంట్‌గా పనిచేస్తాయని చెబుతారు. అలాగే ఈ ఆకుల రసం రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో అద్భుతంగా పనిచేస్తుంది. అందుకే మధుమేహ (డయాబెటిస్) బాధితులకు ఇది చాలా ఉపకరిస్తుంది.ఈ ఆకులలో ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని విష పదార్థాలను బయటకు పంపి, జీర్ణవ్యవస్థను శుద్ధి చేయడంలో సహాయపడతాయి. ముఖ్యంగా, అజీర్తి, మలబద్ధకం వంటి జీర్ణ సమస్యలను తగ్గించడంలో ఉపశమనం ఇస్తాయి. ఈ ఆకులను నమలడం లేదా వాటి కషాయం తాగడం వలన రోగనిరోధక శక్తి (%×ఎఎబఅఈఎ%) పెరుగుతుంది. వీటిలో ఉన్న విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు శరీరంలో ఏర్పడే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి, తరచుగా వచ్చే జలుబు, ఫ్లూ వంటి వాటి నుంచి రక్షిస్తాయి. అంతేకాకుండా, సీతాఫలం ఆకుల పేస్ట్‌ను గాయాలు, పుండ్లపై అప్లై చేస్తే నొప్పి, వాపు తగ్గి త్వరగా మానేందుకు సహాయ పడుతుంది. ఇందులో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఆర్థరైటిస్ వంటి కీళ్ల నొప్పులను కూడా తగ్గించడంలో తోడ్పడతాయి. దీని ఆకుల కషాయాన్ని తాగడం వలన శరీరం తేలికపడి చక్కటి నిద్ర పడుతుందని,



ఒత్తిడి, ఆందోళన వంటివి తగ్గుతాయని చాలామంది నమ్ముతారు. చివరిగా, సీతాఫలం ఆకులను తీసుకునే ముందు, ప్రత్యేకించి ఏదైనా దీర్ఘకాలిక వ్యాధి ఉన్నవారు లేదా గర్భిణులు వైద్య నిపుణుల సలహా తీసుకోవడం చాలా ముఖ్యం. ఎందుకంటే, వాటిని సరైన మోతాదులో, పద్ధతిలో తీసుకోవడం వలన మాత్రమే పూర్తి ప్రయోజనం పొందగలరు.

# సినిమా

## సింధూరం నుంచి తీసేస్తానంటే నిన్నే పెళ్లాడతా చేశా



టాలీవుడ్ స్టార్ హీరోల్లో మెగాస్టార్ చిరంజీవి తర్వాత అంత స్ఫూర్తిదాయకమైన ప్రయాణం అంటే మాస్ రాజా రవితేజదే. అసిస్టెంట్ డైరెక్టర్‌గా ప్రయాణం మొదలుపెట్టి.. చిన్న చిన్న పాత్రలతో ప్రతిభ చాటుకుని.. చాలా ఏళ్ల స్ట్రగుల్ తర్వాత హీరోగా అవకాశాలు అందుకుని.. ఆ తర్వాత టాలీవుడ్ టాప్ స్టార్లలో ఒకడిగా ఎదిగాడు రవితేజ. కెరీర్ ఆరంభంలో పడ్డ కష్టాల గురించి అతను అప్పుడప్పుడూ ఇంటర్వ్యూల్లో ఓపెన్ అవుతుంటాడు.ఈ నెల 31న తన కొత్త చిత్రం మాస్ జాతర రిలీజవుతున్న నేపథ్యంలో.. దీపావళి కానుకగా విడుదలవుతున్న తెలుసు కదాలో హీరోగా చేసిన సిద్ధు జొన్నలగడ్డతో కలిసి కంబైన్డ్ ఇంటర్వ్యూలో పాల్గొన్నాడు మాస్ రాజా. ఇందులో కెరీర్ తొలి రోజుల సంగతులను రవితేజ గుర్తు చేసుకున్నాడు. దర్శకుడు కృష్ణవంశీ.. తనను బెదిరించి నిన్నే పెళ్ళాడతాలో నటింపజేసిన విషయాన్ని అతను బయటపెట్టాడు. రవితేజ సినిమా కెరీర్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా మొదలైంది. కానీ అతను ఇండస్ట్రీలోకి వచ్చింది నటుడు కావాలనే అట. కానీ కెరీర్ ఆరంభంలో చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదట. వరుసగా రిజెక్షన్లు ఎదురు కావడం.. రెకమండేషన్ల వల్ల అర్హత లేని వాళ్లకు మంచి పాత్రలు వెళ్లడం చూసి.. నటుడిగా ప్రయత్నాలు ఆపేసి అసిస్టెంట్ డైరెక్టర్‌గా మారాడట. ఐతే నిన్నే పెళ్ళాడతా సినిమాకు ఏడీగా పని చేస్తున్నప్పుడే.. సింధూరం సినిమాలో తనకు హీరోగా అవకాశం ఇస్తానని కృష్ణవంశీ మాట ఇచ్చినట్లు రవితేజ వెల్లడించాడు. కానీ అప్పటికే తనకు తగిలిన ఎదురు దెబ్బల దృష్ట్యా కృష్ణవంశీ నిజంగా తనను పెట్టి సినిమా తీస్తాడనే నమ్మకం తనకు ఉండేది కాదని రవితేజ చెప్పాడు. ఇదిలా ఉంటే.. నిన్నే పెళ్ళాడతా సినిమాలో ఒక పాత్ర చేయమని కృష్ణవంశీ తనను అడిగితే.. తాను చేయనని చెప్పేసినట్లు రవితేజ వెల్లడించాడు.

## కాంతార మరోసారి కుమ్మేసింది

మరో వీకెండ్ పూర్తిగా కాంతార చాప్టర్ 1 ఏ లెజెండ్ ఖాతాలోకి వెళ్ళిపోయింది. మొన్నటిదాకా వీక్ డేస్ వసూళ్లలో చెప్పుకోదగ్గ డ్రాప్ చూపించిన కాంతారా శనివారం ఆదివారం అనూహ్యంగా పుంజుకుని థియేటర్లను నింపేసింది. చాలా చోట్ల ఎక్స్ ట్రా షోలు యాడ్ చేయడం కనిపించింది. కొత్తగా రిలీజైన శశివదనే, ఆరి, కానిస్టేబుల్, మటన్ సూప్ లాంటివి కనీస స్థాయిలో మెప్పించలేకపోవడం కాంతారకు వరంగా మారింది. ఓజికి డీసెంట్ ఆక్యుపెన్సీలు కనిపించినా రిషబ్ శెట్టి అంత దూకుడుగా పవన్ కళ్యాణ్ లేకపోవడం ఫిగర్స్ లో కనిపిస్తోంది. రెండింటి మధ్య వారం వ్యత్యాసం ఉండటం ఇక్కడ గుర్తుపెట్టుకోవాల్సిన విషయం.అయిదు వందల కోట్ల గ్రాస్ మొదటి పది రోజుల లోపే సునాయాసంగా దాటేసిన కాంతార చాప్టర్ 1 ఏ లెజెండ్ ఇంకో మూడు నాలుగు రోజుల్లో ఏడు వందల కోట్లు ఈజీగా అందుకుంటుంది. కాకపోతే ఈ వీక్ యూత్ ఫుల్ మూవీస్ ఉన్న నేపథ్యంలో కలెక్షన్లు తగ్గే



అవకాశాలు లేక పోలేదు. డ్యూడ్, కె ర్యాంప్, తెలుసు కదా, మిత్రమండలిలో ఒకటి రెండు సినిమాలకు పాజిటివ్ టాక్ వచ్చినా కొంత ప్రభావం కాంతార చాప్టర్ 1 మీద ఉంటుంది. నిన్న ఒక్క రోజే సుమారు యాభై అయిదు కోట్ల దాకా గ్రాస్ వచ్చి ఉండొచ్చని ట్రేడ్ అంచనా. హొంబాలే నుంచి అధికారిక నెంబర్లు రావడానికి కొంత టైం పట్టొచ్చు. ఓవర్సీస్ లో బ్రేక్ ఈవెన్ కోసం పోరాడుతున్న కాంతార చాప్టర్ 1 ఇండియాలో మాత్రం సూపర్ బ్లాక్ బస్టర్ గా నిలిచింది. హిందీలో రెస్పాన్స్ పెరుగుతున్న వైనం గుర్తించిన రిషబ్ శెట్టి ప్రత్యేకంగా అక్కడి సింగల్ స్క్రీన్లకు వెళ్లి మరీ ఫ్యాన్స్ ని పలకరిస్తున్నాడు. వరసగా ఇంటర్వ్యూలు ఇస్తున్నాడు. బాలీవుడ్ లో వంద కోట్లు దాటుతుందని ఎవరూ ఊహించలేదు.

## గాంధీపై చెవాకులు.. సారీ చెప్పిన శ్రీకాంత్ భరత్

మంచి నటుడిగా పేరు తెచ్చుకున్నప్పటికీ.. సోషల్ మీడియాలో తరచుగా వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ కాంట్రవర్శల్ పర్సన్‌గా ముద్ర వేసుకున్నాడు శ్రీకాంత్ అయ్యంగార్ అలియాస్ శ్రీకాంత్ భరత్. ఇటీవల అతను మహాత్మా గాంధీ మీద చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారమే రేపాయి. గాంధీని వాడు వీడు అని సంబోధిస్తూ ఆయన మనకు స్వాతంత్ర్యం తేవడమేంటి.. సుభాష్ చంద్రబోస్ తెచ్చాడు అంటూ వ్యాఖ్యానించాడు శ్రీకాంత్. అంతటితో ఆగకుండా



గాంధీని పీడోఫైల్ అంటూ తీవ్రమైన కామెంట్ చేశాడు.ఇది గాంధీ అభిమానులకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. శ్రీకాంత్ మీద పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేసే వరకు వ్యవహారం వెళ్లింది. తాజాగా కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్.. మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ప్రెసెడెంట్ మంచు విష్ణును కూడా కలిసి శ్రీకాంత్ మీద ఫిర్యాదు చేశారు. ఈ వ్యాఖ్యలపై ఇండస్ట్రీ స్పందించాలని.. కఠిన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. వ్యవహారం కాస్త ముదిరేసరికి శ్రీకాంత్ క్షమాపణ చెబుతూ వీడియో రిలీజ్ చేశాడు. ఐతే ఈ వీడియోలో శ్రీకాంత్ ఎక్కడా గాంధీ పేరెత్తలేదు. తాను చేసిన ఫలానా వ్యాఖ్యలకు క్షమాపణలు చెబుతున్నా అనలేదు. తన వల్ల ఈ మధ్య చాలామంది హర్టయ్యారని తెలిసిందని.. వాళ్లందరికీ బేషరతుగా క్షమాపణ చెబుతున్నానని, తనను అందరూ క్షమించాలని శ్రీకాంత్ కోరాడు. తన వ్యాఖ్యల ఉద్దేశం వేరని, తనను తప్పుగా అర్థం చేసుకున్నారని అతను వ్యాఖ్యానించాడు. అదే సమయంలో మరోసారి గాంధీ మీద పరోక్షంగా కొన్ని వ్యాఖ్యలు చేశాడు శ్రీకాంత్.మన దేశానికి స్వాతంత్ర్యం తెచ్చి పెట్టడం కోసం ఎందరో పోరాడారని.. ప్రాణాలను త్యాగం చేశారని.. కానీ ఒక్క వ్యక్తికే మొత్తం క్రెడిట్ కట్టబెట్టడం కరెక్ట్ కాదని శ్రీకాంత్ అన్నాడు. అందరుస్వాతంత్ర్య సమరయోధులనూ గుర్తుంచుకోకపోవడం కంటే వారిని విస్మరించడం నేరమని.. కాబట్టి అందరికీ క్రెడిట్ దక్కాలన్నట్లుగా శ్రీకాంత్ మాట్లాడాడు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన అందరికీ తాను క్షమాపణలు చెబుతున్నట్లు శ్రీకాంత్ పేర్కొన్నాడు.

## రెండుసార్లు ప్రేమలో పడ్డా..



ఊహలు గుసగుసలాడే అనే చిన్న సినిమాతో కథానాయికగా పరిచయమై మంచి బ్రేక్ అందుకున్న ఉత్తరాది భామ రాశి ఖన్నా.. తర్వాతి కాలంలో తెలుగు వారికి ఎంతో ఇష్టమైన హీరోయిన్‌గా ఎదిగింది. తొలి ప్రేమ సహా కొన్ని సూపర్ హిట్ చిత్రాల్లో నటించి స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. తెలుగులో మధ్యలో కొంచెం గ్యాప్ వచ్చినా.. తెలుసు కదా, ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రాలతో మళ్లీ బిజీ అయింది. తెలుసు కదా దీపావళి కానుకగా విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో మీడియాకు ఇంటర్వ్యూలు ఇస్తోంది రాశి.ఓ ఇంటర్వ్యూలో ఆమె తన లవ్ లైఫ్ గురించి ఆసక్తికర విషయాలు చెప్పింది. ఇప్పటిదాకా తాను ఇద్దరు వ్యక్తులతో ప్రేమలో పడ్డట్లు రాశి వెల్లడించింది. సినీరంగంలోకి రావడానికి ముందే తనకు ఒక లవ్ స్టోరీ ఉందని రాశి తెలిపింది. కానీ అది మధ్యలో ఆగిపోయిందని ఆమె చెప్పింది. ఇక సినిమాల్లోకి వచ్చాక కూడా తాను ఒక వ్యక్తి ప్రేమలో పడ్డానని రాశి చెప్పింది. కానీ ఆ రిలేషన్‌షిప్ ఇంకా కొనసాగుతోందా లేదా అన్నది మాత్రం తాను చెప్పనని ఆమె తేల్చేసింది. ఇక తన కెరీర్ గురించి రాశి ఖన్నా మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉస్తాద్ భగత్ సింగ్‌తో పాటు నాలుగు హిందీ చిత్రాల్లో నటిస్తున్నట్లు వెల్లడించింది. తన కెరీర్లో కథ కూడా వినకుండా ఒప్పుకున్న

## ప్రత్యేక పూజలు చేసిన సమంత..

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత 'ఖుషి' సినిమా తర్వాత సినిమాలకు దూరం అయినప్పటికీ నిర్మాతగా మళ్లీ రీఎంట్రీ ఇచ్చింది. ఇప్పటికే తన మొదటి చిత్రాన్ని తెరకెక్కించి ప్రేక్షకులను అలరించింది. అలాగే సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టీవ్‌గా ఉంటూ నిత్యం పలు పోస్టులతో వార్తల్లో నిలుస్తోంది. తాజాగా, సమంత ఇన్‌స్టాగ్రామ్ ద్వారా కొన్ని ఫొటోలు షేర్ చేసింది. ఇక ఇందులో తన గృహప్రవేశానికి సంబంధించినవిగా తెలుస్తోంది. తన కొత్త ఇంట్లో రాజ్ నిడిమోరుతో కలిసి ప్రత్యేక పూజలు చేసినట్లు



అర్థమవుతోంది. తన ఇంటిని పువ్వులతో చాలా అందంగా ముస్తాబు చేసి ఆమె కూడా ట్రెడిషనల్ డ్రెస్‌లో ఉన్న ఫొటోలుకు షేర్ చేయడంతో.. అది చూసిన నెటిజన్లు శుభాకాం క్షలు చెబుతున్నారు. అలాగే ఆమె జిమ్ చేస్తున్న వీడియోలు, తన పెట్ డాగ్స్‌ను రాజ్ ముద్దు చేస్తున్న ఫొటోలను షేర్ చేసింది. కానీ అతని ముఖం కనిపించకుం డా.. జాగ్రత్త పడిన సామ్ చేతులను మాత్రమే నెట్టింట పెట్టడం గమనార్హం. ఈ గృహప్రవేశం అక్టోబర్ 2న జరిగినప్పటికీ.. ఇప్పుడు షేర్ చేసింది. కాగా.. సమంత సినిమాల విషయానికొస్తే.. త్వరలో ఆమె 'మా ఇంటి బంగారం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ మూవీ షూటింగ్ నవంబర్ నెలలో ప్రారంభం కాబోతున్నట్లు ఇటీవల వెల్లడించిన విషయం తెలిసిందే. తన సొంత నిర్మాణ సంస్థలోనే రాబోతున్న ఈ చిత్రానికి నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తున్నట్లు సమాచారం.


## ఆ హీరోను కించపరచడం కరెక్ట్ కాదు..

కిరణ్ అబ్బవరం, జైన్ నాని కాంబోలో రాబోతున్న లేటెస్ట్ మూవీ 'కె-ర్యాంప్'. యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తుండగా.. ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ అక్టోబర్ 18న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈక్రమంలో.. తాజాగా, ప్రమోషన్స్‌లో పాల్గొన్న కిరణ్ అబ్బవరం స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చాడు. మీరు ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా వచ్చారు. స్టార్ అయ్యేందుకు కష్టపడుతున్నారు.. బ్యాక్‌గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీలో సాధ్యమే అంటారా అని ఓ లేడీ యాంకర్ ప్రశ్నించగా.. ఈ విషయంపై కిరణ్ అబ్బవరం స్పందిస్తూ.. "మీరు ఇలాంటి ప్రశ్నలు నన్ను ఎన్ని అయినా అడగండి పర్లేదు. నేను వాటికి సమాధానం చెబుతాను. కించపరిచే ప్రశ్నలు అడగడం కరెక్ట్ కాదని నా అభిప్రాయం. నన్ను అడిగితే మీరు, నేను ఒకటిగా భావిస్తాను. నన్ను ఓ మాట అన్నా పడతాను. నాకు ఏదైనా చెప్పినా వింటాను. కానీ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఒక హీరోను పట్టుకుని నీ ముఖం



బాగా లేదు అని చెప్పకండి. అది విన్న తర్వాత నాకే చాలా బాధగా అనిపించింది" అని చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. యాంకర్‌కు దిమ్మతిరిగేలా చేసావని అంటున్నారు. అలాగే తోటి హీరోకు సపోర్ట్ చేసి గొప్ప మనసు చాటుకున్నావని ప్రశంసలు కురిపిస్తున్నారు. కాగా.. ఇటీవల ప్రదీప్ రంగనాథన్‌ను ఓ లేడీ యాంకర్ మీరు హీరో మెటీరియలక కాదు మీ ఫేస్ అంత బాగుండదు అని ప్రశ్నించిన విషయం తెలిసిందే. ఇది కాస్త వివాదాస్పదంగా మారింది. దీనిపై కిరణ్ అబ్బవరం ఆగ్రహం వ్యక్తం చేశాడు.

## కింగ్ తాలూకాలో అభిమాని ఎమోషన్స్



ఎనర్జిటిక్ స్టార్ రామ్ హీరోగా మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి ఫేమ్ మహేష్ బాబు దర్శకత్వంలో రూపొందిన ఆంధ్రకింగ్ తాలూకా నవంబర్ 28 విడుదల కానుంది. ఇంకో యాభై రోజుల కంటే తక్కువ సమయమే ఉండటంతో టీమ్ ప్రమోషన్లు మొదలుపెట్టేసింది. ఇప్పటికే రెండు పాటలు రిలీజ్ కాగా ఇవాళ టీజర్ ని తీసుకొచ్చారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం, ఉపేంద్ర టైటిల్ రోల్ పోషించడం, వివేక్ మెర్విన్ సంగీతం ఇలా చాలా ఆకర్షణలతో అంచనాలు పెంచేలా రూపొందిన ఈ ప్రాజెక్టు బిజినెస్ పరంగా కూడా క్రేజ్ సంపాదించుకుంది. ఇక టీజర్ విషయానికి వస్తే స్టోరీ పూర్తిగా రివీల్ చేయకుండా కట్ చేశారు.ఒక చిన్న పట్టణం. అందులో మధ్యతరగతికి చెందిన ఓ కుర్రాడు (రామ్). చిన్నప్పటి నుంచే తండ్రి (రావు రమేష్) చూపించిన సినిమా పిచ్చి నరనరాల్లో ఎక్కేసి ఆంధ్రకింగ్ బిరుదున్న హీరో (ఉపేంద్ర) ని ప్రాణం కన్నా ఎక్కువగా అభిమానిస్తూ ఉంటాడు. మొదటి రోజు ఫస్ట్ షో చూడనిదే, సంబరాలు చేస్తేనే జీవితంలో ఏదో సాధించినట్టు ఫీలవుతాడు. ఇతగాడికో లవ్ స్టోరీ (భాగ్యశ్రీ బోర్సే) కూడా ఉంటుంది. ఇలా లైఫ్ సాగుతూ ఉండగా అనుకోని సంఘటనలు జరుగుతాయి. తాను ప్రేమించే హీరోని ఇతరులు అవమానించే పరిస్థితి వస్తుంది. అదెందుకు జరిగింది, ఇతని లక్ష్యం ఏమిటి, చివరికి ఏం సాధించాడనేది తెరమీద చూడాలి. చాలా గ్యాప్ తర్వాత రెగ్యులర్ మాస్ వదిలి రామ్ తనకు సూటయ్యే పాత్రలో ఫ్రెష్ గా ఉన్నాడు. లుక్స్, యాక్టింగ్ అన్నీ ఒకప్పటి రామ్ ని గుర్తు చేశాయి. ఉపేంద్రని బహుశా ట్రైలర్ కోసం దాచి పెట్టరేమో ఇందులో చూపించలేదు. భాగ్యశ్రీ బోర్సే లుక్స్ సాంప్రదాయ బద్దంగా లవ్లీగా ఉన్నాయి. బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కంటెంట్ కు తగ్గట్టు సాగింది.

# అన్నా క్యాంటీన్ లో పేదలకు ఉచిత అన్నదానం నిర్వహించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



జగ్గంపేట అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి):జగ్గంపేట, స్థానిక కాకినాడ రోడ్ లోని ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద గత నాలుగు సంవత్సరాలుగా జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ కు ఈ వారం జగ్గంపేటగ్రామానికి చెందిన సాయిరాం స్టీల్స్ అధినేత గుణ్ణం వెంకటేశ్వరరావు ఆర్థిక సహాయంతో పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరై పేదలకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా ఎస్ వి ఎస్ అప్పలరాజు మాట్లాడుతూ సాయిరాం స్టిల్స్అధినేత గుణ్ణం శ్రీను ఆర్థిక సాయంతో అన్న క్యాంటీన్ లో పేదలకు అన్నదానం నిర్వహించామని, తొందరలోనే జగ్గంపేటలో ప్రభుత్వఅన్న క్యాంటీన్ ఏర్పాటు అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలోఎస్వీఎస్ అప్పలరాజు,కొత్త కొండబాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, మండపాక అప్పన్న దొర, దావర్తి సీతారామయ్య, మారిశెట్టి రాధా, మారిశెట్టి గంగ, దేగల సత్తిబాబు, ఎండి కాజా, బద్ది సురేష్, దుర్గపు ప్రకాష్, బోండావీర సత్య ,తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ మద్యానికి వ్యతిరేకంగా ప్రొద్దుటూరు లో నిరసన

- ర్యాలీలో వేలాదిగా తరలివచ్చిన మహిళలు
- నకిలీ మద్యం కేసులో చంద్రబాబునాయుడుని అరెస్టు చేయాలంటూ డిమాండ్
- పభుత్వం పాడెకట్టి మోసిన వైసీపీ నాయకులు
- నకిలీ మద్యం త్రాగితే అనారోగ్యం లేదా మరణం
- క్రైజ్ సిఐ సురేంద్రా రెడ్డికి వినతిపత్రం
- వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి



ప్రొద్దుటూరు, అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి): రాష్ట్ర వ్యాప్తంగా మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నకిలీ మద్యానికి వ్యతిరేకంగా సోమవారం తలపెట్టిన శాంతియుత నిరసన ప్రొద్దుటూరు లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో సాగింది. ర్యాలీలో వేలాదిగా మహిళలు తరలివచ్చారు. నకిలీ మద్యం కేసులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుని అరెస్టు చేయాలంటూ డిమాండ్ చేశారు. ప్రభుత్వం పాడెకట్టి మోసిన వైసీపీ నాయకులు. ప్రొద్దుటూరు పట్టణం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న గాంధీ పార్క్ నుంచి , జమ్మలమడుగు రోడ్డులోని ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం ఎక్సైజ్ సిఐ సురేంద్రా రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ ర్యాలీని ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం కల్తీ మద్యం తాండవం చేస్తోంది. త్రాగితే అనారోగ్యం లేదా మరణం. పేద, మద్య తరగతి వారు త్రాగే తక్కువ ధర మద్యమే అధిక శాతం మొలకల చెరువులో నకిలీ తయారైంది. కూటమి ప్రభుత్వం కేవలం ప్రజల నుండి ఆదాయాన్ని ఆశిస్తుందే తప్పా ప్రజల ప్రాణాలను గురించి ఆలోచించడం లేదు. నాణ్యమైన మద్యం అందించి, సంక్షేమ పథకాలను అందిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి అందుకు భిన్నంగా వ్యవహరించడం దారుణం. ప్రజలు ప్రస్తుతం సంక్షేమ పథకాల గురించి కాకుండా కేవలం నకిలీ మద్యం అందించి తమ భర్తల, కుమారుల ప్రాణాలు బలిగొనరాదని కోరుకుంటున్నారు. నకిలీ మద్యం కేసులో జయచంద్రారెడ్డిని, స్పిరిట్ సప్లై చేసిన బాలాజీ ని అరెస్టు చేయాలి. ఈ విషయంలో సిబిఐ తో సమగ్ర విచారణ జరపాలని. ఏపిలో బెల్ట్ షాపులు, పర్మిట్ రూం లు రద్దు చేయాలి. నకిలీ మద్యం ద్వారా మరణించిన వారికి ఆర్థిక సహాయం చేయాలి.

# ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

**కె శ్రీనివాసులు**




కర్నూలు అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి):రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ హాస్పిటల్స్ కి రావలసిన ఆరోగ్యశ్రీ పెండింగ్ నిధులు 2 వేల 700 కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు డిమాండ్ చేశారు సోమవారం నాడు స్థానిక సిఆర్ భవన్ నందు ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు బిసన్న లో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య శ్రీ ప్రచార ఆర్భాటం తప్ప, ఆచరణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అందుకు ఉదాహరణ ఆరోగ్యశ్రీ కింద నెట్ వర్క్ హాస్పిటల్ కి పెండింగ్ బిల్లు ఇవ్వకపోవడం అన్నారు దీనివల్ల హాస్పిటల్ యాజమాన్యాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురుకోవడమే కాకుండా అనేక పర్యాయాలు కూటమి ప్రభుత్వానికి వారి బాధలు తెలియజేసిన, పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోవడంతో హాస్పిటల్ యాజమాన్యాలు అక్టోబర్ 10వ తేదీ నుండి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేశారని దీనివల్ల సామాన్య మధ్యతరగతి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు అత్యవసర పరిస్థితుల్లో యాక్సిడెంట్ జరిగి ఆరోగ్యశ్రీ కింద హాస్పిటల్స్ కి వెళ్తే ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్యం సేవలు త్వరితగతిన దొరికేవి అయితే రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరిస్తూ హాస్పిటల్ యాజమాన్యాలకు పెండింగ్ బిల్లు విడుదల చేయకపోవడంతో వారు ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయడంతో రాష్ట్రంలో అత్యవసర వైద్యం అందక ఏ ఒక్కరి ప్రాణాలు పోయినా దానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించవలసి ఉంటుందని వారు హెచ్చరించారు ఈ సమావేశంలో ఏవైఎఫ్ నాయకులు కుమారు, రాజేంద్ర లు పాల్గొన్నారు.

# అమ్మ అనాధ వృద్ధుల శరణాలయం దాతల కోసం ఎదురుచూపు

వేంపల్లి, అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి): తల్లి కడుపు బిడ్డకు ఎంత రక్షణగా ఉంటుందో అందరూ ఉన్న అనాధలుగా వదిలేసిన వారికి తోడుగా నీడగా ఉండే అనాధ దేవాలయానికి కనీస వసతులు లేక విలవిలాడుతూ దాతల కోసం ఎదురుచూస్తున్న ఓ అనాధ శరణాలయం వివరాల్లోకెళితే వైయస్సార్ కడప జిల్లా వేంపల్లి, మేజర్ కేంద్రం, పులివెందుల రోడ్డు. రాజు, నగర్ కాలనీలో ఉన్న అమ్మ అనాధ వృద్ధుల శరణాలయం లో కనీస వసతులు లేక అనాధ వృద్ధ మహిళలు తీవ్ర కష్టాలను ఎదుర్కొంటూ గుప్పెట్లో ప్రాణాలు పెట్టుకుని జీవిస్తున్నారు.



రాత్రి సమయంలో సరిగ్గా విద్యుత్ లేక దోమలకు విష కీటకాలకు పగలు రాత్రి తేడా లేకుండా పందులు,కుక్కలు ఇష్టంవచ్చినరీతిలోతిరుగుతూ .భయపెడుతున్నాయని వృద్ధులు కన్నీటిపర్వతమయ్యారు.ప్రహరి గోడ లేకపోవడంతో మరింత ఇబ్బందికరంగా మారిందన్నారు ఎందరో నాయకులు ఆయా సందర్భాలలో వృద్ధాశ్రమానికి వచ్చి స్వచ్ఛంద సేవ కార్యక్రమాలు నిర్వహించి వెళ్తున్నారు. కానీ అక్కడ ఉన్న సమస్యలను పట్టించుకునే నాధుడే లేరని ఆ వృద్ధ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అక్కడ ఉన్న ప్రధాన సమస్యలు విద్యుత్ టాయిలెట్ గదులు ,సరియైన నివాసం, ప్రహరి గోడ,ప్రధమచికిత్స కిట్స్. వృద్ధులకుసరియైన పోషక ఆహార ధాన్యాలు.

ఈ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం,జిల్లా ఉన్నత అధికారులు ఈ వృద్ధాశ్రమం ను సందర్శించి అందులో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అలాగే అమ్మ అనాధ వృద్ధాశ్రమాన్ని అన్ని వసతులనుకల్పించాలని ఆశ్రమ నిర్వాహకుడు వెంకటసుబ్బయ్య, అనాధ వృద్ధ మహిళలు అధికారుల కోసం దాతల కోసం ఎదురు చూస్తున్నట్లు వారు తెలిపారు.


# డిఎడబ్ల్యూ మహర్షి స్కూల్ పై ఫేల్ ఏమైంది

**-టిడిపి మాజీ ఇంచార్జ్ ప్రవీణ్ కుమార్ రెడ్డి**



ప్రొద్దుటూరు,అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి): టిడిపి మాజీ ఇంచార్జ్ ప్రవీణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి గతంలో చెప్పినట్లు డిఎడబ్ల్యూ, మహర్షి స్కూల్ పై ఫేల్ ఏమైంది. రాచమల్లు వాయిస్ ఫర్ సేల్ అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఏదైనా ఒక సమస్యపై ఆయన మాట్లాడి అందుకు సంబంధించి మామూళ్ళు అందగానే మిన్న కుంటారు. అసాంఘిక కార్యకలాపాలు, భూకబ్జాల ద్వారా ధనార్జన చేసి, ఇంకా ధనార్జన పై ఆశ చావడం లేదు. ఎగ్జిబిషన్ పై తాను ప్రశ్నించాలంటున్నారు. గతంలో తాను ప్రతిపక్షంలో వుండగా ధర్నా చేశాను, ప్రశ్నించలేని ప్రజల పక్షాన ప్రతిపక్షం ప్రశ్నించాలి. రాజ్యాంగ బద్ద పదవులలో, మాజీ ఎమ్మెల్యే గా వున్న వ్యక్తులు ప్రజల పక్షాన ఎగ్జిబిషన్ ని సందర్శించి నిరసన వ్యక్తం చేయలేరా. తాను ఏ రాజ్యాంగ బద్ద పదవిలో లేకున్నా గతంలో ప్రజల కోసం పోరాడాను. ఇప్పుడు వారు ప్రతిపక్షం పాత్ర పోషించలేకున్నా చెప్పాలి. ప్రక్క పేర్లతో తనను భవిష్యత్తులో పిలిస్తే తాను వారిని ఇకపై రోజుకో పేరుతో పిలుస్తా. డిఎడబ్ల్యూ, మహర్షి స్కూల్ పై వారి చర్యలేమిటో తెలపాలి.

# రైలు క్రింద పడి వ్యక్తి మృతి



ప్రొద్దుటూరు, అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి): ప్రొద్దుటూరు రైల్వే స్టేషన్ మరియు పెన్నా నది బ్రిడ్జి మధ్యలో ఒక గుర్తు తెలియని వయసు సుమారు 50 నుండి 55 సంవత్సరములు కలిగి ఉన్న మగ వ్యక్తి నంద్యాల రేణిగుంట్ల డెమో ట్రైన్ కిందపడి సోమవారం ఉదయం 8:30 గంటలకు రైలు కింద పడి చనిపోయాడు సమాచారం మృతుని యొక్క తల పూర్తిగా గుర్తుపట్టలేని స్థితిలో ఉండినది. ఆచూకీ తెలిసిన యెడల ఎర్రగుంట్ల రైల్వే పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఫోన్ నెంబర్ 9700675792 తెలియజేయగలరు అని ఆయన కోరారు.

# ఆర్.సి.యం ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ

- విషయంలో జరిగిన అక్రమాలపై అవకతవకలపై విజిలెన్స్ ఎంక్వయిరీ జరిపించాలని
- ప్రగతిశీల విద్యార్థి యువజన సమైక్య రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రభుత్వానికి ఫిర్యాదు



కడప అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి): ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ఆర్.సి.యం ఎయిడెడ్ పాఠశాలలలో ఉపాధ్యాయుల భర్తీ విషయంలో 2023వ సంవత్సరానికి సంబంధించిన నోటిఫికేషన్ ద్వారా ఎలాంటి రోస్టర్ పాయింట్లు పాటించకుండా ఆర్.సి.యం దయాసిస్ డీజి ఎం జాన్సన్ చిట్టూరి ఆధ్వర్యంలో భర్తీ చేసిన ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేయాలని ప్రగతిశీల విద్యార్థి యువజన సమైక్య రాష్ట్ర కన్వీనర్ ఓబులేష్ కత్తి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో పాల్గొన్న జిల్లా అధికారి నిత్యానంద రాజు కి ఆర్ సి ఎం పోస్టులలో జరిగిన అవకతవకలపై తప్పుడునోటిఫికేషన్ పై రోస్టర్ పాటించని విధానాన్నిపై టెట్ క్వాలిఫై కానీ విధానాన్ని పై కులం మార్పిడిలపై విజిలెన్స్ ఎంక్వైరీ జరిపి తప్పులను ప్రోత్సహించిన జిల్లా విద్యాశాఖ అధికారులతో పాటు చర్యలు తీసుకుని ఆర్ సి ఎం నోటిఫికేషన్ రద్దు చేయాలని ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పి ఎస్ వై ఎస్ జిల్లా కన్వీనర్ బయన్న,దాసు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అమీర్ బాబు పుట్టినరోజు వేడుకలు

**-టిడిపి నాయకులు**

కడప అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి): మాజీ టిడిపి ఇన్చార్జి రాష్ట్ర మైనార్టీ నాయకుడు అమీర్ బాబు పుట్టినరోజు వేడుకలు కడపలో ఆయన అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పట్టణ నిరాశ్యుల గృహమైన ప్రేమాలయం నందు ఆమిర్ బాబు పేదలకు పండ్లు, స్వీట్స్ ను, అలాగే పేదలకు అన్నదానం కార్యక్రమం చేశారు. అనంతరం అమీర్ బాబు మాట్లాడుతూ సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు అంటూ తెలుగుదేశం పార్టీ నినాదాలు ఆయన తెలిపారు. అనంతరం టిడిపి నాయకులు ఆయన అభిమానులు కొండ సుబ్బయ్య, ఆమూరు బాల దాసు లు మాట్లాడుతూ అమీర్ బాబు గత 40 సంవత్సరాల నుంచి తెలుగుదేశం పార్టీకి ఎన్నో సేవలు చేసి అంచలంచలుగా ఎదిగారని కడప నగరంలో తెలుగుదేశం పార్టీ జెండా కట్టేలేని స్థితిలో ఉంటే అమీర్ బాబు హేమ హేమలను కూడా ఎదిరించి తెలుగుదేశం పార్టీ కోసం నిలబడిన వ్యక్తి అని తనను అడిగితే ఎలాంటి సహాయం అయినా ఆయన చేస్తారని పేదలకు ఇప్పటికి కూడా ఉచిత కల్యాణ మండపాన్ని వివాహాలకు అందిస్తున్నాడని, కరోనా సమయంలో తన బంధువుల సహాయంతో ఎంతోమందికి దగ్గరుండి దహన సంస్కారాలు చేశాడని మచ్చలేని నాయకుడు మంచి మనసున్న గొప్ప మనిషి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దస్తగిరి నజీర్ అలీ, అరీ పుల్ల ఖాన్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# రిమ్స్ హాస్పిటల్ నందు పేషెంట్లు అవస్థలు



కడప, అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి): కడప పట్టణంలో రిమ్స్ హాస్పిటల్ నందు పేషెంట్లు అవస్థలు ఎన్డీఏ ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వెంటనే కడప రిమ్స్ లో స్టాఫ్ ను పెంచి వృద్ధులకు అనారోగ్యవంతులకు కూర్చునే దానికి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఎక్స్రే టోకన్ నెంబర్ రాయుచున్న ఒక అతనిని పేట్టీ ఒక అతను వల్ల రాయడం కాక వందల సంఖ్యలో క్యూ లైన్ లో నించోలేక కూర్చోలేక పడుతున్నటువంటి ఇబ్బందులు పట్టించుకోని యాజమాన్యం అన్నారు.ఎక్స్రే రూమ్ దగ్గర ఖాళీగా ఉంటున్న స్టాఫ్ ను ఇంకొకరిని అక్కడ కూర్చోమని అడగగా ఆ పనికి ఒక స్టాఫ్ మాత్రమే అని సమాధానం ఇస్తున్న స్టాఫ్ నర్స్ అని అన్నారు.ఓపి విభాగం దగ్గర డాక్టర్ల దగ్గర నుంచి ఎక్స్రే తీయించుకొనుటకు వచ్చినటువంటి పేషెంట్లు వందల కొలది క్యూ లైన్ లో నిలుచుండి కూర్చోనీకి చెర్లు లేక ఇబ్బందులు పడుతున్నటువంటి పేషెంట్లు వృద్ధులు షుగర్ బిపి గల పేషెంట్లు కూర్చొని స్థలము లేక ఇబ్బందులు పడుతున్న పేషంట్ల మీద మానవతా దృకృథం లేని రిమ్స్ యాజమాన్యం వెంటనే రిమ్స్ యాజమాన్యం ఈ వృద్ధులకు బీపీ షుగర్ అలసరి ఉన్న పేషంట్లకు తక్షణమే కూర్చునేదానికి ఏర్పాటు చేయాలని కోరారు.

# ఇర్రి పాకలో దేశం కోసం ధర్మం కోసం స్వయం సహాయక సంఘం (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాలు



జగ్గంపేట అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి): రాష్ట్రీయ స్వయంసేవక సంఘం (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాలు జగ్గంపేట మండలం ఇర్రిపాకలో ఘనంగా జరిగాయి. నియోజవర్గ స్థాయిలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, భారతీయ ధర్మ పరిషత్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు, పాలచర్ల నాగేంద్ర చౌదరి ముఖ్య అతిథిగా హాజరై స్వయం సేవకులకు ఉత్సాహాన్ని నింపే దేశం కోసం ధర్మం కోసం ఆర్ఎస్ఎస్ అంటూ ఉత్తేజ భరిత మాటలతో ప్రసంగం చేశారు, నాగేంద్ర చౌదరి మాట్లాడుతూ రానున్న రోజుల్లో జగ్గంపేట పరిసర ప్రాంతాల్లో స్వయం సేవకులును, కుల బేధం లేకుండా ఒకటే కులం హిందూ కులం అన్న భావంతో ప్రతి ఊరు నుంచి కూడా అధిక సంఖ్యలో దేశానికి ధర్మానికి సేవ చేసే వారిని తీసుకువచ్చి ఆర్ఎస్ఎస్ లో జాయిన్ చేస్తామని ఆర్ఎస్ఎస్ సేవలు ప్రతి పల్లెటూర్లు కూడా ఇంటింటికి ప్రచారం చేస్తామని తెలియజేశారు. ఆర్ఎస్ఎస్ దేశంలోనే అతిపెద్ద సంస్థని ఎంతోమంది మహనీయులు కుటుంబాలను కూడా వదులుకొని ఆర్ఎస్ఎస్ కి సేవలందించారని నాగేంద్ర చౌదరి కొనియాడారు, గల్లీ నుంచి ఢిల్లీ దాకా కూడా ఆర్ఎస్ఎస్ హిందూ మతాన్ని ప్రోత్సహిస్తూ హిందూ ధర్మాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్తూ గో సంరక్షణ, రైతులకు, విద్యార్థులకు, డాక్టర్లకు, వ్యాపారస్తులకు, బడుగు బలహీన వర్గాలకు, ఎన్నో అనుబంధ సంస్థల ద్వారా ఆర్ఎస్ఎస్ సేవలందిస్తుందని తెలియజేశారు, అయోధ్యలో రామ్ మందిర్ నిర్మాణానికి ఆర్ఎస్ఎస్ ఎంతో శ్రమించి విజయం సాధించారని అలాగే మన ఆంధ్రప్రదేశ్లో జరిగిన హైందవ శంఖారావం కార్యక్రమం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిందని మహా కుంభమేళా కొన్ని కోట్ల మంది ప్రజలు వస్తున్న సరే అక్కడ స్వయం సేవకులు ప్రత్యేక సేవలు అందించాలని విపత్తుల సమయంలో కూడా ఆర్ఎస్ఎస్ ఎన్నో సేవలు అందిస్తుందని తెలియజేశారు, ఎన్నో ఆధ్యాత్మిక హిందూ కార్యక్రమాలు చేస్తున్నారని ఈ సందర్భంగా తెలియజేశారు, ఆర్ఎస్ఎస్ చాలా నిబద్ధంతో క్రమశిక్షణతో కూడిందని ఎంతోమంది ఈరోజు దేశ నాయకులుగా, దేశాన్ని పరిపాలిస్తున్నారంటే వారందరూ కూడా ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన వారే అని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో, ఏనుగు సుబ్రహ్మణ్యం, కోరుమిల్లి నాగేశ్వరరావు, నాగం శ్రీనివాస్, వి, రాఘవరావు, బండారు అనిల్ కుమార్, గంగ శివ నారాయణ, అధిక సంఖ్యలో ఆర్ఎస్ఎస్ సేవకులు పరిసర ప్రాంత గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# తంటికొండ వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గా బదిరెడ్డి అచ్చన్న దొరను నియమిస్తూ ప్రభుత్వం జీవో విడుదల

**-మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ను కలిసిన చైర్మన్ అచ్చన్న దొర.**



గోకవరం అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి): జగ్గంపేట నియోజకవర్గం గోకవరం మండలం తంటి కొండ వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గా నియమిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. సోమవారం జగ్గంపేట లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో జగ్గంపేట శాసనసభ్యులు, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులు జ్యోతుల నెహ్రూను, జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా అచ్చన్న దొర మాట్లాడుతూ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గారి సహకారంతో తంటికొండ దేవస్థానం పునర్నిర్మాణం చేస్తామని వచ్చే భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలక్కుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని ప్రతి శనివారం దేవస్థానం కొచ్చే భక్తులకు అన్న ప్రసాదం అందిస్తున్నామని కార్తీకమాసం నెల రోజులు ప్రతిరోజు అన్నదానం నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దాసరి సీతారామకృష్ణ, మలిరెడ్డి సిరి, గోకవరం టౌన్ టిడిపి అధ్యక్షులు పైలా శ్రీను, తంటికొండ దేవస్థానం బోర్డు సభ్యులుబొట్టారామకృష్ణ,చప్పిడి పెంటరాజు, చింతల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# మోడీ పర్యటనను వ్యతిరేకించండి

- సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి బి.వెంకట స్వామి



కర్నూలు అక్టోబర్ 13 (వుదయం ప్రతినిధి): దేశ ప్రధాని మోడీ కర్నూలు పర్యటనను ప్రజలు వ్యతిరేకించాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి బి. వెంకటస్వామి పిలుపునిచ్చారు.కర్నూలు నగరంలో గోకారి భవన్ నందు ప్రజాసంఘాల కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో 15వ తేదీన జరుగు నిరసన ధర్నాకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం 10 సార్లు కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటికీ రాష్ట్రానికి గాని మన జిల్లాకు గాని ఎటువంటి లాభం చేకూరాలేదని ప్రతి బడ్జెట్లోనూ మనకు మొండి చెయ్యి చూపించే తప్ప మనకు తగిన ప్రాధాన్యత కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇవ్వలేదని ఆ రకంగా కుట్రలు పన్నారని వారు వివరించారు. తిరుపతిలో తిరుమల వెంకన్న సాక్షిగా బహిరంగ సభలో 5 కోట్ల ఆంధ్ర ప్రజలకు ప్రత్యేక హోదా ఇస్తామని అది కూడా 15 సంవత్సరాల వరకు ఇంప్లిమెంట్ చేస్తామని చెప్పిన మోడీ ,షాలు తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామికి శఠగోపం పెట్టిన ఘనత వీరిదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ నాయకత్వంలోని ఎన్ డి ఏ ప్రభుత్వం ఒక్కటంటే ఒక్కటి కూడా విభజన హామీలు అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయలసీమ డిక్లరేషన్ ప్రకటిస్తామని చెప్పిన బిజెపి నాయకులు ఎందుకు అమలు చేయలేదని వారు ప్రశ్నించారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏది అని వారు ప్రశ్నించారు. రాష్ట్రంలో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ అమ్మేస్తాం అంటున్నారు ఇదేనా మీరు మాకు చెప్పే దేశభక్తి అని వారు ప్రశ్నించారు. ఈ జిల్లాకు రాష్ట్రానికి మీరు చేసిన అభివృద్ధి ఏమిటి అని వారు ప్రశ్నించారు. అన్ని రకాలుగా కర్నూలు జిల్లా కి మొండి చేయి ఇచ్చారని ఎద్దేవా చేశారు అమరావతి రాజధాని అభివృద్ధి కోసం చెంబు నీళ్లు ,గుప్పెడు మట్టి ఇచ్చిన సంగతి గుర్తుందని వారు వివరించారు. 16 నెలలలో మీరు నాలుగు సార్లు మా రాష్ట్రానికి వచ్చారని రాష్ట్ర అభివృద్ధి కోసం ఏం చేశారని ప్రశ్నించారు. దేశంలో నిరుద్యోగులకు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు నోటిఫికేషన్ ఎక్కడ ఇచ్చారని రాష్ట్రానికి ఇచ్చిన ఉద్యోగాలు ఎన్ని అని అన్నారు. విద్యా వ్యవస్థను కాసాయికరణ, ప్రైవేటీకరణ చేయడానికి నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చారని ఇది దేశ విద్యారంగానికి పెనుప్రమాదమని అన్నారు. కావున ఈనెల 16వ తేదీన కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా పర్యటనను ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.భాస్కర్, జోహలపురం రాజు, సురేష్ నాయక్, మహేంద్ర, రమణ, రవి, తిరుపాల్, ఓబులేష్ మొదలైన వారు పాల్గొన్నారు.

Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at Sai Sree Offset Printers, # 7-17-166, 3rd line, Srinagar, Guntur - 522002 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : SIRIKONDA MARIA, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.